ఆదివారం గత వారంరోజుల వార్తల విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-3-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 53 పేజీలు: 10+4 వెల: 6.50

కాలుష్య దేశాల్లో పాక్ -1 ఆరోస్థానంలో భారత్ 5

మావోయిస్టు అగ్రనేత పాపారావు లొంగుబాటు 7

యుద్ధ విరమణకు పాక్ ఆర్మీ చీఫ్ మధ్యవర్తిత్వం 5

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇతర ఉన్నతాధికారులతో మునీర్ చర్చలు

అమెరికా నిలిపివేసినా మేం దాడులు

ఆపం: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

యుద్ధ చట్టాలను ఉల్లంఘించిన ఇరాన్: హ్యూమన్ రైట్స్ వాచ్



# హార్ముజ్‌ను తక్షణమే తెరవాలి..

## యుద్ధానికి భారత్ వ్యతిరేకం

శాంతియుత చర్చలతోనే పరిష్కారం

మూడు దేశాలు చర్చల ద్వారానే విభేదాలు పరిష్కరించుకోవాలి

ట్రంప్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ



**న్యూఢిల్లీ, మార్చి 24:** పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలిక బ్రేక్ పడిన తర్వాత తొలిసారిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధానిమోడీతో టెలిఫోన్‌లో >>2

# డీలిమిటేషన్‌పై పోరాటం

జనాభా ఆధారంగా సీట్లు పెంచితే దక్షిణాదికే నష్టం

వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపిని ఓడిస్తాం



ప్రజలు నాకు 2034 దాకా అవకాశం ఇస్తారు

కెసిఆర్‌ది కుటుంబ సమస్య: ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి24:** దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని బిజెపి అనుకుంటోందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న నియోజకవర్గాల డిలిమిటేషన్,50 శాతం పార్లమెంట్ స్థానాల పెంపు పై ఢిల్లీలో ఒక టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఎంపీ స్థానాల్లో ఉత్తరాది దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం ఎంత ఉందో అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలని ఆయన స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్రం అన్యాయం,వివక్ష చూపుతుందన్నారు. జనాభా ఆధారంగా సీట్లు పెంచితే దక్షిణాదికే నష్టం, దక్షిణాది రాష్ట్రాలు డిలిమిటేషన్ పై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 50 శాతం సీట్ల పెంపు ఏ లెక్కల ప్రకారం జరుగుతుందని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 50 శాతం సీట్ల పెంపు వల్ల కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో మా(దక్షిణాది రాష్ట్రాల) అవసరం లేకుండా పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుందన్నారు. జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని, అన్ని పక్షాలతో చర్చ జరిపి సీట్ల పెంపుపై ముందుకు వెళ్ళాలని కేంద్రాన్ని కోరారు. నియోజకవర్గాల పెంపు దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకం అని పేర్కొన్నారు. ఉత్తర భారతానికి దక్షిణ భారతానికి మధ్య అంతరాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పెంచుతుందని, దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బిఆర్‌ఎస్,బిజెపి రెండింటిని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తుందని, ఒక దెబ్బకు రెండు పిట్టలు కొట్టాలన్నది నా లెక్క అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నాకు తెలంగాణ ప్రజలు 2024-34 వకు అవకాశం ఇస్తారని.ఇది తెలంగాణ ట్రెడిషన్ అని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు గుండు సున్నా వచ్చింది, తర్వాత ఎన్నికల్లో డిపాజిట్లు పోయాయని తెలిపారు. తెలంగాణలో ఉప ఎన్నికల్లో,పంచాయతీ,మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయారని, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కెటిఆర్ బెట్టింగ్ పెట్టించారని అయినా ఓడిపోయారని పేర్కొన్నారు. కెసిఆర్ నాకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమే, నాకు వ్యక్తిగతంగా సమస్యలు లేవన్నారు. కెసిఆర్ కుటుంబంలోని వారే పదవుల కోసం పాకులాడుతున్నారని, వారసత్వ రాజకీయాల కోసం కూతురు,కొడుకు పోటీ పడుతున్నారన్నారు. కెసిఆర్ ప్రతిపక్ష పాత్ర పోషించాలి గవర్నర్ స్పీచ్‌లో కెటిఆర్,బడ్జెట్‌పై హరీష్‌రావు మాట్లాడారని, కెసిఆర్ ది కుటుంబ సమస్య అని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మరోసారి గత ప్రభుత్వంపై కేంద్రం తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర,ఆర్థిక పరిస్థితి,మూసీ ప్రాజెక్టు,ప్రధాని నరేంద్రమోడీ పనితీరుపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. నా చేతికి అప్పుల రాష్ట్రాన్ని ఇచ్చారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే తాము అభివృద్ధి పనులు చేపడుతున్నామని >>2



తెలంగాణ అసెంబ్లీకి మరో

# 60 సీట్లు!

ఎపి అసెంబ్లీకి 88 సీట్లు పెరిగే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి24:** త్వరలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను, అలాగే పార్లమెంట్ స్థానాలను కేంద్రం పెంచబోతున్న సంగతి తెలిసిందే. అటు అసెంబ్లీలలో, ఇటు పార్లమెంట్‌లో 50 శాతం సీట్లను కేంద్రం పెంచబోతుంది. అలాగే, 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్‌కోటాను కూడా అమలు చేయనున్నారు. ఇక ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 ఎంపీ సీట్లు ఉండగా >>2

మతం మారితే ఎస్సీ

# హోదా కట్

రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవు..

సుప్రీం కోర్టు సంచలన తీర్పు

ఎపి హైకోర్టు తీర్పునకు సమర్థన



**విజయవాడ,మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) లేదా షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) చెందిన వారు క్రైస్తవం, ఇస్లాం వంటి ఇతర మతాల్లోకి మారితే, వారికి రాజ్యాంగబద్ధంగా లభించే కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తించవని సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన వారి ఎస్సీ హోదాకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పలు విషయాలు ప్రస్తావించింది. క్రిస్టియన్ మతంలోకి మారాక ఎస్సీ హోదా ఉండదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాల్లోకి మారితే ఎస్సీ హోదా వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం >>2



ఇక యేటా

## సిఎం కప్ పోటీలు

తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాత వార్త:** తెలంగాణ మట్టిలోని మాణిక్యాల క్రీడా ప్రతిభను వెలికితీసి, మరింతగా సానపెట్టేందుకే సీఎం కప్ పోటీలను నిర్వహించామని, ఈ కప్‌ను నిరంతర కార్యక్రమం లాగా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. >>2

ఇ- కార్ రేసులో ఆర్‌బిఐ రూల్స్

# తుంగలోకి..

ఎసిబి చార్జిషీటులో కీలక అభియోగాలు

అనూహ్యంగా స్పోర్ట్స్ కన్సల్టెంట్ పేరు

కోర్టులో కొనసాగుతున్న విచారణ



**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసు విచారణ ఇక కోర్టులో మొదలు కానుంది. సుమారు యేడాదిన్నరగా ఈ కేసును విచారిస్తున్న ఎసిబి అధికారులు సోమవారం నాంపల్లి ఎసిబి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడం తెలిసిందే. ఎసిబి ఛార్జిషీట్‌లో అనూహ్యంగా విచారణ సమయంలో లేని స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు పేరును చేర్చడం సంచలనం రేపింది. అయితే మొదటి నుంచి అనుకుంటున్నట్లుగా ఎ-1గా మాజీ మంత్రి కెటిఆర్, ఎ-2గా సస్పెండెడ్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఎ-3గా హెచ్‌ఎండిఎ విశ్రాంత ఇంజినీర్ బిఎల్‌ఎన్ రెడ్డి, ఎ-4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఎ-5గా బ్రిటన్‌కు చెందిన ఎఫ్‌ఇఒ కంపెనీ పేరును ఛార్జిషీట్‌లో చేర్చారు. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటూ విదేశాల్లో ఉన్న విదేశీ కంపెనీల ప్రతినిధులను కూడా ఎసిబి ఛార్జిషీట్‌లో వుంచడం గమనార్హం. రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపిన ఫార్ములా ఈ కార్ రేసులో ఎసిబి విచారణ తుది అంకానికి చేరింది. 2023 ఫిబ్రవరి నెలలో బిఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్ కేంద్రంగా ఫార్ములా ఈ కార్ రేసు జరగడం తెలిసిందే. నగరానికి చెందిన గ్రీన్ కో కంపెనీ >>2



మంగళవారం జీవన్ రెడ్డితో భేటీ అయిన పిసిసి చీఫ్ మహేష్

నేడు కాంగ్రెస్‌కు

## జీవన్ రెడ్డి రాజీనామా!

బుజ్జగింపు యత్నాలు విఫలం

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసంతృప్తితో >>2

జీవన్‌రెడ్డితో మహేష్ చర్చలు 2

హైదరాబాద్ అభివృద్ధికి

# 2250 కోట్లు

మౌలిక వసతులకోసం భారీగా కేటాయింపులు

నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రణాళికలు

అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,మార్చి 24,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో రోడ్లు మౌలిక వసతుల కల్పన కోసం 2026-27లో రూ.2250 కోట్లు ఖర్చు చేస్తామనీ, కాంగ్రెస్ చేసే అభివృద్ధి మీ మనవడు వరకు వేచి చూడాల్సిన అవసరం లేదు మీరే చూసి అనుభవిస్తారని,వచ్చే ఎన్నికల నాటికి గణనీయమైన పురోగతి సాధిస్తామనీ శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్ రోడ్లు, డ్రైనేజి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. ప్రోటోకాల్ విషయంలో జరుగుతున్న అవమానంకూడా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం ఇస్తూ గతంలో నేను కూడా ప్రోటోకాల్ బాధితుడినే ఇలాంటి పొరపాట్లు జరకుండా ఛీఫ్ సెక్రటరీ స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని స్పీకర్‌ను కోరారు. మూసీ విషయంలో మంచి ఆలోచనతో ఉన్నప్పటికీ బిఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందనీ. హైదరాబాద్ భారీగా వలసలు కొనసాగుతున్నాయనీ ట్రాఫిక్ సమస్యపై పెద్ద ఎత్తున దృష్టి సారిస్తున్నామనీ అందులో భాగంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చేస్తున్నామనీ ఆయన అన్నారు. రాజధాని అభివృద్ధి కోసం హెచ్‌సిటీ కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులతో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం ఇచ్చినట్టు శ్రీధర్‌బాబు తెలిపారు. రెండేళ్లలో రూ.122 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2026-27లో రూ.2250 కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను ఎక్కడా ఆపలేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అవసరానికి అనుగుణంగా కొన్ని మార్పులు మాత్రమే చేశామని తెలిపారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో వేగవంతం అవుతాయని చెప్పారు. కేంద్రం తెలంగాణకు మరిన్ని నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసిన మంత్రి, రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపీలు ప్రయత్నాలు చేయాలని కోరారు. ఎమ్మెల్యేలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి గణనీయమైన పురోగతి చూపిస్తామని అందరమూ కలిసి హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుదామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బిఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్ సేఫెస్ట్ ప్లేస్‌గా ఉండేదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని గుర్తు చేశారు. హైదరాబాద్ వాతావరణం చాలా బాగుంటుందని >>2



తెలంగాణ -ఎపి మధ్య

# డబుల్ డెక్కర్ కారిడార్

ఎల్బీనగర్, హయత్ నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి

రూ. 941 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం

మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు రూ.7,600 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్

శాసన సభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటి రెడ్డి

**హైదరాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లను కలిపే కీలక విజయవాడ రహదారిపై డబుల్ డెక్కర్ రోడ్డును నిర్మిస్తున్నామని ఆర్ అండ్‌బి శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు .మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎల్బీనగర్ హయత్ నగర్ ఎలివేటెడ్ కారిడార్ పై ప్రశ్నతో పాటు రాష్ట్రంలోని పలు ఆర్ అండ్ బి రోడ్ల గురించి ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి,మనోహర్ రెడ్డి,దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,మేఘారెడ్డి,నాగరాజు,మాణిక్ రావు,వీర్లపల్లి శంకర్ పలువురుసభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమాధానాలు చెప్పారు. ఎల్ బినగర్ నుంచి మల్కాపూర్ వరకు జాతీయ రహదారి65ను ఆరువరసలతో రహదారిగా అభివృద్ధి చేయడానికి 2020-21 సంవత్సరంలో రూ.545 కోట్లతో చేసిన ప్రతిపాదన కార్యరూపం దాల్చిందని రూ. 414 కోట్లతో కాంట్రాక్ట్ కుదుర్చుకుని ప్రస్తుతం >>2



మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

# 3 రోజులు అకాల వర్షాలు

హైదరాబాద్‌లో భారీగా వడగళ్ల వాన

పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వరదనీరు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాత వార్త:** ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావం కారణంగా తెలంగాణలో రానున్న మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, >>2



హైదరాబాద్‌లో రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



మంగళవారం చిక్కమగళూరులో గ్యాస్‌కోసం బారులు తీరిన ప్రజలు

# రూల్స్ తుంగలోకి..

>> ఏస్ నెక్స్ జెన్‌తో పాటు మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహించేందుకు బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈఓ) మధ్య 2022 అక్టోబర్ 25వ తేదీన ఒప్పందం జరిగింది. ఒప్పందంలో భాగంగా రేసుల నిర్వహణతో పాటు ట్రాక్ నిర్మాణం కోసం సదుపాయాలను మున్సిపల్ శాఖ కల్పించాల్సి వుంటుంది. దీని తరువాత 2023 ఫిబ్రవరి 11వ తేదీన మొదటి రేసులు మొదలవగా దీని తరువాత ఎఫ్‌ఈఓ, ఏస్ నెక్స్ జెన్ సంస్థల మధ్య విబేధాలు తలెత్తాయి. దీని తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగా అనంతరం జరిగిన పరిణామాలతో రేసు నిర్వాహక సంస్థ ఎఫ్‌ఈఓ తమకు వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఫార్ములా ఈ కార్ రేసుపై పూర్తిగా విచారించిన కాంగ్రెస్ ప్ర భుత్వం ఎఫ్‌ఈఓ సంస్థ కోరినట్లుగా డబ్బులు ఇవ్వలేదు. దీంతో తమకు అందాల్సిన డబ్బులు అందని కారణంగా రేస్‌లను నిర్వహించడం లేదని ఎఫ్‌ఈఓ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. దీని తరువాత మొత్తం ఫార్ములా ఈ కార్ కేసులో అక్రమాలు జరిగాయని, దీనిపై ఎసిబి విచా రణకు సర్కారు ఆదేశించింది. దీని తరువాత దీనిపై ఎసిబి దీనిపై మాజీ మంత్రి కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండిఎ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డితో పాటు ఈ కార్ రేస్ నిర్వాహక సంస్థ ఎఫ్‌ఈఓ. ఆ సంస్థ సీఈఓలపై అవినీతి నిరోధక చట్టం లోని 13 (1) (ఎ), 13 (2), బిఎన్‌ఎస్ సెక్షన్ 409, 120 బి సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. దీని తరువాత కెటిఆర్, అర్వింద్ కుమార్, బి ఎల్‌రెడ్డిలను హైదరాబాద్‌లో పలుమా ర్లు విచారించింది. అనంతరం బ్రిటన్‌లోని ఎఫ్ ఈఓ సంస్థ ప్రతినిధులను ఆన్‌లైన్‌లో విచారించింది. ఇలా ఈ విచారణ సుదీర్ఘంగా సాగింది. ఇక ఈ కేసులో కీలక పరిణామం ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను సస్పెండ్ చేయడం. దీని తరువాత సోమవా రం నాడు ఛార్జిషీట్ దాఖలు చేశారు. అయితే ఈ ఛార్జిషీట్‌లో అనూహ్యంగా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు పేరు రావడం చర్చనీయాంశం గా మారింది. ఇతన్ని ఇంతవరకు ఎసిబి విచారించిన దాఖలాలు లేవు.

**ఎసిబి ఛార్జిషీట్‌లో పేర్కొన్న విషయాలు ఏమిటంటే...?**

ఇక ఫార్ములా ఈ కార్ రేసు కేసుకు సంబంధించి ఎసిబి మోపిన అభియోగాల్లో అనేక అంశాలున్నాయి. ఈ రేసు నిర్వహణకు అప్పటి కేబినెట్‌తో పాటు ఆర్థిక శాఖ అనుమతి లేదని, దీంతో పాటు ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి నగరంలోని హిమాయత్‌నగర్‌లో గల ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకు నుంచి బ్రిటన్‌లోని ప్రైవేటు సంస్థకు జరిగిన 54.88 కోట్ల రూపాయల విదేశీ కరెన్సీ బదిలీ అంతా అడ్డగోలుగా జరిగిందని ఎసిబి పేర్కొంది. ఇందులో 45 కోట్ల రూపాయలను విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడం నేరమని ఎసిబి ఛార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం మౌఖిక ఆదేశాల ప్రకారం ఆర్‌బిఐ నిబంధనలను పాటించకుండా నగదును బదిలీ చేయడం సరైంది కాదని, దీనివల్ల ఎనిమిది కోట్ల రూపాయలను ఐటి శాఖకు రా ష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారంగా చెల్లించాల్సి వచ్చిందని ఎసిబి పేర్కొంది.

సర్కారీ విభాగాల్లో పది కోట్ల రూపాయలకన్నా ఎక్కువగా నగదు ఏదైనా సంస్థకు చెల్లించాల్సి వచ్చినపుడు మంత్రులతో కూడిన కమిటీ అనుమతి తీసుకోవాల్సి వుందని, ఈ విషయాన్ని నాటి మంత్రి కెటిఆర్ పట్టించుకోకు ండా సొంతంగా, ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఎసిబి తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. దీంతో పాటు ఇదే కేసులో హెచ్‌ఎండిఎ నాటి బాస్‌గా వున్న సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, విశ్రాంత ఈఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డి రూల్ బుక్‌ను అమలు చేయకుండా కెటిఆర్ చెప్పినదా నికి గుడ్డిగా సంతకం పెట్టారని ఎసిబి ఛార్జిషీట్‌లో వెల్లడించింది. దీని ఆధారంగా త్వరలో ఈ కేసు విచారణ కోర్టులో మొదలుకానుంది.

# హార్ముజ్‌ను తక్షణమే తెరవాలి

>> సంభాషించారు. హార్ముజ్ జలసంధిని తెరవాల్సిన అనివార్య అత్యవసర పరిస్థితి అలుముకుందని, ప్రపంచదేశాలకునిరాఘాటంగా రవాణాకు హార్ముజ్ జలసంధిని తక్షణమే తెరిపించాల్సిన అవసరం ఎంతో ఉందని ఇరువురునేతలు అభిప్రాయపడ్డారు.సుదీర్ఘంగా జరిగిన ఈసంభాషణలో పశ్చిమాసియాలోనెలకొన్న పరిస్థితులపైనే సింహభాగం చర్చజరిగింది. ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం మొదలయిన తర్వాత తొలిసారిగా ప్రధానిమోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంభాషణ జరిగింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత, ఇంధన భద్రత కీలక అంశాలుగా చర్చలుజరిగినట్లు మోడీ తన సోషల్‌మీడియాలో ట్వీట్‌చేస్తే, భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియోగోర్‌సైతం ట్రంప్ తరపున ట్వీట్‌చేసారు. భారత్ ఎల్లవేళలా ఉద్రిక్తతలు తగ్గించి శాంతినినెలకొల్పాలన్న లక్ష్యానికి మద్దతిస్తుందని, అలాగే హార్ముజ్ జలసంధిని తిరిగి పునరుద్ధరించాలనే కోరుకుంటున్నట్లు మోడీ ట్వీట్‌లో వెల్లడించారు. అంతేకాకుండా ప్రపంచదేశాలకు హార్ముజ్‌ను చేరువచేయాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధానికి బ్రేక్‌ప్రకటించిన సమయానికి ముందే హార్ముజ్‌జలసంధిని తెరవకపోతే తాము ఇరాన్‌లోని అన్ని విద్యుత్‌కేంద్రాలను ధ్వంసంచేస్తామని 48 గంటల్లోపు తెరవాలని గడువు విధించిన సంగతి తెలిసిందే. ప్రపంచ దేశాల చమురుసరఫరాకు అత్యంత కీలకంగా పనిచేస్తోంది హార్ముజ్ జలసంధి మాత్రమేనని ఇరువురునేతలు అభిప్రాయపడ్డారు. ముందురోజే ప్రధానిమోడీ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ఫోన్‌లో చర్చలుజరిపారు. అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాలను పరిరక్షించాల్సినఅవసరం ఉందని, సంక్లిష్ట మౌలికవనరులను కాపాడుకోవాలని సూచించారు.

ఈద్, నౌరుజ్ శుభాకాంక్షలు తెలిపిన తర్వాత పశ్చిమాసియాలో శాంతిసుస్థిరత, సామరస్య వాతావరణం నెలకొనాలని ఆకాక్షించారు. మధ్యప్రాచంలో కీలక వనరులపై దాడులుచేయడాన్ని కూడా మోడీ ఖండించారు. ఇరాన్‌తో చర్చలకు ఇస్లామాబాద్ వేదిక అవుతోందని, పాక్ ఆర్మీచీఫ్ ఆసిమ్‌మునీర్ మధ్యవర్తిత్వంతో ఇరాన్‌సమస్యకు పరిష్కారం లభించనున్నదన్న వార్తలు వెలువడిననేపథ్యంలో ట్రంప్‌మోడీలమధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అంతర్జాతీయంగా చర్చనీయాంశం అయింది. అయితే ఎలాంటి చర్చలు లేవని, బేషరతుగా మా డిమాండ్లు అంగీకరిస్తేనే యుద్ధవిరమణ సాధ్యం అవుతుందని ఇరాన్ స్పష్టంచేసింది.

## మతం మారితే ఎస్సీ
# హోదా కట్

>> సమర్థించింది. మత మార్పిడి తర్వాత కూడా పాత కుల హోదాను కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ హోదా అనేది కేవలం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలకు చెందిన వారికే వర్తిస్తుందని ధర్మాసనం గుర్తు చేసింది. చారిత్రకంగా ఎదుర్కొన్న సామాజిక వెనుకబాటుతనం, అంటరానితనం వంటి తీవ్రమైన వివక్ష ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ఒక వ్యక్తి వేరే మతంలోకి మారినప్పుడు, అతను ఆ మతంలోని సామాజిక నిర్మాణంలోకి వెళతాడని, పాత కులంతో ముడిపడిన వివక్షకు గురయ్యే అవకాశం ఉండదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు నేపథ్యంలో, ఇకపై మత మార్పిడి చేసుకున్న ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో జనరల్ కేటగిరీ కిందనే పరిగణించబడతారు. వారికి ప్రత్యేక రిజర్వేషన్ ప్రయోజనాలు లభించవు. చట్ట ప్రకారం మతం మారడం అంటే, ఆ వ్యక్తి తన పూర్వపు కుల మూలాలను వదులుకున్నట్లేనని కోర్టు తేల్చి చెప్పింది.

ఈ తీర్పు రిజర్వేషన్ల అమలుపై భవిష్యత్తులో గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనివల్ల రిజర్వేషన్ల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని కొందరు భావిస్తుండగా, మతం మారినంత మాత్రాన వ్యక్తుల ఆర్థిక, సామాజిక స్థితిగతుల్లో మార్పు రాదని, వారికి రిజర్వేషన్లు కొనసాగించాలనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై దాడికి సంబంధించి ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులో సుప్రీం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఫిర్యాదుదారుడు దశాబ్ద కాలంగా పాస్టర్‌గా ఉంటున్నారని, ఘటన జరిగిన సమయంలోనూ ప్రార్థనలు చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని పేర్కొంది. ఫిర్యాదుదారుడికి తహశీల్దార్ ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ రక్షణ పొందేందుకు అర్హత ఉండదని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. క్రైస్తవ మతంలోకి మారి, ఆ ఆచారాలను పాటిస్తున్న వ్యక్తి షెడ్యూల్డ్ కుల సభ్యుడిగా కొనసాగలేరని స్పష్టం చేసింది. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్, 1950 ఈ విషయాన్ని స్పష్టం చేస్తోందని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం కింద రక్షణ లభించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## వారం - వర్జ్యం

25-03-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
సప్తమి మ.1.52
మృగశిర సా.5.35
వర్జ్యం : రా.1.34-రా.3.05
దు. ఉ.11.48-మ.12.37
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** మౌనమే సమధానంగా ఒర్చుకోవడం మంచిది. ఆర్థిక సర్దుబాట్లు సమర్థవంతంగా చేయగలుగుతారు. నూతన విద్యావకాశాలు కలవు.

**వృషభం:** ఎదురుదాడికి సమయం కాదు. జమా ఖర్చులు పరిశీలించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు.

**మిథునం:** సంతాన క్షేమం మానసిక ఆనందాన్ని కలిగిస్తుంది. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం :** మీ మంచితనమే మీకు శ్రీరామరక్ష అవుతుంది. దేవాలయాలను సందర్శిస్తారు. సోదరుల కలయిక.

**సింహం:** అడిగినదే తడవుగా అందరికీ సహాయంచేస్తారు. అయినా మీపట్ల ఇతరులు స్నేహభావం చూపకపోవడం ఆశ్చర్యం కలుగుతుంది.

**కన్య :** ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధ కనబరుస్తారు. జీవిత భాగస్వామి సలహాలు పాటిస్తారు. ఋణాలు తీరుస్తారు. వాహనసౌఖ్యం.

**తుల :** కార్యక్రమాలకు పదే పదే విఘ్నాలు కలగడం, అధిక శ్రమ సూచిస్తున్నాయి. ప్రమాదాలు పొంచి ఉండే అవకాశాలు ఉన్నాయి.

**వృశ్చికం:** మనోధైర్యంతో ముందుకు సాగుతారు. మీకంటూ ప్రత్యేకమైన గుర్తింపు కోసం విఫలయత్నం చేస్తారు.

**ధనుస్సు:** ఆర్థిక బలం చేకూర్చే వాగ్దానాలు, ఒప్పందాలు కలిపిస్తాయి. దీర్ఘకాలిక కోర్టు కేసుల నుండి బయట పడతారు.

**మకరం:** మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుని ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**కుంభం:** సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వ్యాపారంలో రొటేషన్లు బాగుంటాయి. శుభవార్తలు.

**మీనం :** శుభకార్యాలు చర్చలు యత్నాలు కలిసివస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. గృహం కొనుగోలు యత్నాలు.


- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైదరాబాద్ అభివృద్ధికి 2250 కోట్లు

>> తలసాని తెలిపారు. కెటిఆర్ నాయకత్వంలో 70వేల కోట్లతో రోడ్ల అభివృద్ధిజరిగిందనీ, సిటీ రోడ్లు బ్రహ్మాండంగా తయారయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక హైదరాబాద్ రోడ్లకు దుర్దశ వచ్చిందని మండిపడ్డారు. గంటల తరబడి రోడ్లపై నరకం చూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వచ్చాక రెండేళ్లలో హైదరాబాద్ నగరం అధ్వాన్నంగా తయారైందని విమర్శించారు. నగరంలో ఎస్‌టిపిలు కట్టిందే బిఆర్‌ఎస్ ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్ల టెండర్లు రద్దు చేసిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎయిర్‌పోర్టు రోడ్డు నుంచి శ్రీశైలం హైవే వరకు టెండర్లు పిలిచి ఈ సర్కార్ తట్టెడు మట్టి తీయలేదని మండిపడ్డారు. టెండర్లు వచ్చిన వాటికి కూడా పనులు జరగడం లేదని విమర్శించారు. మంత్రి శ్రీధర్ బాబు ఫొటోలకు పోజులిచ్చి వెళ్లిపోయారని అన్నారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రణాళికబద్ధంగా డెవలప్‌మెంట్ చేశామని సబితా ఇంద్రారెడ్డి గుర్తుచేశారు. ఈ ప్రభుత్వానికి ఆరంభ శూరత్వమని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లో కొత్త రోడ్లు వేసే పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. నాగోల్ నుంచి గండిపేట వరకు ఈస్ట్ వెస్ట్‌ను లింక్ చేయాలని కోరారు. హైదరాబాద్ అభివృద్ధి జరగాలంటే ట్రాఫిక్ సమస్యలు తీర్చాలని సూచించారు. అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్‌ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ముషీరాబాద్‌లో పద్మారావునగర్, గంగపుత్ర కాలనీ, పార్సిగుట్టలోసుందరయ్య పార్క్ చుట్టుపక్కల రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ విమర్శించారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా రోడ్ల సమస్యను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మౌళికవసతి కల్పన జరగకపోవడంతో హైదరాబాద్ నుంచి తరలిపోతున్నారని చెప్పారు. హైదరాబాద్ సిటీ అద్భుతమని రజినీకాంత్ కొనియాడారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో 16వేల కోట్ల పనులు ప్రారంభించి హడావిడి చేశారని కానీ ఖర్చుచేసింది122 కోట్లరూపాయలు మాత్రమే అనికుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద ఎద్దేవా చేశారు.సర్కార్ చెప్పేదొకటి చేసేదొకటి అని విమర్శించారు. చిన్న చిన్న లింకు రోడ్ల నిర్మాణంలోనూ నిరక్ష్యమ్మే ఉందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఫ్లై ఓవర్లను కూడా పూర్తి చేయడం లేదని తెలిపారు.

# ఇక యేటా సిఎం కప్ పోటీలు

>> రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం కప్ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది ఒక నిరంతర ప్రక్రియలాగా ఏటా కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే సరిపోదని, క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా రాణిస్తారని తెలిపారు. యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని అన్నారు. సీఎం కప్ పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి స్పోర్ట్స్ స్కూల్లో , అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించివారిని ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహా దారు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎంకప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉంద న్నారు. ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ... సీఎం కప్ పోటీల్లో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. కాగా.. సిఎం కప్ పోటీల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా, మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, సైనా నెహ్వాల్, సోని బాలాదేవిలు ట్రోఫీలను అందజేశారు.




ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల సిఎస్‌లు, డీజీపీలు, ప్రధాన ఎన్నికల అధికారులతో మంగళవారం న్యూఢిల్లీలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తదితరులు

# తెలంగాణ అసెంబ్లీకి మరో 60 సీట్లు!

>> అదనంగా 273 సీట్లు పెరిగి మొత్తం 816 సీట్లకు చేరనుంది. మహిళా రిజర్వేషన్ల ప్రకారం 270 మంది మహిళలు ఎంపీలుగా రానున్నారు. దేశ వ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలు 4123 ఉండగా, కొత్తగా 2,062 సీట్లు రానున్నాయి. దీంతో మొత్తం దేశ వ్యాప్తంగా అసెంబ్లీ సీట్లు 6,185 సీట్ల సంఖ్య చేరనుంది. దేశవ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలలో మహిళా రిజర్వేషన్లు అమలు చేయనుండటంతో 2,042 మహిళా ఎమ్మెల్యేలు రానున్నారు. తెలంగాణ అసెంబ్లీకి సంబంధించి 119 స్థానాలుండగా, ఈ సంఖ్య 2029లో 179కి చేరుతుంది.లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం 17 ఉండగా 9 స్థానాలు అదనంగా చేరి మొత్తం 26 సీట్లకు పెరుగుతుంది. మహిళా రిజర్వేషన్ల అమలు వల్ల తెలంగాణలో 60 మంది మహిళా ఎమ్మెల్యేలు,9 మంది మహిళా ఎంపీలు రానున్నారు.ఏపీలో 175 నుంచి 263 అసెంబ్లీ స్థానాలు పెంపు, లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెంచనున్నారు. దేశంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను.. 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే లోక్‌సభలో, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఆ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశబెట్టబోతుందని ప్రచారం జరుగుతోంది. ఎంపీ సీట్లకు సంబంధించి ఏ రాష్ట్రానికి ఎన్ని స్థానాలు దక్కుతాయో చూద్దాం. యూపీలో ప్రస్తుతం ఉన్న 80 ఎంపీ సీట్లు 120కి, మహారాష్ట్రలో 48 నుంచి 72కు, పశ్చిమ బెంగాల్‌లో 42 నుంచి 63కు, బిహార్‌లో 40 నుంచి 60కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 44కు, రాజస్థాన్‌లో 25 నుంచి 38కి, గుజరాత్‌లో 26 నుంచి 39కి, ఒడిశాలో 21 నుంచి 32కి, ఝార్ఖండ్‌లో 14 నుంచి 21కి, అసోంలో 14 నుంచి 21కి, పంజాబ్‌లో 14 నుంచి 21కి, ఛత్తీస్‌గఢ్‌లో 11 నుంచి 17కు, హరియాణాలో 10 నుంచి 15కు, ఢిల్లీలో 7 నుంచి 11కు, జమ్మూ కాశ్మీర్‌లో 5 నుంచి 8కి, ఉత్తరాఖండ్‌లో 5 నుంచి 8కి సీట్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 4 నుంచి 6కు, గోవాలో 2 నుంచి 3 సీట్లకు పెరగనుండగా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, మిజోరం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు అన్నింట్లో రెండేసి సీట్లుండగా, ఇప్పుడు 3 సీట్లు అవుతాయి. అంటే కేంద్ర పాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల్లో ఇప్పటిదాకా 20 ఎంపీ సీట్లుండగా, ఇకపై 30 సీట్లు అవుతాయి. ఇక దక్షి ణాది రాష్ట్రాలకు సంబంధించి తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 సీట్లుండగా 59కి, కర్ణాటకలో 28 సీట్లుండగా 42కు, ఏపీలో 25 సీట్ల నుంచి 38కి, కేరళలో 20 నుంచి 30కి పెరుగుతాయి. అలాగే నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయి. ఇప్పటివరకు లోక్‌సభలో 84 ఎస్సీ రిజర్వుడ్ సీట్లుండగా వీటి సంఖ్య 126కు పెరగనుంది. అలాగే, 47 ఎస్టీ సీట్లుండగా, 70 సీట్లకు పెరగనుంది.

# నేడు కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా!

>> బుధవారం రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి రోడ్డులోగల ఓ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 25 బుధవారం 3,000 మంది కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ముకుమ్మడిగా రాజీనామా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా గత 42 సంవత్సరాలుగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా మంత్రిగా ఎమ్మెల్సీగా పనిచేసి నియోజకవర్గ అభివృద్ధి తో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశాడు. కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి నిబద్ధతగల వ్యక్తిగా ఉండడంతో పాటు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తో కలిసి పనిచేయడం జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కి ఎంతగానో తోడ్పడడంతోపాటు కాంగ్రెస్ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ గత ప్రభుత్వంపై, ధర్నాలు రాస్తారోకాలు చేయడంతో పాటు, పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు ఐ జైలు జీవితం కూడా అనుభవించినాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనదైన ముద్ర వేశాడు. అంతేకాకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బిఆర్‌ఎస్ పార్టీలో కలవమని మంత్రి పదవి ఇస్తానని పలుమార్లు ప్రాధేయపడ్డప్పటికీ కాంగ్రెస్ పార్టీ నియమా నీ బంధనలకు కట్టుబడి పార్టీకి నమ్మకద్రోహం చేయవద్దని కాంగ్రెస్ పార్టీలో ఉండి గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పరిపాలనను ఎప్పటికప్పుడు నిలదీసినాడు.

## జీవన్‌రెడ్డితో మహేష్ చర్చలు

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనుబంధం తెంచుకోవద్దు అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్‌కు బుధవారం రాజీనామా చేస్తు న్నందున టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి చేరుకొని 30 నిమిషాలు పలు విషయాలపై చర్చించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి గతనలభై సంవత్స రాలుగా కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించాలని, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేయవద్దని తెలుపుతున్నామని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఇబ్బంది పడ్డారని, కాంగ్రెస్ పార్టీతో జీవన్ రెడ్డికి ఎంతో అనుబంధం ఉన్నదని ఈ బంధాన్ని తెంచుకోవద్దని భవిష్యత్తు విషయాలు చర్చించుకుని ముందుకు వెళదామని పార్టీ లో ఏమి చేద్దాము ఆలోచించుకుందామని పేర్కొన్నారు. మరోసారి ఆలోచించుకొని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయవద్దని మీ సేవలు పార్టీకి ఎంతగానో అవసరం ఉన్నాయని పేర్కొన్నారు.

# డీలిమిటేషన్‌పై పోరాటం

>> చెప్పారు. గత ప్రభుత్వం 11.90 శాతం భారీ వడ్డీకి రూ.2లక్షల కోట్ల అప్పులు చేసిందని, దీనిపై ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేశామని గుర్తు చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని,కేవలం ఆర్థిక కారణాల వల్ల ప్రస్తుతం రెండు పథకాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ తీరును తప్పుపడుతూ రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మోడీ దేశం మొత్తానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలి. కానీ ఆయన కేవలం గుజరాత్‌కే అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌కు పోలిక లేదని, హైదరాబాద్ ఒక రేర్ నగరం అని కొనియాడారు. తెలంగాణ కూడా దేశంలో భాగమేనని కేంద్రానికి గుర్తు చేశారు. హైదరాబాద్‌లో తాము చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును బిజెపి నేతలు అడ్డుకోవడాన్ని ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇక్కడ ఎందుకు అని ప్రశ్నించారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ నేతలు చెప్పినట్లుగానే బిజెపి నేతలు నడుచుకుంటున్నారని, రెండు పార్టీలు కలిసి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

# డబుల్ డెక్కర్ కారిడార్

>> సుమారు 80 శాతం పూర్తి చేయడం జరిగిందని ఆయన వివరించారు.నాగ్‌పూర్ లో నితిన్ గడ్కరీ సుమారు 5.60 కి.మీ పొడవుతో డబుల్ డెక్కర్ రోడ్డు వేశారు. ఆ డబుల్ డెక్కర్ లో క్రింది భాగంలో సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి ట్రాఫిక్, పై భాగంలో మెట్రో రైలు సదుపాయం చేయబడిందనీ, అదేవిధంగా తెలంగాణలోను నిర్మిస్తామనీ వివరించారు..మొత్తం 8 వాహన అండర్‌పాస్‌లలో నాలుగు ఇప్పటికే పూర్తి కాగా, ఒకటి నిర్మాణంలో ఉంది. మిగిలిన మూడు డీస్కోప్ చేయబడినాయి. అయితే, ప్రస్తుత డిజైన్ వల్ల స్థానిక ప్రజలకు రహదారి దాటడంలో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు.ఎల్‌బి నగర్ నుండి పెద్ద అంబర్‌పేట్ వరకు ట్రాఫిక్, ప్రమాదాల పెరుగుదల వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పరిమిత క్రాసింగ్ పాయింట్లు ఉండటం వల్ల ప్రజలు అదనంగా 2.2 కి.మీ పైగా ప్రయాణించాల్సి వస్తోంది.ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా, ఎల్‌బినగర్ నుండి హయత్‌నగర్ వరకు సుమారు 5.50 కి.మీ పొడవులో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ప్రతిపాదించబడింది. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.941 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 741 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం/హెచ్ ఎం ఆర్ ఎల్ రూ. 200 కోట్లు భాగస్వామ్యం చేయనున్నాయి.ఈ కారిడార్ నిర్మాణం ద్వారా క్రింది భాగంలో సర్వీస్ రోడ్లు, మధ్యలో జాతీయ రహదారి ట్రాఫిక్, పైభాగంలో మెట్రో రైలు సదుపాయం కల్పించబడుతుంది. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గి, రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు నగర అభివృద్ధికి తోడ్పడుతుంది.ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు తమ వాటా ఇవ్వడానికి అంగీకారం తెలిపింది. ఎల్‌బీనగర్ నుండి హయత్ నగర్ ప్రతిపాదనలు మార్చి 17న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని చెప్పారు. రాబోయే నెలల్లో ఆమోదం లభించి, టెండర్లు పిలవబడే అవకాశం ఉందనీ అని మంత్రి పేర్కొన్నారు.పుణేహైదరాబాద్ విభాగంలోని ఎన్ హెచ్ 65పై మదీనాగూడ నుండి బి హెచ్ ఓ ఎల్ వరకు 1.20 కి.మీ పొడవులో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 53.55 కోట్ల వాటాకు కూడా అంగీకారం తెలిపిందనీ చెప్పారు.

హైదరాబాద్ నుంచి తుక్కుగూడ, మన్ననూరు మార్గంగా శ్రీశైలం వరకు ప్రయాణాన్ని సులభతరం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చలు జరిపి ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన రూపొందించారు.

మన్ననూరు వరకు ఇప్పటికే 6లేన్ రహదారి అభివృద్ధి చేపట్టగా, అక్కడి నుంచి శ్రీశైలం వరకు సుమారు 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిపిఆర్ రూపొందించబడిందని, దాదాపు ఆమోద దశలో ఉందని పేర్కొన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం కావడం, ఘాట్ రోడ్డులో ప్రమాదాల అవకాశాలు ఉండటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం అత్యవసరమని మంత్రి వివరించారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు ప్రయాణం వేగవంతమై, భక్తులు ఉదయం వెళ్లి సాయంత్రానికి దర్శనం పూర్తి చేసుకుని తిరిగి రావడం సులభమవుతుందని తెలిపారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ అంచనా వ్యయం సుమారు రూ. 7,600 కోట్లు కాగా, ఇది ప్రస్తుతం ఆమోద దశలో ఉందని తెలిపారు. రాష్ట్ర కేబినెట్ స్థాయిలో ఇప్పటికే అనుమతి లభించిందని, తుద ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు మంత్రి వెల్లడించారు.

# 3 రోజులు అకాల వర్షాలు

>> నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్ నుంచి రంగారెడ్డి వరకు పలు జిల్లాల్లో వర్షాలు, ఈదురుగాలులు ప్రభావం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**హైదరాబాద్‌లో వడగళ్ల వర్షం...**

హైదరాబాద్‌లో పలు చోట్ల మంగళవారం భారీ వర్షం కురిసింది. వడగళ్లతో కూడిన జడివాన కురిసింది. పంజాగుట్ట, అమీర్‌పేట్, మియాపూర్, కూకట్‌పల్లి, బోరబండ, కేపీహెచ్‌బీ, జేఎన్టీయూ, నిజాంపేట్, మూసాపేట్, చందానగర్, సూరారం, కొంపల్లి, దుండిగల్, జగద్గిరిగుట్ట, చింతల్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. వర్షానికి నిజాంపేట్ రోడ్లు జలమయమయ్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయం కావడంతో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోనూ....**

హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం కురిసింది. జిల్లాలోని గుమ్మడిదల, ఐడీఏ బొల్లారం, జిన్నారం తదితర గ్రామాల్లో భారీ వర్షం పడింది. నల్లటి మేఘాలు అమీన్‌పూర్‌ను కమ్ముకుపోవడంతో అక్కడ పరిస్థితి భయంకరంగా మారింది.

అదేవిధంగా.. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భారీ వర్షం పడగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హైదర్‌గూడ, అత్తాపూర్, బుద్వేల్, రాజేంద్రనగర్, కోకాపేట్, నార్సింగి, మైలార్‌దేవ్‌పల్లి పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.

కొన్ని ప్రాంతాల్లో వడగళ్లు పడ్డాయి. భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం నెలకొంది.

# అసెంబ్లీలో గాంధీ వర్సెస్ గాడ్సే

## మహాత్మాగాంధీని చంపింది ఆర్ఎస్ఎస్‌కు చెందిన గాడ్సేనే

### గాడ్సే ఆర్ఎస్ఎస్ సభ్యుడు కాదు: బిజెఎల్‌పి నేత ఏలేటి

### గాడ్సేను ఎన్నోమార్లు బిజెపి పొగిడింది.. నేనూ హిందువునే..

### హిందువుగానే చనిపోతా: మంత్రి వాకిటి శ్రీహరి

### బిజెపిలో ఉంటేనే హిందువా?: మంత్రి పొన్నం ప్రభాకర్

### సభలో శ్రీరామ దండకాన్ని చదివిన మంత్రి

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా మంగళవారం శాసనసభలో మహాత్మాగాంధీ వర్సెస్ గాడ్సే అన్నట్టుగా అధికార కాంగ్రెస్, బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మధ్య సంవాదం జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ పేరును ఉపాధిహామీ చట్టం నుండి తొలగించారని, అలాంటి మహనీయుడిని ఆర్ఎస్ఎస్ చంపిందని బిజెపిఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి మంత్రి సీతక్క స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అదే ఆర్ఎస్ఎస్‌ను పటేల్ నిషేధించినా ఆయన్ను బిజెపి పొగుడుతోందని అన్నారు. గాడ్సేకు ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు లేవా? అని ప్రశ్నించారు. ఇంతలో కలుగుజేసుకున్న మంత్రి పొన్నం మాట్లాడుతూ ఆంగ్లేయులపై పోరాడిన గాంధీని చంపారని మండిపడ్డారు. బిజెపిలో ఉంటేనే హిందువా? అని ప్రశ్నించారు. తాను బిజెపి వాళ్ల కంటే బాగా రామదండకం, రాముడి శ్లోకం చదవగలనని సభలో చదివి వినిపించారు. అదే సమయంలో మంత్రి వాకిటి శ్రీహరి కూడా కలుగజేసుకుని మహాత్మాగాంధీజీని గాడ్సే చంపడం తప్పని చెప్పే ధైర్యం ఉందా? అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. తాను కూడా హిందువునేనని.. ప్రతిరోజు బొట్టుపెట్టుకొని దేవున్ని మొక్కుతానని చెప్పారు. ప్రపంచ దేశాలు మోకరిల్లి మహాత్మాగాంధీకి దండం పెడుతున్నాయన్నారు. అంతటి గొప్పవ్యక్తి అయిన గాంధీజీని చంపిన గాడ్సేను పొగిడితే ఎట్లా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాడ్సేను బీజేపీ నేతలు పొగిడిన విడియోలు ఎన్నో ఉన్నాయంటూ దుయ్యబట్టారు. గాంధీజీని చంపిన గాడ్సే గొప్పవాడని చెప్పగలరా? అంటూ బీజేపీ సభ్యులను ప్రశ్నించారు. భారతదేశంలో ఎవరి మతం వాళ్లకు ఉంటుందని మంత్రి వాకిటి అభిప్రాయపడ్డారు. మతాలను అన్వయించుకోవడం కాదని.. ఆచరణ రూపం ఉండాలన్నారు. మన ధర్మాలను కాపాడుకుంటూ.. ఇతర ధర్మాలను గౌరవించుకోవాలని సూచించారు. హిందువుగానే పుట్టిన తాను హిందువుగానే మరణిస్తానని స్పష్టం చేశారు. తన నరనరాన హిందూత్వం ఉందని, శ్లోకం, మత ప్రబోధాలను అనర్గళంగా మాట్లాడగలనని చెప్పారు. అనంతరం మాట్లాడిన బిజెపి శాసనసభాపక్ష నేత ఎలేటి మహేశ్వర్‌రెడ్డి ఆర్ఎస్ఎస్‌లో గాడ్సే సభ్యుడు కాదని, ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు కూడా ఉందన్నారు. బడ్జెట్ వైఫల్యాల నుండి దృష్టి మరల్చేందుకే గాడ్సే ఆర్ఎస్ఎస్ వాడంటూ మంత్రి సీతక్క, ఇతర మంత్రులు చర్చను డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.

# రోహిత్, రితేష్, నమిత్‌ల విచారణ

### శంషాబాద్ పిఎస్‌లో సుదీర్ఘంగా సాగించిన పోలీసులు

### డ్రగ్స్ స్మగ్లర్లతో సంబంధాలపై ముగ్గురికి ప్రశ్నలు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మను చేవెళ్ల పోలీసులు మంగళవారం ఉదయం తమ కస్టడీలోకి తీసుకున్నారు. మాదకద్రవ్యాలు వాడినందుకు, పోలీసులపై కాల్పులు జరిపినందుకు ఈ ముగ్గురుని మార్చి 15వ తేదీన పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు ముగ్గురుని రాజేంద్రనగర్ కోర్టు మూ డు రోజుల కస్టడీకి ఇచ్చిన విషయం విదితమే. కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలోనే చెవెళ్ల పోలీసులు చంచ ల్‌గూడ జైలుకు వెళ్లి రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను కస్టడీలోకి తీసుకున్నారు.

అనంతరం ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల తరువాత నేరుగా శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్‌లో గల శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అక్కడ వీరిని ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విచారించారు. ఈ విచారణను ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్‌బాబు, చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం స్వయంగా పర్యవేక్షించారు. మొదటిరోజు విచారణలో డ్రగ్స్ స్మగ్లర్ల తో దందాల గురించి ముగ్గురుని ప్రశ్నించినట్లు తెలిసింది. మరోవైపు డ్రగ్ పెడ్లర్ అభిషేక్ సింగ్ కనిపిం చడం లేదని అతని తండ్రి రాజేంద్రనగర్ పోలీసులకు చేసిన ఫిర్యాదుపై వేరుగా విచారణ జరుగుతోంది. అభిషేక్ సింగ్‌ను మూ డు రోజుల క్రితం అరెస్టు చేసినట్లు వార్తలు రాగా వీటిని పోలీసులు ధృవీకరించడం లేదు.

మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీపై పోలీసుల విచారణ వేగం పుంజుకుంది. ఈ నెల 14వ తేదీన జరిగిన పార్టీని అదేరోజు రాత్రి పోలీసు లు రట్టు చేయడం తెలిసిందే. ఈ పార్టీలో 11 మంది పాల్గొనగా వీరిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా ఆరు గురు డ్రగ్స్ సేవిం చినట్లు తేలడం విదితమే. ముగ్గు రిని ఏయే ప్రశ్నలు అడగాలి? అని ముందుగానే పోలీసులు నిర్ణయించారు. ఈ మేరకే విచారణ సాగింది. రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో ఎంత కాలంగా పార్టీలు జరుగుతున్నాయి? ఇందులో డ్రగ్స్ పార్టీలు ఎన్నిసార్లు జరిగాయి? సాధారణ పార్టీలకు హాజరైన వారు ఎవరు? డ్రగ్స్ పార్టీలకు హాజరైన వారు ఎవరు? అనే దానిపై ముగ్గురుని పోలీసులు విచారించారు.

రోహిత్‌రెడ్డికి ఎంత మంది డ్రగ్స్ స్మగ్లర్లతో సంబంధాలున్నాయి? తాజాగా అరెస్టయిన డ్రగ్స్ స్మగ్లర్లు నమిత్ శర్మ, కౌశిక్ రవిలు ఎంతకాలంగా ఆయనకు పరిచయం వుంది? వీరిద్దరితోపాటు పోలీసుల అదుపులో వున్న అభిషేక్ సింగ్ ఎంతకాలంగా డ్రగ్స్ అందిస్తున్నాడు? ఈ ముగ్గురు ఒక్క రో హిత్ రెడ్డికి మాత్రమే డ్రగ్స్ సరఫరా చేసేవాడా? ఇంకా ఎవరికైనా చేసేవాడా...? ఒకవేళ చేసివుంటే వారు ఎవరు? అనే దానిపైనా పోలీసుల విచారణ సాగింది. ముగ్గురి కస్టడీ విచారణ మొదట వేరువేరుగా ఆ తరువాత కలిపి జరిగినట్లు తెలిసింది. ఇందులో రోహిత్ రెడ్డి విచారణ ప్రత్యేక ంగా సాగిందని సమాచారం. ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్‌తో మీకు ఎంతకాలంగా పరిచయం వుంది? ఆయన మీ ఫాం హౌస్‌లో జ రిగిన పార్టీలకు ఎన్నిసార్లు వచ్చారు? ఇందులో ఎన్నిసార్లు డ్రగ్స్ తీసుకున్నాడు...? 14వ తేదీ రాత్రి జరిగిన పార్టీలో మహేష్ యాదవ్ కొకైన్ తీసుకున్న మాట నిజమేనా? పార్టీలో వాడిన కొకైన్ సహా రెండు రకాల సింథటిక్ డ్రగ్స్ ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు..? దీనిని ఎవరు అందించారు? వీరితో మీకు ఎంతకాలంగా సంబంధముంది? ఈ స్మగ్లర్లు దుబాయ్ సహా ఇతర దేశాలలో వున్న డ్రగ్స్ స్మగ్లర్లతో కలిసి పనిచేసేవారా? అని రోహిత్‌రెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. రోహిత్ రెడ్డితోపాటు ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి, నమిత్‌శర్మను కూడా పోలీసులు భిన్న కోణాల్లో విచారించారు. వీరిని బుధవారం కూడా విచారించనున్నారు.

### కెటిఆర్, రాజగోపాల్‌రెడ్డి, పాయల్ శంకర్ ఒకే టేబుల్‌పై భోజనం

# రెండు గంటలకుపైగా సమాలోచనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి24:** తెలంగాణ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత ముగ్గురు సరదాగా మాట్లాడుకున్నారు. మంగళవారం అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో ఈ ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, బీజేపీ శాసనసభ్యుడు పాయల్ శంకర్ ఒకే టేబుల్‌పై భోజనం చేశారు. ఆ తర్వాత అక్కడే చాలాసేపు వారు మాట్లాడుకున్నారు. రెండు గంటలకు పైగా వారి మధ్య సంభాషణలు జరగడం గమనార్హం. మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కలిసి సుదీర్ఘంగా మాట్లాడుకోవడం ఆసక్తిగా మారింది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటే తనలాంటి ఉద్యమకారుల సేవలు అవసరమని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంత్రి పదవి కోసం తాను పరితపించడం లేదని వ్యాఖ్యానించారు. తనకు మంత్రి పదవి ఇస్తానని పార్టీ అధిష్ఠానమే గతంలో హామీ ఇచ్చిందని వెల్లడించారు. దీనికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తనకు తెలియదని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుందని అన్నారు. తనకు ఏ పదవి లేకపోయినా, ప్రజల్లో తానంటే గౌరవం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్‌తోనూ అసెంబ్లీ లాంజ్‌లో సాధారణ విషయాలనే మాట్లాడినట్లు తెలిపారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం తప్పేనని కేటీఆర్‌కు చెప్పానని అన్నారు.

**కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నాలాంటి వారి సేవలు అవసరం: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి ఇబ్బందిలేదని తెలిపారు. ముఖ్యమంత్రితో సోమవారం ప్రత్యేకంగా భేటీ కాలేదని, ఎదురుపడితే మాట్లాడుకున్నామని స్పష్టతని చ్చారు. మంత్రి పదవి ఉన్నా లేకున్నా తన బ్రాండ్ ఇమేజ్ ఏ మాత్రం తగ్గదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అయితే అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు ముగియగానే ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తనకు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆ తర్వాత కొంత కాలానికే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుని రావాలని కెసి వేణుగోపాల్ చెప్పారని ఆయన తెలిపారు. ఆ హామీ ఇప్పటికీ ఉందన్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వడం సాధ్యం కాదనడం భావ్యం కాదన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చేప్పుడు తెలియదా తాము అన్నదమ్ములమని అని ఆయన ప్రశ్నించారు. తమ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఇద్దరు ఎమ్మెల్యేలు లేరా? అని ఆయన అన్నారు. తనకు మంత్రి పదవి రానంత మాత్రాన తన బ్రాండ్ ఇమేజ్ ఇలాగే ఉంటుందన్నారు. మంత్రి పదవి వచ్చినా ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతానని, మార్పు ఏమీ ఉండదని ఆయన తెలిపారు. మంత్రి పదవి కోసం పాకులాడడం లేదన్నారు. మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తనకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. అధిష్ఠానం ఎప్పుడు ఏం చేస్తుందో తెలియదని ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు.

# ఖనిజ సంపద ప్రజల సమగ్ర, దీర్ఘకాల అభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేయాలి

### కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** దేశ ఖనిజ సంపద ప్రజల సమగ్ర, దీర్ఘకాల అభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేయాలంటూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన డిఎంఎఫ్ వర్క్‌షాప్ ముగింపు సదస్సులో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డిఎంఎఫ్) వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. నీతి ఆయోగ్, భాస్కరాచార్య ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్, రాష్ట్రాలు కలిసి డిఎంఎఫ్‌లను మరింత బలోపేతం చేసేందుకు సహకార సమాఖ్య స్ఫూర్తిగా కలిసి కట్టుగా పనిచేస్తున్నాయన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజన్‌కు అనుగుణంగా మన దేశ ఖనిజ సంపద ప్రజల సమగ్ర, దీర్ఘకాల అభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. రీఫామ్, పర్ఫామ్, ట్రాన్స్‌ఫాం మంత్రాన్ని ప్రతి స్థాయిలో ఆచరించాలని, ఇక, మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి చేసేందుకు డిఎంఎఫ్ కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 650కు పైగా జిల్లాల్లో మినరల్ ఫౌండేషన్లు ఉన్నాయి. డిఎంఎఫ్‌లను యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ కార్యక్రమంతో అనుసంధానం చేసి, మరింత సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, తాగునీరు, ఉపాధి కల్పించేందుకు ఈ నిధులను వినియోగించుకోవాలి. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో మైనింగ్ రంగంలో అనేక అంశాలపై విస్తృత చర్చ జరిగిందన్నారు. మైనింగ్ రంగంలో ఉత్తమ విధానాల గురించి ఆలోచనలను పంచుకున్నారు. వాటిని జిల్లా స్థాయిలో సమన్వయాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నిధులు సమయానికి విడుదల కావాలి, అనుమతులు వేగంగా ఇవ్వాలి, పర్యవేక్షణ నిరంతరం మరియు సమర్థవంతంగా ఉండాలి. డిజిటల్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను డిఎంఎఫ్‌లో భాగస్వామ్యం చేసి, సాంకేతికను సమర్థవంతంగా వినియోగించాలి. డిఎంఎఫ్ పోర్టల్ 2.0 వంటి వేదికలను సమర్థవంతంగా ఉపయోగించాలి. డిఎంఎఫ్ ఫలితాలపై దృష్టి పెట్టాలి. క్షేత్రస్థాయిలో మార్పులు వచ్చేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.



# అభివృద్ధి సంక్షేమానికి కాంగ్రెస్ గెలుపుతో గ్యారెంటీ

### కేరళలో ఎన్నికల వ్యూహాలపై

### సమావేశంలో హర్కర వేణుగోపాల్‌రావు

**హైదారబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ గెలుపుతో గ్యారెంటీగా అందుతాయనీ ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్ళాలని ఎఐసిసి పరిశీలకుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు అన్నారు. మంగళవారం కేరళ రాష్ట్రంలోని కల్లైశెరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎఐసిసి పరిశీలకునిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు. ఈ ముఖ్య సమావేశానికి కాసరగోడ్ ఎంపి రాజ్‌మోహన్ ఉన్నికృష్ణన్, యుడీఎఫ్ అభ్యర్థి రాజీవన్‌జీతోపాటు పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలపై కీలక చర్చలు జరిగాయి.

# ఇరాన్ భద్రతా చీఫ్‌గా మహ్మద్ బాగర్ జోల్‌ఘదర్

**టెహ్రాన్, మార్చి 24:** ఇరాన్‌కు చెందిన అత్యంత శక్తివంతమైన సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కొత్త అధిపతిగా మహమ్మద్ బాగర్ జోల్ ఘదర్‌ను నియమించారు. ఇటీవల ఆ దేశ భద్రతా చీఫ్ అలీ లారిజానీ ఓ దాడిలో మరణించిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. జోల ్ఘదర్, ఇరాన్ సైన్యంలో కీలకమైన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌లో బ్రిగేడియర్ జనరల్ హోదాలో పనిచేసిన అనుభవజ్ఞుడు. ఈ నియామకానికి ముందు ఆయన ఇరాన్ ఎక్స్‌పెడి యెన్సీ కౌన్సిల్ సెక్రటరీ గా, అంతకుముందు హోం మంత్రిత్వ శాఖలో భద్రతా వ్యవహారాల డిప్యూటీ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు.



సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అనేది ఇరాన్ జాతీయ భద్రతా వ్యూహాలను రూపొందించే అత్యున్నత సంస్థ. ఈ పదవిలో జోల్‌ఘదర్ దేశ రక్షణ, అణు కార్యక్రమాలు, విదేశాంగ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తారు. ఆయన సైనిక మరియు రాజకీయ అనుభవం ఈ నియామకానికి బలం చేకూరుస్తుందని భావిస్తున్నారు. గత వారం జరిగిన ఓ దాడిలో అలీలారి జానీ ప్రాణాలు కోల్పోవడంతో ఈ పదవి ఖాళీ అయింది. జోల్‌ఘదర్ నియామకంతో ఇరాన్ భద్రతా విధానాల్లో కొత్త అధ్యాయం మొదలవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సమృద్ధిగా పెట్రో, గ్యాస్ నిల్వలు

### వదంతులను నమ్మి అధికంగా కొనుగోలు చేయొద్దు

### ఇంధన అక్రమ నిల్వ, బ్లాక్ మార్కెట్‌పై కఠినచర్యలు

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ స్పష్టీకరణ

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ కొరత ఏమాత్రం లేదని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ స్పష్టం చేసింది. ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా వ్యవస్థ పూర్తిగా సక్రమంగా పనిచేస్తోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రజల అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద పొడవైన క్యూలు కనిపించడం, నో స్టాక్ బోర్డులు పెట్టడం వంటి పరిస్థితులకు అసలు కారణం తప్పుడు వదంతులేనని అధికారులు వెల్లడించారు.

ఈ వదంతులను నమ్మి ప్రజలు ఒక్కసారిగా పెద్దఎత్తున ఇంధనం కొనుగోలు చేయడానికి పరుగులు తీయడంతో తాత్కాలికంగా కృత్రిమ కొరత ఏర్పడిందని చెప్పారు. అదనంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపు విధానాల్లో చేసిన కొన్ని మార్పుల కారణంగా డీలర్లకు చిన్నపాటి సమస్యలు ఎదురైనా, అది సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదని స్పష్టం చేశారు.

పరిస్థితిని సమీక్షిస్తూ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, పెట్రోలియం సంస్థలు, పోలీసుశాఖ కలిసి పెట్రోల్ బంకుల పనితీరును నిరంతరం పర్యవేక్షి స్తున్నాయన్నారు. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్ చేయడం లేదా గృహ అవసరాల గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు మళ్లించడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ హెచ్చరించింది. ప్రజలు భయపడకుండా ప్రశాంతంగా ఉండాలని, అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం కోరింది. అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని సూచించింది. ఏవైనా సందేహాలు ఉన్నా లేదా ఫిర్యాదులు చేయాలన్నా, ప్రజలు పౌర సరఫరాలశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించాలని తెలిపింది.

# సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్

### కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తాం

### 2025-26లో బిసిలకు రూ. 3074 కోట్లు ఖర్చు చేశాం

### మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందని.. ఇకపై కూడా బీసీలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని, బలహీన వర్గాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. బీసీల సమస్యలపై మంగళవారం శాసనమండలిలో ప్రతిపక్ష నేత, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. 2024-25 ఆర్థిక సంంవత్సరంలో బీసీలకు రూ.1932.89 కోట్లను ఖర్చు చేయగా.. 2025-26 ఏడాది ఇప్పటి వరకు రూ. 3074.54 కోట్లను ఖర్చు చేసినట్టు మంత్రి సభకు తెలిపారు. రాష్ట్రంలోని బీసీ సంఘాల కార్పొరేషన్లను బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో కళ్యాణ లక్ష్మి ్మ ఒక్క కేసు కూడా పెండింగ్ లేదని, గ్రీన్ ఛానెల్ ద్వారా క్లియర్ చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబసర్వేకి సంబంధించిన దానిపై కేబినెట్‌లో చర్చించామని సబ్ కమిటీ రివ్యూ చేసి సభ ముందుంచుతామన్నారు. బలహీన వర్గాల బిడ్డగా బీసీలకు న్యాయం జరగడానికి పని చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాలకు స్థలాలు ఇస్తూ జీవో ఇచ్చారని.. కానీ నిధులు ఇవ్వలేదన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. విదేశీ స్కాలర్‌షిప్‌లు ఇప్పటి వరకు సంవత్సరానికి 300 ఉండేవని.. ఇప్పుడు 700కి పెంచుకున్నామన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లో 327 పాఠశాలలు ఉంటే వాటిల్లో కేవలం 27 స్కూల్స్‌కి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయన్నారు. అద్దె భవనాలకు కిరాయి కట్టలేని పరిస్థితి ఉంటే భవన యజమానులు స్కూల్ బిల్డింగ్స్‌కి తాళం వేసిన పరిస్థితి చూశామన్నారు. తాను మంత్రి అయిన తరువాత తాళాలు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. బీసీల కోసం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తామని, బీసీ సబ్‌ప్లాన్‌కి ప్లాన్ చేస్తున్నామన్నారు. కులాలా కార్పొరేషన్లకు నిధులు ఇస్తామని, బలహీన వర్గాల సంక్షేమంపై సభ్యుల సూచనలు తీసుకుంటామని తెలిపారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న జి.చిన్నారెడ్డి

# ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఏడుగురికి సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 24, ప్రభాతవార్త:** వివిధ ఆరోగ్య సమస్యలతో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ఏడుగురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రెండు లక్షల 92వేల 500 రూపాయల(2,92,500) చెక్కులను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ ,సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి డాక్టర్ జీ.చిన్నారెడ్డి అందజేసారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో జరిగిన కార్యక్రమంలో చిన్నారెడ్డి సంబంధిత వ్యక్తులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేసారు. హైదరాబాద్ కాటేదాన్ చెందిన మహ్మద్ మజీద్‌కు రూ 60,000లు కాటేదాన్ కు చెందిన మధుసూధన్ రెడ్డికి రూ 85,000లు, కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ కు చెందిన అశోక్ రావుకు రూ 60,000లు, హైదరాబాద్ ఛార్మినార్ కు చెందిన సర్పరాజ్ హుస్సేన్ కు రూ 38,500లు బొమ్మల రామారం గ్రామానికి చెందిన రవికి రూ 17,000లు సిద్దిపేట రాయపూర్‌కు చెందిన ఉదయకు 8వేల రూపాయలు, సరూర్‌నగర్ ఆర్కే పురానికి చెందిన మహేష్‌కు రూ 24వేల రూపాయల చెక్కులను చిన్నారెడ్డి బాధితులకు అందజేసారు.

# నేటి నుంచి హైదరాబాద్‌లో అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

### గచ్చిబౌలిలో ప్రారంభించనున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదారబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరం మరో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. బుధవారం నాడు మొదలు కానున్న 74వ అఖిల భారత బిఎన్ మల్లిక్ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా లాంఛనంగా ప్రారంభించనున్నారు. 12 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలతో పాటు పారా మిలటరీ బలగాల జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో 34 పురుషుల జట్లు తొమ్మిది మహిళల జట్లు వున్నాయి. మొత్తం మీద 1038 మంది క్రీడాకారులు ఇందులో పాలుపంచుకుంటున్నారు. వీరిలో 187 మంది మహిళలు వున్నారు. ఈ పోటీల కోసం ఐదు మైదానాలను ఎంపిక చేశారు. మొత్తం 110 మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని జట్ల క్రీడాకారులు హాజరవనున్నారు. వీరితో పాటు భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ విక్టర్ అమల్‌రాజ్, మహిళల జట్టు క్రీడాకారిని సౌమ్యా సహా దిగ్గజ్జ క్రీడాకారులు పాల్గొనున్నారు. కాగా అన్ని మ్యాచ్‌లను ఉచితంగా చూసేందుకు అవకాశం కల్పించినట్లు డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారులు, ఔత్సాహిక క్రీడాకారులు దీనిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

# టిజిసెట్ 5వ తరగతి ఫలితాలు విడుదల

### మొదటి విడతలో 47,381 మంది ఎంపిక

### వారంలో 6 నుంచి 9వ తరగతి ఫలితాలు విడుదల

### నేటి నుంచి ఏప్రిల్ 15లోగా విద్యార్థులు గురుకులాల్లో చేరాలి

**హైదారబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించిన టిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026లో భాగంగా 5వ తరగతి ఫలితాలను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మంగళవారం విడుదల చేశారు. 5వ తరగతిలో 51,284 సీట్లకిగానూ మొదటి విడతలో 47,381 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు నేటి(బుధవారం) నుంచి ఏప్రిల్ 15లోగా ఆయా స్కూల్స్‌లో చేరాలన్నారు. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని ఎస్సీ గురుకుల సొసైటీ భవనంలో మంగళవారం టీజీసెట్-2026 ఫలితాలను మంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైకోర్ చైర్మన్ డాక్టర్ తేజవత్ బెల్లయ్య నాయక్, టీజీటిడబ్ల్యూఆర్ ఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మి, ఎంజేపీటిబిసిడబ్ల్యూఆర్ ఈఐఎస్ కార్యదర్శి సైదులు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బిఎం సంతోష్, అదనపు కార్యదర్శి గీత నాయక్, జాయింట్ సెక్రటరీలు శారద, షుక్రునాయక్ పాల్గొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్, టీజీటిడబ్ల్యూ ఆర్ఈఐఎస్, ఎంజేపీ టిబిసిడబ్ల్యూ ఆర్ఈఐఎస్, టీఆర్ఈఐఎస్ సంస్థల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం టీజీసెట్-2026ను ఫిబ్రవరి 22న నిర్వహించారు. 635 గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతిలో 51,284 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఫిబ్రవరి 22న టిజిసెట్‌ను 492 కేంద్రాలలో నిర్వహించినట్టు మంత్రి తెలిపారు. పరీక్షకు 1,82,061 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 1,72,913 మంది పరీక్షకు హాజరయ్యారు. 100 మార్కులకి గానూ అత్యంగా 98 మార్కులను విద్యార్థులు సాధించినట్టు తెలిపారు. మొదటి విడతలో 47,381 సీట్లు కేటా యించబడ్డాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నేటి(మార్చి 25) నుండి ఏప్రిల్ 15 వరకు తమకు కేటాయించిన పాఠశాలల్లో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించి ఫలితాలను ప్రకటించామని మంత్రి అడ్లూరి తెలిపారు. విద్యార్థులు గురుకుల సీట్ల కోసం మధ్యవర్తులు, దళారులను నమ్మవద్దని స్పష్టం చేశారు. ఎస్సీ గురుకులంలో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ఆర్థిక శాఖతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే అవి పరిష్కారం కానున్నాయని తెలిపారు. అలాగే కార్మిక చట్టాల ప్రకారం వేతనాలను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్ పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్ పథకం కింద ఎంపికైన 18 మంది గిరిజన పారిశ్రామిక వేత్తలకు రూ. 23.44 కోట్ల విలువైన యూనిట్లకు ఆమోద పత్రాలతోపాటు రూ. 8.16 కోట్ల సబ్సిడీ చెక్కు లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ట్రైకోర్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌తో కలిసి పంపిణీ చేశారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Project Office, Rayapudi, Amaravati - 522237 (A.P.)
NIT No. 129/MAU61-ADMN0IS(APWS)/2/2026-IS Dt. 24.03.2026
E PROCUREMENT TENDER NOTICE
Name of Work: "RFP for Selection of Agency to Design, Develop, Host, Deploy and Web and Mobile platform for HRMS and AI-powered Attendance Management of APCRDA for the period of 3 years". The bid can be downloaded on AP e-procurement portal from 25.03.2026 to 09.04.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 09.04.2026 up to 15.00 Hrs. Technical bid opening 09.04.2026 @ 16.00 Hrs.
For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

వార్త

పాఠకుల తక్కువ సమయం తీసుకుని ఎక్కువ విజ్ఞానం అందించే రచయిత ప్రతిభావంతుడు.

- సి.సి.కోల్టన్

# 'ఆనందం' కొంచెమే!


ఆనందపరవశం అంటే శరీరంలోని నవనాడులు ఉత్తేజపడి సంతోషదాయక భావనలు వెల్లివిరిస్తే ఆ జీవితానికి అంతకంటే కావాల్సిందేముంది. అందుకే మానవాళిలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండే రోజు కోసం, క్షణం కోసం తపన పడుతుండటం సహజం. ఇదే సూత్రాన్ని అన్నిదేశాలకు వర్తింపచేస్తూ ఐక్యరాజ్యసమితి సంవత్సరానికి ప్రత్యేకించి ఒక రోజును దానికోసమే కేటాయించింది. అంటే ఏదో పండుగ రోజులలో ఉండేటట్లు అన్ని రోజులూ నిత్య వసంతం కావాలనుకోవడం ఎవరికైనా తప్పదు. కానీ ఏదో ఐక్యరాజ్య సమితి చెప్పింది కదా అని ఆ ఒక్కరోజుకే సంతోషం పరిమితం అంటే అది జరగని పని. ఏరోజున ఎవరు ఆనందంగా ఉంటారో, ఎవరు కష్టాలు ఎదుర్కుంటారో చెప్పలేం. అది సాధ్యమయ్యే పని కూడా కాదు. అందుకే ఏడాది పొడుగునా ఆ దేశ కాల మాన పరిస్థితుల రీత్యా ఆనంద జీవితం గడుపుతున్నారో లేదో వివిధ మార్గదర్శకాలకు, ప్రామాణికాలకు లోబడి ప్రశాంతంగా, సంతోషంగా ఉంటున్నారో లేదో పరిగణనలోకి తీసుకుని ఆయా దేశాలకు ర్యాంకులను ఇవ్వడం ఆనవాయితీ. ఈసారి కూడా ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్ ఈ ర్యాంకుల జాబితాను విడుదల చేసింది. అందులో తాజాగా ప్రపంచంలో ఫిన్లాండ్ ఎప్పటిలానే అత్యంత సంతోషకరమైన దేశంగా రాజిల్లింది. వరుసగా తొమ్మిదోసారి ఈ దేశం అగ్రస్థానంలో నిలబడింది. భారత్ 116వ స్థానంలోకి చేరుకుంది. గత ఏడాది ఎంపికలో భారత్ 118వ స్థానంలో ఉండేది. 2024లో పొందిన ర్యాంకు 118 కన్నా కాస్త మెరుగైన స్థితిలోనే ఉంది. అంటే ఇప్పుడు రెండు స్థానాలకు ఎగబాకిందని చెప్పుకోవాలి. ఈ నెల20న అంతర్జాతీయ ఆనంద దినోత్సవం సందర్భంగా ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ ఇటీవల వార్షిక నివేదిక వివిధ దేశాల స్థాయిల గురించి వివరించింది. ఫిన్లాండ్‌కే ఈ ఘనత దక్కిందని చూస్తే మంచి విశ్లేషణలు అందుబాటులోకి వచ్చాయి. యువతపై ముఖ్యంగా పశ్చిమ ఐరోపా, పాశ్చాత్య దేశాల్లోని బాలికలపై సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం ఆందోళనకరంగా ఉందని నొక్కి చెప్పింది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్లలో 25 ఏళ్లలోపు వారి జీవన విధానం అస్థిరంగా ఉందని, సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడపడమే ఈధోరణికి కారణమని వెల్లడించింది. నివేదిక ప్రకారం నార్డిక్ దేశాలైన డెన్మార్క్, ఐస్‌ల్యాండ్, స్వీడన్, నార్వేలు కూడా మొదటి 10 దేశాల్లో స్థానం సంపాదించాయి. 2023లో 23వ స్థానంలో ఉన్న కోస్టారికా ఈ ఏడాది నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ దేశ ప్రజల సామాజిక జీవిత ప్రమాణాలు, వాటి నాణ్యత, ప్రస్తుత స్థిరత్వంతోనే అత్యంత సంతోషకర జాబితాలో స్థానం సంపాదించాయని వెల్ బీయింగ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జాన్ ఇమాన్యుయేల్ పేర్కొన్నారు. అమెరికా ఈ జాబితాలో 23వ స్థానాన్ని పొందింది. కెనడా 25, బ్రిటన్ 23వ స్థానాల్లో నిలిచాయి. సంక్షోభం ఎదుర్కొంటున్న అఫ్ఘానిస్థాన్ ఈ ఏడాది కూడా అత్యంత అసంతృప్తికర దేశంగా నిలిచింది. తర్వాతి స్థానాల్లో ఆఫ్రికాలోని సియెర్రా లియోన్, మలావి ఉన్నాయి. అత్యంత సంతోషకర దేశాల జాబితాలోని భారత్‌లో అవినీతి, దాతృత్వం, స్వేచ్ఛ, తలసరి ఆదాయం, ఆరోగ్యకర జీవనం వంటి విభాగాల వారీగా విడివిడిగా చూసినప్పుడు ఈ ఏడాది స్థాయిలు చాలా మెరుగయ్యాయి. సంతోషకర దేశాల జాబితాలో నేపాల్ 99వ స్థానంలో, పాకిస్థాన్ 104వ స్థానంలో ఉండటం గమనార్హం. సంతోషానికి ప్రాధాన్యతనివ్వని జీవి అంటూ ఈ భూమ్మీద ఏదీ ఉండదు. జీవితాన్ని సంతోషపరంగా నందనవనం చేసుకోగలిగినవారే ధన్యత నొందిన వారిలో జమ. అలాగే ప్రజా శ్రేయస్సు కోసం ప్రపంచ దేశాలను చైతన్యపరచడమే ప్రధాన ఉద్దేశం. తొలి రోజుల్లో సుఖమయ జీవితమే పరమానందం అనే భావనను కలుగ చేసిన దేశం ఏదైనా ఉందంటే అది భూటాన్. ఈదినోత్సవం ప్రాముఖ్యతను ప్రజల్లో ఇలాంటి భావనను చైతన్యపరిచేలా ప్రభుత్వాలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అందరూ భాగస్వాములు కావాలని ఐక్యరాజ్యసమితి పిలుపుతో జనం సంఘటితమైనారని చెబుతున్నారు. సంతోషానికి సంబంధించి, భారత్ కంటే మన పొరుగు దేశాలైన శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లో కూడా ప్రజలు మనకంటే సంతోషంగా జీవిస్తున్నట్లు రిపోర్ట్ పేర్కొంది. ఫిన్ల్యాండ్, డెన్మార్క్, స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, నెథర్లాండ్స్ దేశాలు వరుసగా టాప్ 5లో ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా ఉన్న దేశంలో అసమానతలు, పేదరికం కూడా ఎక్కువే. 161 దేశాలలో మన దేశం అసమానతల సూచీలో 123లో ఉండటం ఇందుకు నిదర్శనం. ధనిక పేదల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుస్తుంది. మనిషి ఎంత సంతోషంగా ఉన్నా, కొన్నికొన్ని సందర్భాలలోఆనందానికి దూరంగా ఉన్న విషయాలు కూడా తలెత్తుతాయి. ఉరుకుల పరుగుల జీవితంలో సగటు నిత్యం పనిలో డబ్బు సంపాదనలో నిమగ్నంకావడం ఒకటైతే సంతోషంగా కుటుంబంతో గడపకపోవడం మరొకటి ఇటీవలఎక్కువైంది. అందుకే కాలగతిలో ప్రతి నిముషం విలువైనదే. మనకున్న కాలాన్ని వ్యర్థం చేసుకోవడమంటే అదికూడా ఒక తప్పిదమే అనుకోవాలి. అందుకే. ప్రతిక్షణాన్ని ఆనందమయం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మనతోపాటు మన చుట్టూ పక్కల వారు కూడా ఆనందంగా ఉండడం అవసరమేమో! పేదరిక నిర్మూలన, అసమానతల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ అంశాల ప్రాతిపదికగా ముందుకు సాగితే సమాజం మొత్తం సంతోషదాయకమే!

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే, గొప్ప సైన్యానికి మించిన శక్తి మనకి లభిస్తుంది.




ఉడ్రోవిల్సన్

ఇంద్రియ పరమైన విషయాలతో ఎంతగా మనిషి తెగతెంపులు చేసుకుంటాడో, అంతగా అతడు భగవంతుని పట్ల ఆకర్షితుడవుతాడు.



రమణ మహర్షి

## ప్రజావాక్కు



### రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

దేశంలోఉన్న అందరూ వ్యక్తులలో అత్యంత ఆరోగ్యవంతంగా ఉండే వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది కేవలం రైతన్న మాత్రమే. తాను నిరంతరం ప్రతి రోజు రకరకాల పనులు చేయడం వలన శరీరం లోని అన్ని భాగాలకు పని చేయడం కల్పించడం వల్లఆరోగ్యకరంగా ఉంటాడు. మిగతా వ్యక్తులు ఏదోఒక అనారోగ్యసమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. ఒక గిట్టుబాటు ధర రైతన్నకు అనుకూలంగా ఉంటే ఇక రైతురాజు అయినట్టే. ఆ గిట్టుబాటు ధర వస్తుందో లేదో చూడాలి మరి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిదాదాపు రెండుసంవత్సరాలు దాటిన నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు. ఉద్యోగ నోటిఫికేషన్ మాటనే చెప్పుటలేదు. ఉద్యోగాలు ఇస్తుందని నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతూ ఆత్మహత్యలు చేసుకుంటూ నిరాశ నిస్పృహలోకి వెళ్తున్నారు. నోటిఫికేషన్ ఇవ్వాలని పోరాడిన వారిపై అక్రమకేసులు పెడుతున్నారు. నిరుద్యోగ యువతను ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని గమనించాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రలు ఇచ్చి డెబ్బై వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నారు.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### భూమి కబ్జాలను ఆపాలి

రెవిన్యూ కార్యాలయంలో ప్రతి భూమి సర్వేనంబర్, విస్తీర్ణం, మ్యాపులు ఉండాలి. ప్రభుత్వం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కాలనీ వివరాలు అన్ని ఉండాలి. కానీ వరంగల్ జిల్లాలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగాజరుగుతున్నాయి. రెవిన్యూఅధికారులు ప్రభుత్వ భూమిని కబ్జాలు చేసిన వారిని, అక్రమ నిర్మాణం చేసిన వారిని పట్టించుకోవడం లేదు. రెవిన్యూ అధికారులు రికార్డులులేవు అంటున్నారు. భూమికబ్జాలకురాజకీయ జోక్యం తోడుగా ఉంటుంది. అధికారులు రికార్డులులేవు అని సాకులు చెప్పి రోజులు నెలలు సంవత్సరాలు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనితో భూమి కబ్జాలు ఎక్కువ అవుతున్నాయి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం

డిజిటల్ యుగంలో సమాచార సాంకేతికత ప్రజల జీవితంలో కీలక భాగంగా మారింది. బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, డిజిటల్ చెల్లింపులు వంటి కార్యకలాపాలు రోజువారీ జీవితంలో సాధారణమయ్యాయి. అయితే ఈ సౌకర్యాలతో పాటు సైబర్ మోసాల సమస్య కూడా దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతోంది. మోసగాళ్లుతప్పుడుసందేశాలు, నకిలీ వెబ్‌సైట్లు, పెట్టుబడివాగ్దానాలు, తప్పుడు కాల్‌లద్వారా ప్రజలను మోసం చేసి భారీ మొత్తాలను దోచుకుంటున్నారు. ఇటీవలి కాలంలో బ్యాంకుఖాతా వివరాలు అడగడం, తప్పుడు లింకులు పంపించడం, పెట్టుబడుల పేరుతో అధిక లాభాల ప్రలోభాలు చూపించడం వంటి పద్ధతులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలియకపోవడం లేదా అప్రమత్తత లేకపోవడం వల్ల చాలామంది ఈ మోసాలకు బలవుతున్నారు. ఫలితంగా వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కూరగాయల ఉత్పత్తి చేపట్టాలి

ఆస్తులసృష్టిని ఆధారంగా చేసుకొని ఇక ఉపాధిహామీ పనులు ఉండబోతున్నాయి. ఇది ఒక విధంగా మంచిదే అయితే తీరు మారుతున్న లేదారూపుమారుతున్న ఉపాధిలో ఏమి ఉండాలన్నదే అసలు ప్రశ్న. ఇంకోకవైపు వాటర్ షెడ్ కలగొలుపుగా ఉపాధి పనులు ఉండనున్న నేపథ్యంలో తెలంగాణ లాంటి రాష్ట్రాలు ఫారం పొండ్ల పైన దృష్టిసారించాలి. దీనివల్ల ప్రజలకు అదనపు ఆదాయం సమాకురడంతో పాటు ఉపరితల నీటి మట్టం కూడా పెరిగే అవకాశం ఉంది. కావున నీటి కుంటాలతో పాటు కూరగాయ పందిల్లు కూడా అవకాశం కల్పిస్తే తెలంగాణ లాంటి రాష్ట్రాలు కూరగాయల ఉత్పత్తి హాబ్‌లుగా మారే అవకాశం ఉంది.

- భారత అవినాష్, జనగాం

### చెత్తతో విద్యుత్ ఉత్పత్తి

తమిళనాడు ప్రభుత్వం ఆరాష్ట్రంలో పేరుకుపోతున్న లక్షల టన్నుల చెత్తను తగలబెట్టకుండా దానినిశాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి సంకల్పించిదని వార్తలో చదవడం జరిగింది. ఇటువంటి పద్ధతి మరీ కొత్త విషయం కాకపోయినా ఈదశగా ప్రయత్నాలు చేయడం లేదు. మన తెలుగురాష్ట్రాలు తమ అధికారులను తమిళనాడుకు పంపి వారు తీసుకున్న సాంకేతికతను తెలుసుకుని మన వాళ్ళు కూడా విద్యుతుత్పత్తి చేస్తే కరెంటు కొరత తగ్గుతుంది.

- ఎన్. లక్ష్మి, సికింద్రాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదాన్ని పసిగట్టే సాంకేతికత అవసరం

*ప్రమాదం జరిగినప్పుడు పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనం లేదు. భవన నిర్మాణ చట్టాలను శాస్త్రీయంగా సవరించాలి. కేవలం స్థలవిస్తీర్ణాన్ని బట్టి కాకుండా శాస్త్ర, సాంకేతికతను ఆపాదించాలి. గాలి ప్రసరణకు అనుగుణంగా సమూలంగా సవరించాలి. ప్రతి కాలనీలో గాలి ప్రసరణకు అడ్డుపడని కారిడార్లను వదిలేలా చట్టపరమైన, పటిష్టమైన విధానాలను తీసుకురావాలి. గాలి ప్రసరణకు ప్రాధాన్యతనిస్తూ జోనింగ్ నిబంధనలను కఠినతరం చేయాలి. పటిష్టమైన ఫైర్‌సేఫ్టీ ఆడిట్‌లను నిరంతరం నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇలాంటి విషాదాలను శాశ్వతంగా నివారించగలం. పౌరులలో కూడా భద్రత పట్ల అవగాహన పెరగాలి. మూలాల్లో ఈ మార్పులు రానంతవరకు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించడం మినహా మనం చేయగలిగింది ఏమీ ఉండదు.*

డి జె మోహన రావు

దేశ రాజధాని ఢిల్లీలోని పాలం ప్రాంతంలో మార్చి పద్దెనిమిదవ తేదీన జరిగిన అగ్నిప్రమాదం కేవలం ఒక ప్రమాదం మాత్రమే కాదు, అది మన వ్యవస్థాగత లోపాలకు సజీవ సాక్ష్యం. సాధ్ నగర్ మార్కెట్‌లోని ఒక ఐదు అంతస్తుల భవనంలో తెల్లవారుజామున చెలరేగిన మంటలు ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మందిని బలితీసుకోవడం అత్యంత విషాదకరం. అభం శుభం తెలియని ముగ్గురు పసిపిల్లలతో సహా ఆ కుటుంబం నిద్రలోనే అగ్నికి ఆహుతి కావడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఈ అగ్నిప్రమాదం నాగరిక సమాజం తలదించుకునేలా చేసింది. అగ్నిప్రమాదం కేవలం ఒక యాదృచ్ఛిక ఘటన కాదు, అది ఆధునిక నగరీకరణ సృష్టిస్తున్న ప్రమాదాలకు ఒక సజీవ సాక్ష్యం. మన వ్యవస్థాగత లోపాలను తీవ్రంగా ప్రశ్నిస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుస్తులు, కాస్మెటిక్స్ దుకాణంలో మొదలైన ఒక చిన్న నిప్పు రవ్వ, క్షణాల్లో పైఅంతస్తులకు వ్యాపించి ఆ నివాసాన్ని మృత్యుకుహరంగా మార్చింది. ఈ ఘటనను కేవలం అగ్నిమాపక శాఖ వైఫల్యంగానో, షార్ట్ సర్క్యూట్‌గానో కొట్టిపారేయలేము. దీని వెనుక అత్యంత సంక్లిష్టమైన రసాయన, భౌతిక, ఆర్థిక, పర్యావరణ కారణాలు విశ్లేషిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూస్తాయి. ఒకప్పుడు దుకాణాలలో చెక్కతో, ఇనుముతో తయారు చేసిన వస్తువులు ఉండేవి. ఒక వేళ అగ్నిప్రమాదం జరిగినా అవి నెమ్మదిగా కాలేవి. కానీ నేటి వాణిజ్య సముదాయాలు పూర్తిగా పెట్రోకెమికల్ ఉత్పత్తులతో నిండి ఉంటున్నాయి. పాలం ఘటనలో కిందిఅంతస్తులో ఉన్న పాలిమర్ వస్త్రాలు, పర్ఫ్యూమ్ బాటిళ్లలో ఉండే ఏరోసాల్స్, ఇతర సింథటిక్ రసాయనాలు మంటలకు విపరీతమైన ఇంధనాన్ని అందించాయి. గాలి చొరబడని మూసి ఉన్న భవనాల్లో ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా వందల డిగ్రీలకు చేరినప్పుడు 'ఫ్లాష్ ఓవర్' అనే శాస్త్రీయ ప్రక్రియ జరుగుతుంది. అంటే, ఆ గదిలోని వస్తువులన్నీ ఒకేసారి అంటుకుని పేలిపోతాయి. దీనికితోడు భవనానికి సరైన వెంటిలేషన్ లేకపోవడం వల్ల, ఆ భవనం ఒక పొగగొట్టంలా మారి, కింది నుంచి ఆక్సిజన్‌ను లాక్కుంటూ మంటలను, దట్టమైన విష వాయువులను వేగంగా పై అంతస్తులకు చేరవేసింది. ఈభౌతిక శాస్త్ర సూత్రాలకు, మన నగరాలలోని ఆర్థిక అసమానతలు తోడవడం వల్లే ప్రాణనష్టం ఊహించని స్థాయిలో ఉంటోంది. కింది అంతస్తుల్లో అత్యంత ప్రమాదకరమైన వ్యాపారాలు చేస్తూ, పై అంతస్తుల్లో నివాసం ఉండటం అనేది ఎవరూ ఇష్టపడి చేసే పని కాదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆకాశాన్ని అంటుతున్న రియల్ ఎస్టేట్ ధరలు, అద్దెల కారణంగా చిన్న వ్యాపారులు తమ ఉపాధికి, నివాసానికి వేర్వేరు చోట్ల వెచ్చించలేకపోతున్నారు. ఎక్కడైతే వారి జీవనాధారం ఉందో, కచ్చితంగా అక్కడే నివాసం ఉండటం వారికి ఆర్థికంగా ఒక అనివార్యత. మున్సిపల్ చట్టాలు, జోనింగ్ నిబంధనలు ఈ క్షేత్ర స్థాయి ఆర్థిక వాస్తవాలను పట్టించుకోకుండా, కేవలం కాగితాల మీద కఠిన నిబంధనలు రాయడం వల్లే అవిఎప్పటికీ సరిగ్గా అమలు కావడం లేదు. దీనికితోడు సంబంధింత అధికారుల అవినీతి కారణంగా, కనీస భద్రతా ప్రమాణాలు లేని ఇరుకైన భవనాలకు



సైతం సులభంగా వాణిజ్య అనుమతులు లభిస్తున్నాయి. పర్యావరణం, నగరాల నిర్మాణం కూడా ఈ ప్రమాదాల తీవ్రతను, సహాయక చర్యలకు అడ్డంకులను పెంచుతున్నాయి. కాంక్రీట్ అడవులుగా మారుతున్న నగరాల్లో 'అర్బన్ హీట్ ఐలాండ్' ప్రభావం వల్ల భవనాలు ఎప్పుడూ వేడెక్కి ఉంటున్నాయి. దీనికి తోడు భవనాల మధ్యగాలి ఆడే ఖాళీ స్థలం లేకపోవడం వల్ల, మంటలు వచ్చినప్పుడు ఆ వీధులన్నీ గాలిని లాక్కునే పొగగొట్టాల్లా పనిచేసి మంటలను మరింత ఎగదోస్తున్నాయి. ఆ ఇరుకైన గల్లీల్లో కనీసం గాలి ఆడే అవకాశం కూడా ఉండదు. సరిగ్గా ఇలాంటి ఇరుకైన వీధులే సహాయక చర్యలకు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి. పాలం ఘటనలో భారీ ఫైర్ ఇంజన్లు, హైడ్రాలిక్ యంత్రాలు ఆ ఇరుకు సందుల్లోకి సకాలంలో వెళ్లలేకపోవడం వల్లే ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కనీసం మంటల నుంచి తప్పించుకోవడానికి ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లాంటి ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం వల్ల ఆ కుటుంబం లోపలే చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు విడిచింది. ఇవన్నీ ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో స్పష్టం చేస్తున్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి పాత పద్ధతులు ఇక ఏమాత్రం పనిచేయవు. ఆధునిక సాంకేతికతను, పటిష్టమైన విధానాలను జోడించి వినూత్న పరిష్కారాలు కనుగొనాలి. ఇరుకైన వీధుల్లోకి ఫైర్ ఇంజన్లు వెళ్లలేవు అనేది దశాబ్దాలుగా వింటున్న పాత సాకు. ఈ సవాలును జయించడానికి మనం ఆధునిక సాంకేతికతను వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. వీధుల్లో ట్రాఫిక్ లేదా ఇరుకు మార్గాలు అడ్డంకిగా మారినప్పుడు, ఆకాశ మార్గం ద్వారా మంటలను అదుపులోకితెచ్చే డ్రోన్ వ్యవస్థలను నగరాల్లో తప్పనిసరి చేయాలి. అత్యవసర సహాయం అందించే 'ఫైర్ ఫైటింగ్ డ్రోన్లను', చిన్న సైజులో ఉండే 'మినీ ఫైర్ టెండర్లను' ప్రతి మార్కెట్ ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురావాలి. డ్రోన్ల ద్వారా పై అంతస్తుల్లో ఉన్న మంటలను అత్యంత సులభంగా అదుపు చేయవచ్చు. దట్టమైన వాణిజ్య ప్రాంతాల్లో థర్మల్ ఇమేజింగ్ కెమెరాలతో ఏ ఇళ్లలో పరిమితికి మించి వేడి ఉత్పన్నం అవుతుందో ముందుగానే పసిగట్టే ప్రిడిక్టివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను మున్సిపల్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించాలి. మంటలు అంటుకున్నాక నీళ్లు చల్లడం కన్నా, ముందే ప్రమాదాన్ని పసిగట్టే సాంకేతికత మనకు చాలా అవసరం. అలాగే, వాణిజ్య సముదాయాల్లో థర్మల్ ఇమేజింగ్ సెన్సార్లను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్మోక్ డిటెక్టర్లను అమర్చి, వాటిని నేరుగా అగ్నిమాపక కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలి. దీన్ని అరికట్టాలంటే నగరాల నిర్మాణ చట్టాలను పర్యావరణ అనుకూలంగా మార్చాలి. కేవలం ప్రమాదం జరిగినప్పుడు పరిహారం ప్రకటించడం వల్ల ప్రయోజనం లేదు. భవన నిర్మాణ చట్టాలను శాస్త్రీయంగా సవరించాలి. కేవలం స్థలవిస్తీర్ణాన్ని బట్టి కాకుండా శాస్త్ర, సాంకేతికతను ఆపాదించాలి. గాలి ప్రసరణకు అనుగుణంగా సమూలంగా సవరించాలి. ప్రతి కాలనీలో గాలి ప్రసరణకు అడ్డుపడని కారిడార్లను వదిలేలా చట్టపరమైన, పటిష్టమైన విధానాలను తీసుకురావాలి. గాలి ప్రసరణకు ప్రాధాన్యతనిస్తూ జోనింగ్ నిబంధనలను కఠినతరం చేయాలి. పటిష్టమైన ఫైర్‌సేఫ్టీ ఆడిట్‌లను నిరంతరం నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలుతీసుకోవడంద్వారా మాత్రమే ఇలాంటి విషాదాలను శాశ్వతంగా నివారించగలం. పౌరులలో కూడా భద్రత పట్ల అవగాహన పెరగాలి. మూలాల్లో ఈ మార్పులు రానంతవరకు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియాలు ప్రకటించడం మినహా మనం చేయగలిగింది ఏమీ ఉండదు. ●

# ఒత్తిడి తగ్గించాలంటే పరీక్షలే తీసేయాలా?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి బోర్డు పరీక్షలను కొనసాగించాలా లేదా అన్న చర్చ ఇటీవల విద్యా రంగంలో వేడెక్కిన అంశంగా మారింది. విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించాలన్న ఉద్దేశంతో కొందరు బోర్డు పరీక్షలను రద్దు చేయాలని సూచిస్తుండగా, మరికొందరు ఇది విద్యా ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని సమగ్రంగా విశ్లేషించడం అవసరం. 10వ తరగతి బోర్డు పరీక్షలు భారత విద్యావ్యవస్థలో ఒక కీలక మైలురాయిగా భావించబడతాయి. విద్యార్థి విద్యా ప్రయాణంలో ఇది మొదటి ప్రధాన పరీక్ష. ఈ పరీక్ష ద్వారా విద్యార్థి తన విద్యా స్థాయిని అంచనా వేసుకోవడమే కాకుండా, భవిష్యత్తు విద్యా దిశను నిర్ణయించుకునే అవకాశం పొందుతాడు. బోర్డు పరీక్షలు ఉండటం వల్ల విద్యార్థుల్లో ఒక విధమైన బాధ్యతాభావం, క్రమశిక్షణ పెరుగుతాయి. లక్ష్యాన్ని చేరుకోవాలనే తపన వారికి కష్టపడి చదవడానికి ప్రేరణగా నిలుస్తుంది. అయితే, బోర్డు పరీక్షలపై ఉన్న ఒత్తిడి కూడా చిన్న విషయంకాదు. చాలా మంది విద్యార్థులు ఈ పరీక్షల కారణంగా మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిసార్లు ఈ ఒత్తిడి వారి ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో పరీక్షలను రద్దు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించవచ్చని కొందరు భావిస్తున్నారు. అంతేకాకుండా, నిరంతర మూల్యాంకన విధానాల ద్వారా విద్యార్థి సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేయవచ్చని వాదిస్తున్నారు. కానీ, బోర్డు పరీక్షలను పూర్తిగా రద్దు చేయడం అనేది సరికాని నిర్ణయంగా భావించవచ్చు. ఎందుకంటే, పరీక్షలు లేకపోతే విద్యార్థుల్లో చదువుపై ఉన్న శ్రద్ధ తగ్గే అవకాశం ఉంది. ఒక స్పష్టమైన లక్ష్యం లేకపోతే చాలా మంది విద్యార్థులు నిర్లక్ష్యంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యపట్ల అవగాహన తక్కువగా ఉన్న చోట్ల, బోర్డు పరీక్షలు ఒక ప్రధాన ప్రేరణగా పనిచేస్తాయి. అవి



లేకపోతే విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. అదేవిధంగా, బోర్డు పరీక్షలు విద్యార్థుల మధ్య పోటీ భావనను పెంచుతాయి. ఈ పోటీ భావన వల్లవారు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నిస్తారు. పరీక్షలు లేకుండాపోతే ఈ పోటీ తగ్గిపోవచ్చు. దీని వల్ల విద్యా ప్రమాణాలు క్రమంగా పడిపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఉపాధ్యాయుల దృష్టిలో కూడా బోర్డు పరీక్షలు ఒక నియంత్రణ సాధనంగా పని చేస్తాయి. పరీక్షలు ఉండటం వల్ల వారు సిలబస్‌ను సమయానికి పూర్తి చేయడానికి కృషి చేస్తారు. విద్యార్థులను కూడా సమర్థంగా సిద్ధం చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తారు. పరీక్షలు లేకుండా పోతే ఈ క్రమశిక్షణలో లోపం వచ్చే అవకాశం ఉంది. అయితే, దీనికి ప్రత్యామ్నాయాలు లేవనుకోవడం కూడా సరికాదు. పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి బోర్డు పరీక్షల రూపాన్ని మార్చడం ఒక మంచి పరిష్కారంగా ఉండవచ్చు. ఉదాహరణకు, ఒక్కసారి జరిగే భారీ పరీక్షకు బదులుగా, సెమిస్టర్ విధానం లేదా బహుళ చిన్న పరీక్షల ద్వారా విద్యార్థుల పనితీరునుఅంచనా వేయవచ్చు. అలాగే, ప్రాజెక్టులు, ప్రాక్టికల్స్, ప్రెజెంటేషన్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయవచ్చు. ఇక మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పాఠశాలల్లో కౌన్సెలింగ్ సదుపాయాలను పెంచడం అవసరం. విద్యార్థులకు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం కూడా ముఖ్యం. పరీక్షల వల్ల కలిగే భయాన్ని తగ్గించడంద్వారా వారు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలుగుతారు. సారాంశంగా చెప్పాలంటే, 10వ తరగతి బోర్డు పరీక్షలను పూర్తిగా రద్దుచేయడం కంటే, వాటిని సమర్థవంతంగా పునర్నిర్మించడం సమంజసం. విద్యార్థుల్లో భయం తగ్గిస్తూ, చదువుపై ఆసక్తి పెంచేవిధంగా వ్యవస్థను రూపుదిద్దాలి. విద్యా ప్రమాణాలు నిలబెట్టడం, విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడడం ఈరెండింటి మధ్య సమతౌల్యం సాధించడం ప్రభుత్వానికి, విద్యావేత్తలకు పెద్ద సవాల్. సరైన నిర్ణయం తీసుకుంటేనే భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్య అందించగలుగుతాం. ●

# అప్పుల ఊబిలోకి జారిపోతున్నామా?

ఇస్కా రాజేష్ బాబు

సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశా ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025-26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం. దేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ.1.34 లక్షల అప్పుంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. అయినప్పటికీ ఈ సంవత్సరం (2026-27) కూడా భారీ స్థాయిలో అప్పులుచేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణానికి 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం. 2026 27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ.17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు. 2025-26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ.1,97,18,016 కోట్లు కాగా మార్చి 2027 నాటికి ఇది 2,14,82,050 కోట్లకు చేరనుంది. ఇక జీడీపీలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజా బడ్జెట్‌లో జీడీపీలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు. 2026 మార్చి 31నాటికి భారత కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ. 197.18 లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటాయని అంచనా వేశారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ.214.82 లక్షల కోట్లకు చేరవచ్చని మొత్తం అప్పు సుమారు 85శాతంగా ఉంది. 2026లో 2025-26 ఆర్థిక సంవత్సరంలోకేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026-27 నాటికి రూ.214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా. వ్యక్తిగత భారం:2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం)ఉంది. ద్రవ్యలోటు: 2025-26లో 4.4 శాతం, 2026-27 నాటికి 4.3 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 నాటికి 56.1శాతంగా



ఉన్న అప్పు జీడీపీ నిష్పత్తిని, 2026-27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ.7.46 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా వేశారు. 2026-27 బడ్జెట్‌లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో అమెరికా తొలి స్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ డ్రాగన్ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6 శాతం వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం 9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జీడీపీలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్‌డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పింఛన్ల కోసం కోసం ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటోంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో 7వ స్థానంలో నిలిచింది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జీడీపీలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రి.డా, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పులపాలైంది. కెనడా, బ్రెజిల్ బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. ●

# యుద్ధ విరమణకు పాక్ ఆర్మీచీఫ్ మధ్యవర్తిత్వం

## ట్రంప్, ఇతర ఉన్నతాధికారులతో మునీర్ చర్చలు

## దౌత్యపరమైన పరిష్కారానికి యత్నాలు



**న్యూఢిల్లీ, మార్చి 24:** అమెరికా, ఇరాన్ మధ్య శాంతి నెలకొల్పేందుకు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్, అమెరికా మధ్య ఉన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ ప్రత్యేక వ్యాసం రాసింది. ఇటీవల ట్రంప్‌తో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ చర్చలు జరిపారని, అమెరికా ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌లో జరుగుతున్న దాడుల్ని నివారించే ఉద్దేశంతో అసిమ్ మునీర్ ఆ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ట్రంప్ సర్కారులోని ఉన్నతాధికారులు, ఇరాన్ ఉన్నతాధికారులతో మునీర్ చర్చలు నిర్వహించారని, శాంతి నెలకొల్పే ఉద్దేశంతో ఆ చర్చలు జరిగినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొన్నది. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజిష్కియాన్‌తో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇరాన్ సంక్షోభానికి దౌత్యపరమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు పాకిస్థాన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ కథనంలో వెల్లడించారు. పాకిస్థాన్‌తో పాటు టర్కీ, ఈజిప్ట్ కూడా దౌత్యపరమైన మార్గాన్ని అనుసరిస్తున్నాయని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. అమెరికా తరపున పశ్చిమాసియా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఆ చర్చల్లో పాల్గొన్నారు. టెహ్రాన్‌తో పాటు అమెరికా కీలక నేతల మధ్య పరోక్షంగా చర్చలు నిర్వహిస్తున్నట్లు, దీని కోసం పాకిస్థాన్ అధికారులు చర్యలు చేపడుతున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ వెల్లడించింది. ఈ చర్చల్లో విట్‌కాఫ్‌తో పాటు జారెడ్ కుష్నర్ కూడా పాల్గొన్నారు. మరో వైపు రెండు రోజుల నుంచి చర్చలు జరుగుతున్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తోసిపుచ్చిన విషయం తెలిసిందే. కానీ మిత్ర దేశాల నుంచి చర్చల సమాచారం అందుతున్నట్లు ఇరాన్ ఒప్పుకున్నది. తమతో సంప్రదింపులు జరుపుతున్న వారితో తమ విధానాన్ని వెల్లడిస్తున్నామని ఇరాన్ చెప్పింది. పాకిస్థాన్‌లో అమెరికా మిలిటరీ స్థావరాలు లేవని, దాని వల్లే ఇరాన్‌తో ఆ దేశం నేరుగా మధ్యవర్తిత్వ చర్చలు నిర్వహిస్తున్నదని కూడా మీడియా రిపోర్టులో వెల్లడించారు. అమెరికా దౌత్యవేత్తలు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ వారంలో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు పర్యటించే అవకాశాలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొన్నది. ఇరాన్ అధికారులతో ఇస్లామాబాద్‌లో చర్చలు జరిగే అవకాశం ఉందని ఆ రిపోర్టులో తెలిపారు. అయితే శ్వేతసౌధం మాత్రం ఆ వార్తలపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. చాలా సున్నితమైన దౌత్య చర్చలు జరిగే అవకాశం ఉందని, మీడియా ద్వారానే అమెరికా చర్చలు జరిపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. చర్చల గురించి అధికారిక ప్రకటన చేసే వరకు దేన్నీ విశ్వసించరాదు అని వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లివిట్ పేర్కొన్నారు.

## అద్భుత అమెరికన్ గాయకుడు రోనీబోమాన్ కన్నుమూత



**న్యూయార్కు, మార్చి 24:** దశాబ్దాల పాటు అద్భుతమైన గాత్రంతో, భావోద్వేగపూరితమైన పాటలతో అలరించిన ప్రముఖ అమెరికన్ గాయకుడు రోనీ బోమాన్ (64) తుదిశ్వాస విడిచారు. గత శనివారం మధ్యాహ్నం టెన్నెస్సీలోని ఆష్‌ల్యాండ్ సిటీ సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్ ప్రమాదానికి గురైంది. తీవ్ర గాయాలైన ఆయన్ను వెంటనే నాష్‌విల్లేలోని వాండర్‌బిల్ట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇంటర్నేషనల్ బ్లూగ్రాస్ మ్యూజిక్ అసోసియేషన్ నుంచి మూడుసార్లు మేల్ వోకలిస్ట్ ఆఫ్ ది ఇయర్ (1995, 1998, 1999) అవార్డులను అందుకుని తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1990 నుంచి 2001 వరకు ఈ ప్రముఖ బ్యాండ్‌లో వోకలిస్ట్, బేస్ ప్లేయర్‌గా ఉండి, 90వ దశకంలో బ్లూగ్రాస్ మ్యూజిక్ కొత్త పుంతలు తొక్కేలా చేశారు. కేవలం గాయకుడిగానే కాకుండా, అద్భుతమైన పాటల రచయితగా కూడా రోనీ రాణించారు. ఆయన రాసిన పాటలను హాలీవుడ్ అగ్రశ్రేణి కంట్రీ మ్యూజిక్ స్టార్లు క్రిస్ స్టేపుల్టన్, కెన్నీ చెస్నీ, జార్జ్ స్ట్రెయిట్ వంటి వారు ఆలపించడం విశేషం. ముఖ్యంగా కెన్నీ చెస్నీ పాడిన నెవర్ వాంటెడ్ నథింగ్ మోర్ వంటి చార్ట్‌బస్టర్ సాంగ్ వెనుక రోనీ కలం ఉంది. రోనీ మృతి వార్త తెలియగానే బిలీ స్ట్రింగ్స్, జాన్ కార్టర్ క్యాష్, డీర్క్స్ బెంట్లీ వంటి ప్రముఖ సంగీతకారులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. ఆయన గదిలోకి వస్తే వెలుగు నిండేది.. బ్లూగ్రాస్ లోకంలో ఒక గొప్ప శకం ముగిసిందంటూ అభిమానులు నివాళులర్పిస్తున్నారు.

## ప్రపంచ కాలుష్య దేశాల్లో పాక్ నం.1

### ఆరోస్థానంలో భారత్



**ఇస్లామాబాద్, మార్చి 24:** ప్రపంచంలోని అత్యంత కాలుష్య కారక దేశంగా 2025లో పాకిస్థాన్ నిలిచింది. వాయు నాణ్యతను పర్యవేక్షించే స్విట్జర్లాండ్ సంస్థ ఐక్యూఎయిర్ మంగళవారం ఈ మేరకు ప్రకటన చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన పరిమితి కంటే ప్రమాదకమైన పిఎం (పార్టిక్యులేట్ మ్యాటర్) 2.5 కణాల స్థాయిలు పాకిస్థాన్‌లో 13 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఆ దేశంలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండడం వల్ల.. అక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వెల్లడించింది. అత్యంత కలుషితమైన దేశాల జాబితాలో బంగ్లాదేశ్, మధ్య ఆసియా దేశమైన తజికిస్థాన్ వరుసగా రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో భారత్ ఆరో స్థానంలో ఉంది. మొత్తం 143 దేశాల్లో వాయు నాణ్యత పరీక్షలు నిర్వహించగా.. వాటిలో 130 దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన వాయు నాణ్యత ప్రమాణాల అమల్లో విఫలమయ్యాయి. మరోవైపు ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలవడే నగరాల జాబితా-2025లో ఢిల్లీ సమీపంలోని 'లోని' నగరం మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ సగటు పిఎం 2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 112.5 మైక్రోగ్రాములుగా ఉంది. దీని తర్వాతి స్థానంలో చైనాలోని హోటాన్ (109.6 మైక్రోగ్రాములు) ఉంది. ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 25 నగరాల్లో అన్నీ భారత్, పాకిస్థాన్, చైనాలోనే ఉండడం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా కేవలం 14 శాతం నగరాలు మాత్రమే డబ్ల్యుహెచ్ఓ ప్రమాణాలను అందుకున్నాయి. వాటిలో ఆస్ట్రేలియా, ఐస్‌లాండ్, ఎస్టోనియా, పనామాలోని నగరాలు ఉన్నాయి.

## ఎయిర్ కెనడా ప్రమాదంలో 100 మీటర్లు ఎగిరిపడిన ఫ్లైట్ అటెండెంట్!




**న్యూయార్క్, మార్చి 24:** న్యూయార్క్‌లోని లాగ్వార్డియా విమానాశ్రయంలో ఎయిర్ కెనడా ఎక్స్‌ప్రెస్ విమానం రన్‌వేపై ఫైర్ ట్రక్కును ఢీకొన్న సమయంలో ఒక విమాన సిబ్బంది సీటుతో సహా విమానం నుంచి ఏకంగా 330 అడుగుల దూరం ఎగిరి పడ్డారు. అంత ఎత్తు నుంచి, అత్యంత వేగంతో పడిపోయినప్పటికీ సిబ్బంది ప్రాణాలతో బయటపడటం విశేషం. ఎయిర్ కెనడాలో లీడ్ ఫ్లైట్ అటెండెంట్‌గా పని చేస్తున్న సోలెంజ్ ట్రెంబ్లే ఈ ప్రమాదంలో మృత్యుంజయురాలిగా నిలిచారు. విమానం ఫైర్ ఇంజిన్‌ను ఢీకొన్న తీవ్రతకు విమానం వెనుక భాగం దెబ్బతిని ఆమె కూర్చున్న జంప్ సీటు ఊడి బయటకు పడింది. రన్‌వేపై సుమారు 100 మీటర్ల దూరంలో ఆమె ఎగిరి పడ్డారు. అయితే రెస్క్యూ టీమ్ అక్కడికి చేరుకునే సమయానికి ఆమె ఇంకా తన సీటుకే అంటుకుని ఉండటం చూసి అధికారులు విస్మయానికి గురయ్యారు. ఈ ఘటనలో ఆమె కాలు విరిగినప్పటికీ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం నిజమైన అద్భుతం అని ఆమె కుమార్తె సారా లెపైన్ వెల్లడించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోలెంజ్ ట్రెంబ్లేకు శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో జరిగిన పొరపాటే కారణమని ప్రాథమికంగా తేలింది. రన్‌వేపై వేరొక విమానంలో వింత వాసన వస్తోందన్న ఫిర్యాదుతో ఫైర్ ట్రక్కుకు అనుమతి ఇచ్చిన కంట్రోలర్ అదే సమయంలో ల్యాండ్ అవుతున్న ఎయిర్ కెనడా విమానాన్ని గమనించలేక పోయారు. ఈ ఘోర ప్రమాదంలో విమానాన్ని నడుపుతున్న పైలట్లు ఇద్దరూ ప్రాణాలు కోల్పోగా మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతులు ఇద్దరూ ఆంటోయిన్ ఫారెస్ట్, మాకెంజీ గుంతర్‌లుగా అధికారులు గుర్తించారు. కెనడాకు చెందిన వీరిద్దరూ తమ కెరీర్‌ను ఇప్పుడిప్పుడే ప్రారంభించగా తొలి నాళ్లలోనే ప్రాణాలు కోల్పోవడాన్ని వారి కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ల కొరత. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఏర్పడిన సిబ్బంది కొరత కూడా ఈ ప్రమాదానికి పరోక్ష కారణాలని నిపుణులు భావిస్తున్నారు.

## పర్షియన్ గల్ఫ్‌లో సిద్ధంగా ఎల్పీజి ట్యాంకర్లు - ఇరాన్‌తో కేంద్రం చర్చలు!



**న్యూఢిల్లీ, మార్చి 24:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉండటంతో ఎల్పీజి కొరత రాకుండా చూసుకునేందుకు భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పర్షియన్ గల్ఫ్‌లో నిలిచిన మరికొన్ని ట్యాంకర్లను హార్మూజ్ జలసంధి దాటించేందుకు ఇరాన్ అధికారులతో కేంద్రం చర్చలు జరుపుతోంది. అవి ఒకే అయితే ఆరు ట్యాంకర్లు భారత్‌కు చేరుకుంటాయి. 3,00,000 టన్నుల ఎల్పీజి అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్ నౌకలకు దీర్ఘకాలిక గ్యారెంటీ లేకపోవడంతో ఎప్పటికప్పుడు ఇరాన్‌తో చర్చలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అంతర్గత పరిస్థితుల దృష్ట్యా నౌకల అనుమతుల విషయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతోంది. ఇదిలా ఉంటే ఎల్పీజిని మోసుకొస్తోన్న జగ్ వాసంత్, పైన్ గ్యాస్ ట్యాంకర్లు హార్మూజ్‌ను దాటి, ఇప్పటికే అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అవి కొన్ని రోజుల్లో భారత్‌కు చేరుకోనున్నాయి. కాగా తమ అధికారులతో సమన్వయం చేసుకొంటూ తటస్థ దేశాల నౌకలు హార్మూజ్ మీదుగా వెళ్లవచ్చని ఇరానియన్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్ అధికారులు సహకార వైఖరిని అవలంబిస్తున్నారని భారత ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వ్యాఖ్యల నేపథ్యంలో హార్మూజ్ నుంచి నౌకల రాకపోకల విషయంలో కాస్త సానుకూలత కనిపిస్తోంది.

## పెర్మనెంట్ కమిషన్‌కు మహిళా మిలిటరీ ఆఫీసర్లు అర్హులే: సుప్రీం తీర్పు




**న్యూఢిల్లీ, మార్చి 24:** సైనిక దళాల్లోని పర్మనెంట్ కమిషన్ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. మహిళా మిలిటరీ ఆఫీసర్లు పర్మనెంట్ కమిషన్‌కు అర్హులు అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ కేసు విషయంలో సుప్రీం కోర్టు అసాధారణ అధికారులను వినియోగించుకున్నది. షార్ట్ సర్వీస్ కమీషన్(ఎస్ఎస్సీ) కింద రిక్రూట్ అయిన మహిళా ఆఫీసర్లు పర్మనెంట్ కమిషన్ పొందేందుకు అర్హులని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. మిలిటరీ ప్రమోషన్ల విధానంలో ఉన్న వ్యవస్థీకృత లోపాలను కోర్టు ఎత్తి చూపింది. మహిళా ఎస్ఎస్సీ ఆఫీసర్లకు పర్మనెంట్ కమిషన్‌ను ఇవ్వకపోవడం విధాన నిర్ణయం లోపమని కోర్టు చెప్పింది. ప్రతి ఏడాదికి కేవలం 250 మంది మహిళా ఆఫీసర్లకు పర్మనెంట్ కమిషన్ ఇవ్వాలన్న నిబంధనను కూడా కోర్టు కొట్టిపారేసింది. ఆ నిర్ణయం ఏకపక్షంగా ఉందని, దాంట్లో పవిత్రత లేదని కోర్టు పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు మిలిటరీలో లింగ సమానత్వాన్ని సూచిస్తున్నది. పర్మనెంట్ కమిషన్ పొందినవారు రిటైర్మెంట్ వయసు వరకు విధులు నిర్వర్తించవచ్చు. సైన్యంలో ఉన్నత పదవులను గతంలో కేవలం పురుషులకు మాత్రమే ఇచ్చేవారు.

అయితే తాజా తీర్పుతో మహిళలకు కూడా అత్యున్నత హోదా దక్కే అవకాశాలు ఉన్నాయి. పర్మనెంట్ కమిషన్ అనేది తమకే ఉంటుందన్న భావనలో మేల్ షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్లు ఉండరాదు అని కోర్టు చెప్పింది. మహిళా ఆఫీసర్ల పట్ల ఉన్న వివక్ష.. అది విధాన రూపకల్పన లోపమని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మహిళా ఆఫీసర్లకు చెందిన వార్షిక విశ్వసనీయ నివేదిక(ఏసీఆర్)లను మిలిటరీ ఆఫీసర్లు చాలా తేలికగా తీసుకుంటున్నట్లు కోర్టు చెప్పింది.

## 53 లక్షల మెట్రిక్‌టన్నుల రిజర్వు ఇంధనం సిద్ధం

### రాజ్యసభలో ప్రధాని మోడీ.. నేడు అఖిలపక్షం భేటీ



**న్యూఢిల్లీ, మార్చి 24:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమ మంగళవారాల్లో లోక్‌సభ,రాజ్యసభల్లో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు మోడీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు సిద్ధం అయి ఉండాలన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించి నట్లు చెప్పారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోడీతెలిపారు. పశ్చిమా సియాలో యు ద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్మూజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు.


## అమెరికా నిలిపివేసినా మేం దాడులు ఆపం!

### ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

**జెరూసలెం, మార్చి 24:** ఇరాన్ పై దాడులు ఆపేదిలేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తేల్చిచెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సుదీర్ఘ ఫోన్ కాల్ సంభాషణ తర్వాత నెతన్యాహు ఈ పకటన చేశారు. ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నామని, హిజ్బుల్లాపై బలమైన దాడులు కొనసాగిస్తున్నామని వివరించారు. ఇరాన్ తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్న క్రమంలో ఆ దేశంపై 5 రోజుల పాటు దాడులు జరపబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికా దాడులు ఆపినప్పటికీ తాము మాత్రం ఆపబోమని నెతన్యాహు స్పష్టం చేశారు. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి దాడులను ఎదుర్కోవడం, లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల వ్యూహంపై ట్రంప్, నెతన్యాహు ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో, శాంతి ఒప్పందం దిశగా కూడా ఇరువురు నేతలు చర్చలు జరిపినట్లు సమాచారం. లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించి, బందీల విడుదలకు మార్గం సుగమం చేసే ప్రణాళికపై దృష్టి సారించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ భద్రతకు అమెరికా పూర్తి మద్దతు కొనసాగుతుందని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఈ చర్చల్లో కేవలం సైనిక, దౌత్యపరమైన అంశాలే కాకుండా ఇరాన్ సాగిస్తున్న సమాచార యుద్ధం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

అమెరికా, ఇజ్రాయెల్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ విడుదల చేస్తున్న ఏఐ వీడియోలు, మీమ్స్‌పై కఠినంగా వ్యవహరించాలని అమెరికా నిర్ణయించినట్లు సమాచారం.

కాగా, ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, మరోవైపు ఇరాన్ తన వైఖరి మార్చుకోకపోవడం, ఇజ్రాయెల్ సైనిక చర్యలు కొనసాగించడం వంటి పరిణామాలతో పశ్చిమాసియాలో ఉత్కంఠ కొనసాగుతోంది.



## 297 హామీలతో అన్నాడిఎంకె మేనిఫెస్టో

### - అమ్మస్కూటీకి రూ.25వేలు సబ్సిడీ - ప్రతి ఇంటికి ఉచిత రిఫ్రిజిరేటర్ - రేషన్‌కార్డు ఉన్న కుటుంబానికి ప్రతినెల రూ.2వేలు బదలీ

**చెన్నై, మార్చి 24:** తమిళనాడులో ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఉచిత పథకాల వేలం షురూచేసాయి. ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే తన ఎన్నికల మేనిఫెస్టోను మంగళవారం ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ఉచితంగా రిఫ్రిజిరేటర్, మహిళలకు అమ్మ టూవీలర్ పథకం కింద స్కూటీ కోసం రూ.25 వేలు సబ్సిడీ అందజేస్తామని హామీ ఇచ్చింది. అన్నాడిఎంకె మేనిఫెస్టోలో మొత్తం 297 హామీలు కుమ్మరించింది. అమ్మ స్కూటీతో ఏటా 5 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు రూ.2,000 నేరుగా ఖతాలకు బదిలీ చేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి తెలిపారు. పేదలకు అమ్మ ఇల్లును నిర్మించనున్నట్టు తెలిపారు. రేషన్‌తో పాటు కిలో కంది పప్పు, లీటర్ వంట నూనె కూడా ఇస్తామని తెలిపింది. మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్టు అన్నాడీఎంకే పేర్కొంది. తొలిసారి ఎన్నికల్లో పోటీచేస్తున్న నటుడు విజయ్ పార్టీ ఉచిత హామీల్లో పోటీ పడుతున్న సంగతి తెలిసిందే.

## మంటల్లో పశ్చిమాసియా

## ఉద్దేశపూర్వకంగానే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు!




**టెహ్రాన్, మార్చి 24:** అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారం గా.. హార్మూజ్ జల సంధి, దాని పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే నౌకలే లక్ష్యంగా ఇరాన్ ఇటీవల భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ దళాలు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడులు చేశాయని తాజాగా హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. ఇది యుద్ధ చట్టాలను ఉల్లంఘించడమేనని అభిప్రాయపడింది. ఈ నెల 11న అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, థాయ్‌లాండ్‌లోని షిప్పింగ్ కంపెనీకి చెందిన మయూరీ నారీ అనే రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ దళాలు చేసిన దాడుల గురించి ప్రస్తావించింది. ఇది తమ పనేనని ఆ దేశ అధికారులు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసింది. దాడికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు కూడా పోస్టు చేసినట్లు తెలిపింది. ఈ నెల 1 నుంచి 17 మధ్య హార్మూజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలో మొత్తం 16 సార్లు దాడులు జరిగినట్లు తెలిపింది. దీంతో మొత్తం 17 వాణిజ్య నౌకలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. ఈ ఘటనల్లో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 10 మంది గాయపడ్డారని తెలిపింది. నలుగురు గల్లంతైనట్లు పేర్కొంది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్న ఈ నౌకలు పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు తెలిపింది. యుద్ధంలో పౌరులు, వారి మౌలిక సదుపాయాలపై ప్రత్యక్ష దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. నిర్లక్ష్యంగా ఇలా యుద్ధ చట్టాలను ఉల్లంఘించిన వారు విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

## 'ఇరాన్‌పై దాడి చేయమని చెప్పింది నువ్వేగా'.. పీట్ హెగ్సెత్‌పై నెట్టేసిన ట్రంప్!



**వాషింగ్టన్, మార్చి 24:** ఇరాన్‌పై యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న విభిన్న ప్రకటనలు గందరగోళానికి దారితీస్తున్నాయి. యుద్ధం నేపథ్యంలో తనపై వస్తున్న విమర్శల నుంచి తప్పించుకునేందుకు.. పక్కవారిపై నిందలు మోపేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా కన్పిస్తోంది. తాజాగా ఇరాన్‌పై దాడి చేయమని తొలుత యుద్ధ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నట్లు ట్రంప్ తెలిపారు. టెన్నెసీలో జరిగిన ఓ రౌండ్‌టేబుల్ సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టేముందు కొందరు అధికారులతో తాను జరిపిన చర్చల గురించి వివరించారు. 'నేను పీట్‌తో సహా అనేకమంది యుఎస్ అధికారులకు ఫోన్ చేశాను. పశ్చిమాసియాలో నెలకొన్న సమస్య గురించి వివరించా. కొన్ని రోజులపాటు సైన్యంతో అక్కడ పోరాడి.. ఆ సమస్యను పరిష్కరించే విషయాన్ని ప్రస్తావించా' అని ట్రంప్ వెల్లడించారు. టెహ్రాన్‌పై దాడికి తొలుత పీట్ హెగ్సెతే మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. తన పక్కన కూర్చున్న హెగ్సెత్‌ను ప్రస్తావిస్తూ.. 'పీట్.. ఈ విషయంపై మొదటగా మాట్లాడింది మీరే అను కుంటున్నా. 'ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు. కాబట్టి.. మనం దాడి చేద్దాం' అని మీరే అన్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన వ్యా ఖ్యలు ప్రస్తుతం నెట్టింట తీవ్ర చర్చకు దారితీశాయి. కాగా.. దీనిపై హెగ్సెత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధంపై ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అంత ఆసక్తిగా లేరని స్పష్టం చేశారు. ఇరాన్‌పై తమ దాడులకు ప్రతీకారంగా.. గల్ఫ్ దేశాలన్నింటినీ ఆ దేశం లక్ష్యంగా చేసుకోవడం తమను ఆశ్చర్యపరిచిందన్నారు. దీని గురించి తాము ఆలోచించలేదన్నారు.

## అమెరికాతో చర్చలకు ఇరాన్ సుముఖమే!

### ఇరాన్ సుప్రీం కమాండర్‌స్థాయిలోనే నిర్ణయం



**టెహ్రాన్,మార్చి 24:** అమెరికా, ఇజ్రాయెల్‌లతో శత్రుత్వం కొనసాగిస్తున్న ఇరాన్ వైఖరిలో అనూహ్య మార్పు చోటుచేసుకున్నట్టు కనిపిస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఇజ్రాయెల్, అరబ్ నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ పరిణామం ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్వయంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ, సైనిక శక్తి తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భారీ వినాశనం నుంచి దేశాన్ని కాపాడటంతో పాటు, తన అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు మొజ్తబా ఈ శాంతియుత మార్గాన్ని ఎంచుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఆంక్షలు, ఇజ్రాయెల్ దాడుల నుంచి బయటపడాలంటే చర్చలే సరైన మార్గమని ఆయన నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ నిర్ణయానికి ఇరాన్‌లోని సంప్రదాయవాద శక్తులు, ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చర్చలు సఫలమైతే, పశ్చిమాసియాలో నెలలుగా సాగుతున్న రక్తపాతం ఆగిపోతుంది. లెబనాన్, గాజా, యెమెన్‌లలోని ఘర్షణలు కూడా సద్దుమణిగే వీలుంది. ఈ పరిణామం ప్రపంచ ఇంధన మార్కెట్లపై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## యుద్ధచట్టాలను ఉల్లంఘించిన ఇరాన్! హ్యూమన్‌రైట్స్ వాచ్ వెల్లడి

**న్యూయార్క్, మార్చి 24:** హర్మూజ్ జలసంధి, దాని పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే నౌకలపై ఇరాన్ ఉద్దేశపూర్వకంగా దాడులు చేసి యుద్ధ చట్టాలను ఉల్లంఘించిందని హ్యూమన్‌రైట్స్ వాచ్ తెలిపింది. గత నెల 28న ఇరాన్, ఇజ్రాయెల్ అమెరికా యుద్ధం ప్రారంభమైంది. ఆ తర్వాత హార్మూజ్ జలసంధి, సమీపంలోని నౌకలు లక్ష్యంగా ఇరాన్ దళాలు దాడులు చేశాయి. ఈ దాడులు చేసింది తామేనని ఇరాన్ అధికారులు కూడా ప్రకటించిన విషయాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్ గుర్తు చేసింది. వీటిని పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు వెల్లడించింది. యుద్ధంలో పౌరులు, వారి మౌలిక సదుపాయాలపై ప్రత్యక్ష దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉల్లంఘనలకు పాల్పడిన వారు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, థాయ్‌లాండ్‌లోని షిప్పింగ్ కంపెనీకి చెందిన మయూరి నారీ అనే రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ దళాలు మార్చి 11వ తేదీన దాడి చేసిన విషయం తెలిసిందే. దాడులకు పాల్పడింది తామేనని ఇరాన్ అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించి వీడియోలు, ఫొటోలను కూడా పోస్టు చేశారు. ఈ విషయాలను గుర్తు చేసిన హ్యూమన్ రైట్స్ వాచ్, ఇరాన్ యుద్ధ చట్టాలను ఉల్లంఘించిందని ఆరోపించింది. ఈ నెల 1 నుంచి 17వ తేదీ మధ్య కాలంలో హర్మూజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలో మొత్తం 16సార్లు దాడులు జరిగినట్లు తెలిపింది. దీనితో మొత్తం 17 వాణిజ్య నౌకలకు నష్టం వాటిల్లినట్లు తెలిపింది. ఈ ఘటనల్లో మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, పదిమంది గాయపడ్డారని, నలుగురు గల్లంతయ్యారని తెలిపింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా ఈ దాడులు చేసిందని, కానీ ఇవి పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు తెలిపింది.

# సాదాబైనామా సమస్య త్వరలోనే పరిష్కారం

### కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది

### దరఖాస్తుదారుల మేలు కోసమే జిఒ 76 తెచ్చాం

### శాసన మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వం లోనే సాదాబైనామా సమస్యలను పరిష్కారం చేయనున్నట్లు రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుందని మంత్రి తెలిపారు. శాసన మండలిలో మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి చైర్మన్ ప్రకటించారు. సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సాదాబైనామాలపై ప్రశ్నించారు. ఆయనతోపాటు పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరిత గతిన పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని అయితే కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందు పరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వాటన్నింటికీ పరిష్కారం లభించబోతుందన్నారు. నక్షా లేని 413 గ్రామాలకుగాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్‌కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లాలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్‌ను ఇస్తామని, రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ధరణి పోర్టల్‌లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీసేవ నిర్వాహకులతో కలిసి రూ. 3.99 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని మంత్రి సభకు తెలిపారు. తప్పుచేసిన వారి నుంచే ఆ సొమ్మును రికవరీ చేస్తామని, రైతుల నుంచి కాదని మంత్రి స్పష్టం చేశారు. అవినీతిలో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షి ంచబోమని శాసన మండలిలో సభ్యులు తాతా మధు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గతంలో ధరణి పోర్టల్‌ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయన్నారు. ధరణి పోర్టల్‌లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్‌లో 6కు కుదించామని, ధరణి పోర్టల్‌ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఏప్రిల్ చివరినాటికి పూర్తి స్థాయిలో భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభలో చెప్పారు.

## ఒబిసి రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టండి : మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** దేశంలోని ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం జరిగేలా పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టాలని మాజీ ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాహుల్ గాంధీకి ఒక లేఖ రాశారు. జిత్నే ఆబాదీ ఉత్నే హక్ (ఎవరి జనాభా ఎంత ఉంటే.. వారికి అంత వాటా) అనే నినాదంతో ఓబీసీల్లో రాహుల్ గాంధీ కొత్త ఆశలు చిగురింప జేశారని పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు వెచ్చించిందని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపినా, అది ఇంకా పెండింగ్‌లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న నిబంధనతో హైకోర్టు కూడా దీనిని తిరస్క రించిందని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ధర్నా కూడా చేశారని వివరించారు. గతంలో సోనియాగాంధీ సహకారంతో ఐఐటీ, ఐఐఎంలలో రిజర్వేషన్లు సాధించుకున్నామని వీహెచ్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఓబీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు పెడితే, ఏయే పార్టీలు వెనుకబడినవర్గాలకు మద్దతుగా ఉన్నాయో స్పష్టమవుతుందని రాహుల్‌గాంధీని కోరారు.

## పెండింగ్ బకాయిలు రూ. 24.9వేల కోట్లు విడుదల చేయండి: ఎంపి చామల

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** పశుసంవర్ధక శాఖ రూ. 24,850.33 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని లోక్‌సభలో ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు, విడుదల చేయకపోవడంతో రాష్ట్రాలలో కీలకమైన పథకాల అమలు ప్రభావితమవు తోందని తెలిపారు. వెంటనే జోక్యం చేసుకుని ఈ నిధులను విడుదల చేయాలని ఆయన కోరారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం రూ. 3,880.40 కోట్లు, పశు వ్యాధుల నియంత్రణకు రాష్ట్రాలకు సహాయం రూ. 7,421.23 కోట్లు ,జాతీయ పశుసంవర్ధక మిషన్ రూ12,304.59 కోట్లు,పశుసంఖ్యా గణన రూ. 1,151.61 కోట్లు, ఇంటిగ్రేటెడ్ సాంపిల్ సర్వే పథకం కింద రూ.92.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని సూచించారు. ఈ పథకాలు రైతులకు మద్దతు ఇవ్వడంలో, పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడంలో, పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, ఈ నిధులను తక్షణమే విడుదల చేసి పథకాల అమలును వేగవంతం చేయాలని సభాధ్యక్షుల ద్వారా మంత్రిత్వ శాఖను ఆయన విజ్ఞప్తి చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 399

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 24, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 210వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 399దరఖాస్తులు అందాయి.పంచాయితీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 138దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 56 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 122దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖ లకు సంబంధించి 83 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్ ,ఏసీపీ ఉమేందర్,ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,ప్రవాసీ ప్రజావాణీ సమన్వయకర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బ్యాంకు అకౌంట్లను రెన్యువల్ చేసుకోండి

### బ్లాకైన ఖాతాల సమాచార బాధ్యత బ్యాంకులదే

### రైతు భరోసా సాయంపై మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడని అన్నదాతలు తమ బ్యాంక్ అకౌంట్లను రెన్యూవల్ చేసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కొంతమంది రైతులు తమ అకౌంట్లను రెన్యూవల్ చేసుకోలేదని, వీరికి నిధులను అధికారులు నిలిపివేసినట్లు తెలిపారు. బ్లాక్ అయిన అకౌంట్లను రైతులు వెంటనే రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. ఈ విషయంలో బ్యాంకులు ముందుగానే రైతులకు సమాచారం అందించాల్సి ఉన్నా అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ అయిన రైతుల ఖాతాలను వెంటనే పునరుద్ధరించి పెట్టుబడి సాయం జమ చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. రైతులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిధులు ఆపేయడం సరికాదని మండిపడ్డారు. కాగా అకౌంట్ బ్లాక్ అవడం మూలంగా రాష్ట్రంలో దాదాపు 4,405 మంది రైతులకు అందాల్సిన రూ.2,18,96,556 సాయానికి బ్రేక్ పడింది. రైతు భరోసా అందకపోవడంతో రైతులు వెళ్లి వ్యవసాయ అధికారులను సంప్రదించారు. దీంతో బ్యాంక్ అకౌంట్లు రెన్యూవల్ చేసుకోకపోవడం వల్లనే నిధులు జమ కాలేదని చెప్పారు. దీంతో తుమ్మల స్పందించి.. ఈ రైతులకు వెంటనే సాయం జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## కూరగాయల హబ్‌గా తెలంగాణ

### స్వయంసమృద్ధి సాధనకు ఎన్నో అవకాశాలు

### అటారీ డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** దేశానికే కూరగాయల హబ్‌గా ఎదిగేందుకు తెలంగాణకు బోలెడు అవకాశాలు ఉన్నాయని, అనువైన వాతావరణం తెలంగాణ రాష్ట్రంలో ఉందని పదవ అటారీ డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా అన్నారు. ఇందుకు రైతులే స్వచ్ఛందంగా కూరగాయల సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాలన్నారు. ప్రతి రైతు మరో ఐదుగురు రైతులను కూర కూరగాయల సాగు వైపు మళ్లించేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుండి ఎంపిక చేసిన వెజిటబుల్ వలంటీర్లకు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కూరగాయల సాగుపై మంగళవారం శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ... దేశంలో ఇప్పటికే ఆహార భద్రత సాధ్యమైందని, పోషక భద్రత కేవలం కూరగాయల అందుబాటు పెరగడంతో మాత్రమే సాధ్యమని తెలిపారు. ఆఫ్ సీజన్ కూరగాయల సాగు, ఎగ్జిటిక్ కూరగాయల సాగు, రసాయనాలు, పురుగుమందుల అవశేషాలు లేని కూరగాయలకు మార్కెట్లో ప్రీమియం ధర లభిస్తుందని చెప్పారు. మిరప నుంచి ఒలియో రసిన్ సేకరించేందుకు ప్రత్యేకమైన పరిశ్రమలు రావడం, టమాటా ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో కూరగాయల సాగుకు భవిష్యత్తులో మరింత మద్దతు ఉంటుందని ఆయన గుర్తు చేశారు. అంటూ కూరగాయ మొక్కలతో చీడపీడల సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. చిన్న చిన్న మెలకువలతో తక్కువ పెట్టుబడితో దాదాపు 30శాతం మేర అధికంగా కూరగాయల దిగుబడి సాధించొచ్చని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వేదికగా కూరగాయల సాగు మహోద్యమంగా సాగాలని విసి దండ రాజిరెడ్డి కోరారు. లో కాస్ట్ పెండల్స్, అవకాశం ఉంటే సేంద్రియ, ప్రకృతి పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలని రైతులను కోరారు. శిక్షణకు హాజరైన ఏడు జిల్లాల రైతులకు క్షేత్ర పర్యటన నిర్వహించి, సాంకేతికతలను ప్రత్యక్షంగా చూపించారు. రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు నేరుగా సమాధానాలు ఇచ్చారు. సర్టిఫికెట్ల అందించారు. కార్యక్రమంలో, యూనివర్సిటీ అధికారులు డాక్టర్ ఛీనా, లక్ష్మీ మ్నారాయణ, సురేష్ కుమార్, ప్రశాంత్, కూరగాయల పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ అనిత కుమారి, ఉద్యానశాఖ రిదీతి పద్మనాభ, శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ డెంటిస్టు అరెస్ట్

### 20 యేళ్లుగా క్లినిక్ నిర్వహణ.. సోదాల్లో బయటపడిన నిజాలు

**నేరెడ్‌మెట్, హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త :** అర్హతలు లేకుండా డెంటిస్టుగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుడిని నేరేడ్‌మెట్ పోలీసులు, రాచకొండ ఎస్ఓటీ, మల్కాజిగిరి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుప్తా రమేష్‌కుమార్ బీడీఎస్ అర్హత లేకపోయినా రెండు దశాబ్దాలుగా డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 24న మధ్యాహ్నం ఓల్డ్ నేరేడ్మెట్‌లో త్రీటెంపుల్ సమీపంలోని పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కింది షెటర్‌లో అంజాలిక డెంటల్ క్లినిక్ అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు సత్య ఆదిత్య టవర్స్‌లో ఉన్న క్లినిక్‌పై ఆకస్మిక తనిఖీ నిర్వహించి గుప్తా రమేష్ కుమార్, తండ్రి కిషన్‌లాల్ గుప్తా బీడీఎస్ అర్హతలు లేకుండా ఆధునిక వైద్యాన్ని ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించారు. బీడీఎస్ డాక్టర్‌గా ప్రచారం చేసుకుంటూ అమాయక రోగులను మోసం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. రమేష్ కనీసం పదో తరగతి కూడా పూర్తి చేయలేదని, అయినప్పటికీ 20 యేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తూ అనుమానాలు రాకుండా రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు మాత్రమే క్లినిక్ నడిపేవాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అర్హతలు లేకుండా వైద్యం చేయడం తీవ్రమైన నేరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. అనుమానాస్పదంగా నడుస్తున్న క్లినిక్‌లపై సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నకిలీ డెంటల్ డాక్టర్ గుప్తా రమేష్‌కుమార్

## శ్రీధరన్న నామీద పగబట్టకే! మాజీమంత్రి మల్లారెడ్డి ఆవేదన

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** శ్రీధరన్న షురూలో మంచిగుండేటోడు నా కాలేజీకి వచ్చిండు హాపీగా ఉండేది ఇప్పుడు మాత్రం భరించలేని బాధపడుతున్నా జవహర్‌నగర్ నాకు గుండెకాయ లాంటింది అక్కడ రెండున్నర లక్షల మంది రోగాల బారిన పడుతోండ్రు ఒక్కసారి ఇంచార్జీ మంత్రిగా నా నియోజకవర్గంకు రండి అంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. పేదలు ఉండే జవహర్‌నగర్‌లో రోడ్లు, మురికి కాలువలు,లైట్లు లేవు సచ్చి పోతుండ్రు సార్ అక్కడ నామీద కుట్రలు చేస్తుండ్రు అక్కడ డంప్‌యార్డు వాసన భరించలేక పోతుండ్రు అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు, ప్రజల బాధలుచూసి నేను ఎందుకు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్నానా అని బాధపడుతున్నాను ఇప్పటికైనా స్పెషల్‌కేటగిరి కింద అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోనే నెంబర్ వన్ నియోజకవర్గం మేడ్చల్‌ను తుకుడా తుకుడా చేశారని అన్నారు. గతంలో 61 గ్రామాలు మూడు కార్పొరేషన్‌లు ఏడు మున్సిపాలిటిలో ఉండేవని వాటిని జిహెచ్‌ఎంసి లో కలిపిసి కేవలం 16వార్డులుగా మార్చారని తెలిపారు. దీనివల్ల నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాలు కరువైనాయనీ కొన్నిగ్రామాలలో ఇంకా ఇప్పటికి పెంకుటిళ్లలు ఉన్నాయని ఆయన వివరించారు. శ్రీధరన్న నన్ను పగబట్టకే మా జిల్లా ఇంచార్జీ మంత్రివే మున్సిపల్ శాఖ చూసే ముఖ్యమంత్రి అయినా నువ్వు అన్నా డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించవే ప్రత్యేకంగా నిధులు కేటాయించవే అంటూ వేడుకొన్నారు. శ్రీధర్‌బాబు సమాధానం ఇస్తూ కొత్తగా ఇటీవలే మళ్లీ పెళ్లిచేసుకొన్న మల్లన్న కొంచం మారుతడనుకున్నా అనడంతో నీదండమే అంటూ మల్లరెడ్డి స్పందించడంతో సభలో సభ్యులు నవ్వుకొన్నారు.

## స్క్రాపింగ్‌పై ప్రోత్సాహానికి లయబిలిటీ మాఫీ, పన్ను రాయితీలు

### ఎప్పటికప్పుడు ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు

### మండలిలో రవాణా శాఖ మంత్రి పొన్నం



**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** పాత వాహనాల స్క్రాపింగ్‌ను ప్రోత్సహించడానికి లయబిలిటీ మాఫీ చేయడంతోపాటు పన్ను రాయితీలు కల్పిస్తున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ పాలసీ ద్వారా స్క్రాపేజీని ప్రోత్సహించడానికి పాత వాహనం పైన ఉన్న టాక్స్ బకాయిలు రద్దు చేయనున్నట్టు తెలిపారు. మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో స్క్రాపేజీ పాలసీపై సభ్యులు నవీన్ కుమార్ కుర్మయ్యగారి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, సుంకరి రాజు(శంభీపూర్ రాజు) అడిగిన ప్రశ్నలకు సమాధానంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబరు నుండి స్క్రాపేజీ పాలసీ విజయవంతంగా అమలు చేస్తుందని, రాష్ట్రంలో 3 వెహికిల్ స్క్రాపింగ్ సౌకర్యాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వాటిల్లో రంగారెడ్డి జిల్లా కొత్తూరులో ఒకటి సిద్దిపేట జిల్లా వర్గల్‌లో, సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో ఉన్నాయన్నారు. పాత వాహనాల స్క్రాపింగ్‌ను ప్రోత్సహించడానికి లయబిలిటీ మాఫీ చేయడంతోపాటు పన్ను రాయితీలు కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పాలసీ ద్వారా స్క్రాపేజీ ప్రోత్సహించడానికి పాత వాహనం పైన ఉన్న టాక్స్ బకాయిలు రద్దు చేసి, వాహనం కొన్నప్పుడు టాక్స్ కన్షేషన్ ఇవ్వబడుతుందన్నారు. ఆర్ టీసీలో 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీకి పంపిస్తున్నామని, వాటి స్థానంలో ఎప్పటికప్పుడు కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. స్క్రాప్‌లపై ఎప్పటికప్పుడు ప్రత్యేక డ్రైవ్ చేయబడుతున్నాయన్నారు.

15 సంవత్సరాలు దాటిన స్కూల్ బస్సులకు అనుమతి లేదని, కొత్త వాహనాలు కొన్నప్పుడు టాక్స్ కన్సేషన్ మోటార్ సైకిల్‌కి రూ5 వేలు వరకు, కార్లకు రూ.50 వేల వరకు, ట్రాన్స్పోర్ట్ వాహనాలకు 19 శాతం టాక్స్ మినహాయింపు ఉంటుందన్నారు. స్క్రాప్ పాలసీ వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 6278 వాహనాలు స్క్రాప్ చేయబడ్డాయని మంత్రి తెలిపారు. గ్రీన్ టాక్స్ 2006లో అమలులోకి వచ్చిందని 2022లో పెంచడం జరిగిందని, 202526లో గ్రీన్ టాక్స్ రూ.71.14 కోట్లు దాదాపు 2 లక్షల వాహనాలకు జరిగిందన్నారు.

2024-25లో గ్రీన్ టాక్స్ రూ.68.11 కోట్లు వసూలు చేయడం జరిగిందని, ఆర్‌విఎస్‌ఎఫ్‌లు 2025 నుండి పని చేస్తున్నా యని, ఇప్పటి వరకు 6278 వాహనాలు స్క్రాప్ చేయబడ్డాయన్నారు. 15 సంవత్సరాలు దాటిన ప్రభుత్వ వాహనాలు స్క్రాప్ తప్పనిసరి చేసిందని మంత్రి పొన్నం తెలిపారు. గత ఏడాది 4285 వాహనాలు స్క్రాప్ చేయబడ్డాయని, ప్రైవేట్ వాహనాలు దాదాపు 2 వేల వాహనాలు స్క్రాప్ చేయబడ్డాయన్నారు. 15 సంవత్సరాలు దాటిన ప్రైవేట్ వాహనాలకు స్క్రాప్ తప్పనిసరి కాదని కండిషన్‌లో ఉన్నంత వరకు వెహికిల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో 15 సంవత్సరాలు దాటిన పాత వాహనాలు 48.98 లక్షల వాహనాలు ఉన్నాయన్నారు. వాటిలో హైదరాబాద్‌లోనే 16 లక్షలు ఉన్నాయ న్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా స్క్రాపేజీ పాలసీ ఎందుకు తీసుకురాలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ బిఆర్‌ఎస్ సభ్యులను ప్రశ్నించారు.

ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఈవి వాహనాలు కొనడానికి లోన్స్ ఇవ్వడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఈవీ పాలసీలో బాగంగా వాహనాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ ఉద్యోగులకు సైతం 1520 శాతం డిస్కౌంట్ ఇచ్చేలా కంపెనీలు ముందుకు వస్తున్నా యన్నారు.

## కాగితాలకే బడ్జెట్ పరిమితం!

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** వరుసగా మూడోసారి ప్రజలను చీటింగ్ (మోసం)చేసే బడ్జెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని బిజెపి శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇది ఎండమావి బడ్జెట్ అని, కేవలం కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు. వివిధ రంగాలకు కేటాయించిన నిధుల్లో 80 శాతం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మంత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని ఆరోపించారు. హామీలు అమలు చేయకుండా మహిళలను మోసం చేస్తోందని ప్రభుత్వంపై మండిపడ్డారు. తెలంగాణలో పుట్టే ప్రతీ బిడ్డ మీద రూ. 2 లక్షల అప్పు ఉంటోందని, దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలే కారణమన్నారు. కాగా.. బడ్జెట్‌ను ఏలేటి చీటింగ్ బడ్జెట్ అనడంపై అధికారపక్షం ముప్పేట దాడికి దిగింది. పవిత్రమైన డాక్యు మెంట్‌ను చీటింగ్ అని ఎలా అంటారని ఏలేటిని మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు నిలదీశారు.

**రైతులను వేధించింది కేంద్రమే: మంత్రి సీతక్క**



నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులను వేధించింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని మంత్రి సీతక్క విమర్శించారు. చివరకు రాహుల్ గాంధీ పోరాటంతో ఆ చట్టాలను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత బిజెపి ఎమ్మెల్యేలకు లేదన్నారు. ఇప్పటి వరకు మహిళలకు రూ.57 వేల కోట్ల రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు.

రాష్ట్రానికి పన్నెండేళ్లలో బిజెపి ఇచ్చింది ఏమీ లేదని, ఈ విషయంలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏలేటికి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు.

### ఎన్నికల హామీలను ఎందుకు అమలు చేయడం లేదు

### వైఫల్యాల నుండి తప్పించుకుంటున్నారు: ఏలేటి

### పవిత్ర డాక్యుమెంట్‌ను చీటింగ్ అంటారా?: మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి ఫైర్

**దేశంలో తెలంగాణ భాగం కాదా?: మంత్రి శ్రీధర్‌బాబు**




నిధుల కేటాయింపు విషయంలో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపి స్తోందని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8మంది ఎంపిలు, 8మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అయినా లాభం లేదన్నారు. ఏలేటి ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మల్ నియోజకవర్గం తెలంగాణలోనే ఉందని, బిజెపి అధికారంలో ఉన్న ఢిల్లీలోనో లేదంటే మహారాష్ట్రలోనో లేదన్నారు.

## టైమ్‌స్కేల్ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

### తెలంగాణ వర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 24, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవి, గౌరవాధ్యక్షులు జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి వారు మాట్లాడుతూ పది సంవత్సరాలు సర్వీస్ దాటిన కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ డైలీవేజ్ ఉద్యోగులను దశలవారీగా టైమ్‌స్కేల్ పరిధిలోకి తీసుకురావాలని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే సెలవులు అన్నీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో యూనివ ర్సిటీలకు నిధులు పెంచాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ధర్నాను ప్రారంభించిన యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.పద్మశ్రీ మాట్లాడుతూ యూని వర్సిటీస్ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల పరి ష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టా లని డిమాండ్ చేశారు. టైంస్కేల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వయోపరిమితి 61కి పెంచాలని, పదవీ విర మణ సందర్భంగా గ్రా ట్యూటీ 20లక్షలు చెల్లిం చాలని, సర్వీస్‌లో ఉండగా మరణించిన వారి కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించా లని, వారసులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ నాయకులు చిరంజీవి, దేశిన రవికుమార్, శాతవాహన యూనివర్సిటీ నాయకులు ముల్కల దేవేందర్, ఎం.శ్రీనివాస్, ఓయూ నాయకులు ఎం.దశరథ్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న వెంకటేష్

## విజయవాడలో ఉగ్రవాదుల అరెస్టుపై తెలంగాణ పోలీసుల ఆరా

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** విజయవాడలో సోమవారం నాడు అరెస్టయిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మహమ్మద్ రహమతుల్లా, మీర్జా సోహైల్, మహమ్మద్ దానిష్‌లకు తెలంగాణతో వున్న లింకులను ఛేదించేందుకు టి. పోలీసులు రంగంలో దిగారు. పాక్‌లోని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు పెట్టుకుని పాక్‌కు అనుకూలంగా, భారత్‌పై విద్వేషం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టింగులు వుంచడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లేలా చూడడం వీరి ప్రధాన వృత్తిగా పోలీసులు తేల్చారు. తమను తాము ముజహిద్దీన్‌లుగా చెప్పుకుంటూ ముఖాలకు ము సుగులు కప్పుకు ని, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం చేస్తున్నారు. ఈ ముగ్గురు పాక్‌లోని ఉగ్రవాద సంస్థల నుంచి నిధులు అందుకుంటున్నారని తేలింది. వీరికి దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా కొన్ని గ్రూపులు వున్నాయని, ఇందులో అనేక మంది యువకులు వున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు కూడా వున్నారని అనుమానిస్తున్న టి. పోలీసులు దీనిపై ఆరా తీస్తున్నారు.



ధర్నాలో సంఘీభావం తెలుపుతున్న సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

## ప్రభుత్వ భూముల్లోని పేదలకు తక్షణమే పట్టాలివ్వాలి

### సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములలో నివసించే పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు తక్షణమే ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సీపీఐ ఆధ్వర్యంలో భూదాన్, ప్రభుత్వ భూముల్లో నివసించే గుడిసెవాసులకు ఇళ్ల స్థలాల పట్టాల సాధనకై మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 25లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేదని, ఇప్పుడు అది 90శాతం పెద్దల చేతులలోకి వెళ్లిపోయి, పదిశాతం మాత్రమే మిగిలిందని ఆరోపించారు. పెద్దలు కబ్జాలు చేస్తే మౌనం వహించే ప్రభుత్వం, పేదలు గుడిసెలు వేసుకుంటే మాత్రం ఉపేక్షించదని విమర్శించారు. ప్రభుత్వ భూదాన భూములలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి ప్రత్యేక కోటా కింద ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు సీపీఐ విశ్రమించబోదని, ప్రభుత్వం దుందడుకు చర్యలకు పాల్పడితే, అవసరమైతే సీపీఐ నాయకత్వం ఆ గుడిసెల్లోనే నివాసం ఉంటుందని స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో సీపీఐ నేతలు పశ్యపద్మ, రంగారెడ్డి జిల్లా నేత పాలమాకుల జంగయ్య, మేడ్చల్ జిల్లా నేత ఉమా మహేష్, హైదరాబాద్ జిల్లా నేత బి.స్టాలిన్, హనుమకొండ జిల్లా నేత కర్రె భిక్షపతి, వరంగల్ జిల్లా నేత షేక్ భాషామియా తదితరులు పాల్గొన్నారు.

## మండలిలో బిసిలకు బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులకు పొంతన లేదు : బిఆర్ఎస్ నిరసన

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో బీసీల బడ్జెట్ ప్రతిపాదనలు, కేటాయింపులు, ఖర్చులపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానానికి బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు, కేటాయింపులు, ఖర్చులకు పొంతన లేదని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. ఏటా బిసి సంక్షేమం కోసం రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి, రెండు బడ్జెట్లలో కేటాయించింది కేవలం రూ.21,113 కోట్లు మాత్రమేనన్నారు. వాటిలో రూ. 13,425 కోట్లు విడుదల చేయగా...ఖర్చు చేసింది కేవలం రూ.5005 కోట్లు మాత్రమేనన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే బీసీసబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని మూడు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ఇంకా ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం రెండు బడ్జెట్‌లలో రూ.2475 కోట్లు విడుదల చేసి రూ.489 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మీ ౖ పథకంలోను బీసీలకు అన్యాయం చేశారని రెండు బడ్జెట్‌లలోనూ రూ.4348 కోట్లు విడుదల చేయగా.. ఖర్చు చేసింది మాత్రం రూ.364 కోట్లు అని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల్లో బీసీల ఓట్లు దండుకుని బీసీలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తున్న సమయంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఛైర్మన్ పోడియం దగ్గర ఆందోళన చేపట్టారు.

## తెలుగు రాష్ట్రాల్లో పిజి వైద్యసీట్ల భర్తీ కౌన్సిలింగ్ పొడిగింపు సాధ్యం కాదు : సుప్రీంకోర్టు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పీజీ వైద్య విద్య సీట్ల భర్తీ కౌన్సిలింగ్ పొడిగింపుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పీజీ వైద్య సీట్ల భర్తీ కౌన్సిలింగ్ పొడిగింపు కుదరదని సుప్రీం కోర్టు తెలిపింది. ఇప్పటికే 7 రౌండ్లు కౌన్సిలింగ్ జరిగినందున ఇక పొడిగింపు కుదరదని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో పీజీ వైద్య సీట్ల భర్తీ కౌన్సిలింగ్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వాదనలు విన్న అనంతరం తీర్పు ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో పీజీ వైద్య సీట్ల కౌన్సిలింగ్ పొడిగింపు అవసరం లేదని జాతీయ మెడికల్ కమిషన్ సుప్రీంకోర్టుకి తెలిపింది. ప్రతి సంవత్సరం కూడా మెడికల్ సీట్లు మిగిలిపోతాయని.. అందులోనూ ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎక్కువ మిగులుతాయని జాతీయ మెడికల్ కౌన్సిల్ సుప్రీంకోర్టుకి తెలిపింది. ఈ నేపథ్యంలో పీజీ వైద్య సీట్ల కౌన్సిలింగ్ పొడిగింపుపై సుప్రీంకోర్టు తీర్పును ప్రకటించింది.

## 60శాతం జనాభా ఉన్నా బిసి సబ్‌ప్లాన్ కేటాయించకపోవడం బాధాకరం

### ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవేదన



**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త :** రాష్ట్ర జనాభాలో బిసిలు సంఖ్య పరంగా 60శాతానికి పైగా ఉంటే కనీసం బిసి సబ్ ప్లాన్ కేటాయించకపోవడం సరైన ఆలోచన కాదని ప్రభుత్వానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. బిసి సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోకుంటే తమపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని ఆ వర్గాలు భావించే ప్రమాదం ఉందన్నారు. కారు నడుపుతూ ఉపాధి పొందే వారుంటే వారికి రేషన్ కార్డు ఇవ్వకపోవడమనేది సరైన చర్య కాదన్నారు. బిసిలు డిసైడింగ్ ఫ్యాక్టర్ అని ప్రభుత్వానికి గుర్తు చేశారు. బడ్జెట్‌పై సాధారణ చర్చలో భాగంగా మంగళవారం ఆయన శాసనసభలో మాట్లాడారు. రాష్ట్రంలో అక్షరాస్యతాశాతం పెరగాలంటే యంగ్ ఇండియా పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్లుగా విభజించే ప్రక్రియ ప్రస్తుతం ఏ స్థాయిలో ఉందో చెప్పాలని, మరో 4, 5 మండలాలను జీహెచ్ఎంసీలో కలిపారని అంటున్నారని, ఈ అంశంపై క్లారిటీ ఇవ్వాలన్నారు. మూసీ ప్రక్షాళన విషయంలో సీఎం రేవంత్ రెడ్డిది దీర్ఘకాలిక ప్రణాళిక అని, ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌తోపాటు నది పరివాహక జిల్లాలకు మేలు జరుగుతుందని, కాలుష్య జలాలనుంచి విముక్తి లభించడంతోపాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అయితే మూసి ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను తీసుకెళ్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పాత బస్తీ అభివృద్ధి చెందాలంటే మూసి సుందరీకరణ జరగాల్సిందేనని తేల్చి చెప్పారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రజలంతా గర్వంగా భావిస్తారని అన్నారు. బీసీ ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ పెండింగులో ఉన్నాయన్నారు.

**మైనారిటీలపై కేంద్రం సవతి తల్లి ప్రేమ: ఎంఐఎం సభ్యుడు మాజిద్‌హుస్సేన్**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమంపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఎంఐఎం సభ్యుడు మాజిద్ హుస్సేన్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ఎంఐఎం స్వాగతిస్తోందని చెప్పారు. ఈ మేరకు బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన సాధారణ చర్చలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. షాదీముబారక్ నిధులు పెండింగ్‌లో ఉంటున్నాయని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మైనారిటీలకోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఉర్దూ అకాడమిలో పనిచేసే సిబ్బందికి సకాలంలో వేతనాలు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో మైనారిటీ స్టడి సెంటర్లను నెలకొల్పాలని కోరారు. పాతబస్తీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఆసరా పింఛన్లలో కొత్తవారికి లబ్ది చేకూర్చాలని విన్నవించారు.

## ఇప్పపువ్వు సారా తాగినవాళ్లు 115 యేళ్లు బతుకుతారు!: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 24:** ఇప్పపువ్వు సారాపై సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారని, తనకు ఇప్పపువ్వు సారాపై పూర్తి అవగాహన ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఇప్పపువ్వు సారాపైన తాను అవగాహనా లేకుండా మాట్లాడడం లేదని, నేడు అసెంబ్లీలో ఇప్పపువ్వు సారాపై మాట్లాడుతానని, అన్ని వివరాలు వెల్లడిస్తానని అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఎవరైతే తనను సోషల్ మీడియా ట్రోల్స్ చేస్తున్నారో వారు అసెంబ్లీలో తన ప్రసంగం వినాలని ఆయన సూచించారు. గతంలో ఇప్పపువ్వు సారా తాగిన వాళ్లు 115 యేళ్లు బతికారని, కానీ, ప్రస్తుతం కల్తీ బ్రాండ్లు తాగిన వారు కేవలం 60 ఏళ్లు మాత్రమే బ్రతుకుతున్నారని ఆయన తెలిపారు. విదేశాల్లో అనేక కల్తీ బ్రాండ్లు ఉన్నాయని వాటికి మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్టీ సోదరులు ఆర్థికంగా ఎదగాలంటే ఇప్ప పువ్వు సారాకు ప్రాధాన్యత కల్పించాలని తాను ప్రభుత్వాన్ని కోరుతానన్నారు. తెలంగాణలో ఇప్ప పువ్వు సారతో లక్ష కోట్ల రెవెన్యూ వచ్చే విధంగా మార్కెట్ ఎక్స్‌పోర్ట్ కూడా చేయవచ్చని ఆయన అన్నారు.

## రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.1.3 లక్షల కోట్లు వృద్ధి

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** తెలంగాణ స్థూల ఉత్పత్తిలో వృద్ధి రేటులో పెరుగుదల చోటు చేసుకుంది. ఏటేటా గణీయంగా పెరుగుతూ ఏడాదిలో రూ.1.3 లక్షల కోట్లు వద్ధి రేటు నమోదైంది. దీంతో తెలంగాణ తలసరి స్థూల ఉత్పత్తి రూ.3.79 లక్షలకు చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ వెల్లడించిన గణాంకాల ప్రకారం 2023-24లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.13,22,808 కోట్లు కాగా, ఏడాది కాలంలో రూ.1.3 లక్షల కోట్లు పెరిగి అది 2024-25కు రూ.14,56,837 కోట్లుగా రికార్డయింది. 2024-25లో రూ.3,79,751గా తలసరి స్థూల ఉత్పత్తి నమోదైందని, ఇది 2023-24తో పోలిస్తే రూ.33 వేలు పెరిగిందని రిజర్వ్ బ్యాంక్ గణాంకాలు వెల్లడించాయి.


# బిసి ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్పులను ఆపబోం

### వెంటనే విడుదల చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే బిసి విద్యార్థులకు ఇచ్చే ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్‌లు ఏ కారణం చేత నిలిచిపోయినా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని శాసనసభా వేదికగా ఎమ్మెల్యేలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తొలి విడత ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్ విడుదలై ఏ కారణం చేత నిలిచిపోయినా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వెంటనే విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని సభలో ఎమ్మెల్యే దానం నాగేందర్ లేవనెత్తిగా మంత్రి పొన్నం సమాధానమిచ్చారు. బిసి ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్పులను 300 నుండి 700కు కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు.

**పేదల జీవన ప్రమాణాలు పెరిగితేనే బడ్జెట్‌కు సార్థకత: కూనంనేని సాంబశివరావు**

దినసరి కూలి, రిక్షా కార్మికుడు తదితర అట్టడుగువర్గాల ప్రజల ఆదాయం పెరిగేలా ఉన్నప్పుడే బడ్జెట్‌కు సార్థకత చేకూరుతుందని, కానీ ప్రభుత్వాలు ఏటా ప్రవేశపెడుతున్న బడ్జెట్‌తో క్షేత్రస్థాయిలో ఉన్న పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. పిచ్చి పిచ్చి లెక్కలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని ప్రభుత్వాలు చెబుతున్నాయని మండిపడ్డారు. వ్యక్తి కేంద్రీకృతంగా బడ్జెట్ ఉండాల్సిన



అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఖర్చు చేసే రూపాయిలో పావలా కూడా పేదవాడికి చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు జరుగుతున్నా నిధులు మాత్రం ఖర్చు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై సాధారణ చర్చ రెండోరోజు మంగళవారం ఆయన శాసనసభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి జిఎస్‌టి వజ్రాయుధంగా మారిందని, రాష్ట్రాల ఆదాయాన్ని హరించివేస్తోందని విమర్శించారు. తెలంగాణ అప్పులు సుడిగుండంలో చిక్కుకుందని, ఒక అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అప్పుల ఊబినుంచి ఎలా బయటపడాలో ప్రభుత్వం ఆలోచించాలన్నారు.

ధరణిలోని లోపాలను సరిదిద్దుతామని చెబుతూ భూభారతి తెచ్చినా ప్రయోజనం ఉండడం లేదన్నారు. 9లక్షల సాదా బైనామాల్లో ఏ మాత్రం ఈ ప్రభుత్వం పరిష్కరించలేదని ఆరోపించారు. 25లక్షల ఎకరాల అసైన్డ్ భూమిలో 5శాతం కూడా పేదల వద్ద లేదని, అంతా ఉన్నవాళ్ల చేతుల్లోనే ఉన్నాయన్నారు. 2018లో ఐనవోలులో 138 ఎకరాలను ఓ బడాబాబు తనపేరు మీద మార్చుకున్నాడని సభకు వివరించారు. ప్రస్తుతం సింగరేణి కోల్‌మైన్స్ పరిస్థితి బాగోలేదని, మైనింగ్ బ్లాకులను కూడా ప్రయివేటుకు ఇవ్వడం సరికాదన్నారు. కార్మికుల సంఖ్య 24వేలకు తగ్గించే ప్రమాదకర విధానాలు అమలవుతున్నాయని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

ఆర్టిసికి 2లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయని, ఈవి బస్సులను ఆర్టిసినే అద్దెకు తీసుకుని నడపాలన్నారు. హిల్ట్ పాలసిని పారదర్శకంగా అమలు చేయాలని, మూసి ప్రక్షాళనలో ఇళ్లు పోతున్నవారిని పిలిచి మాట్లాడాలని ప్రభుత్వానికి సూచించారు. అభివృద్ధి అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం చేయొద్దని, ఏదైనా అనుకోని యుద్ధం వస్తే హైదరాబాద్‌పై గురిపెడితే పరిస్థితి అయిపోయినట్టేనని కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యారంగంపై కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా విద్యార్థుల్లో ప్రమాణాలు పెరగడం లేదన్నారు.

విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతు బీమా పథకాన్ని కొనసాగించాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు.

### రూ.60 వేల కోట్ల ఆదాయం సమకూరుస్తున్నా

# కేంద్రానికి తెలంగాణపై చిన్నచూపే

### శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్రం దేశ జిడిపిలో 5 శాతం ఆదాయాన్ని సమకూ రుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్రం నుంచి పన్ను వసూళ్ల రూపంలో రూ.60 వేల కోట్ల ఆదాయాన్ని కేంద్రం పొందుతుందని, అయినా వివక్ష చూపడం అన్యాయమని ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేసారు. మంగళవారం నాడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన సిఎం రేవంత్ రెడ్డికి బదులుగా మున్సిపల్ శాఖకు సంబంధించి బిఆర్ఎస్, బిజెపి సభ్యుల ప్రశ్నలకు జవాబులిచ్చారు. జంటనగరాలు, రంగారెడ్డి జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిల పనులను వేటినీ రద్దు చేయలేదని శ్రీధర్ బాబు స్పష్టం చేసారు. కొన్ని చోట్ల స్వల్ప మార్పులు చేసినా పనులన్నీ వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. వీటన్నటిని రూ.2,250 కోట్లతో పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. బిఆరెస్ హయాంలో కొన్ని పనులు మొదలై అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తి చేసిన విషయాన్ని ఆయన జ్ఞాపకం చేసారు. ప్రాధాన్యత క్రమంలో అన్నిటిని పూర్తి చేస్తామని వివరించారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద పనులు 15 రోజుల్లో ప్రారంభమవుతాయి. బాచుపల్లి హెచ్‌ఎండిఏ ఫ్లైఓవర్ పనులు మేనెలలోగా పూర్తి చేసి ప్రారంభించాలని ముఖ్యమంత్రి పట్టుదలతో ఉన్నారు. తప్పకుండా పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తాం. లింక్ రోడ్లలో మార్పులు ఏమీ లేవు. కొన్ని పనులను రద్దు చేసామని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. తప్పుడు ప్రచారాలు చేయవద్దని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు హితవు పలికారు. మేడ్చల్ సుచిత్ర ఎలివేటెడ్ రోడ్డు పనుల కాంట్రాక్టర్ మధ్యలో వదిలేసి వెళ్లాడు. దీనిపై సిఎం, రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర మంత్రి నిధిన్ గడ్కరీని కలిసి త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాని కోరారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేస్తాం. అక్కడ కొత్త కాంట్రాక్టర్ వచ్చారు. ప్యారడైజ్ శామీర్ పేట, ప్యారడైజ్ సుచిత్ర ప్రాజెక్టు పనులు కూడా టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి. డిఫెన్సు భూముల బదలాయింపుకు సంబంధించిన సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డి నాలుగు సార్లు కేంద్ర రక్షణ మంత్రిని కలిసి పరిష్కారానికి కృషి చేసారు. త్వరలో పనులు మొదలవుతాయి. హస్తినాపురం ఫ్లైఓవర్ ప్రతిపాదనపై మరిన్ని అధ్యయనాలు జరగాల్సి ఉంది. తప్పకుండా చేపడతాం. మూసి ప్రక్షాళన కార్యక్రమంతో పాటు తూర్పు పడమర ప్రాంతాలను కలిపేలా భారీ రహదారులను చేపట్టే ప్రణాళికలు సిద్ధమయ్యాయని శ్రీధర్‌బాబు వెల్లడించారు. జంటనగరాలకు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వలసలు పెరుగుతున్నాయి. దానికి తగినట్టు మంచినీటి సరఫరా, రహదారులను విస్తరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో భారీ ఆకాశ హర్మ్యాలకు గత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అవన్నీ పూర్తయే దశకు చేరుకున్నాయి. అక్కడ ఆవాసాలు మొదలైతే పీక్ అవర్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. దీని పరిష్కారానికి తమ ప్రభుత్వం పలు పనులను చేపడుతోందని వివరించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా మురుగనీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. గతంలో మూసినది గర్భంలో ఎస్టీపీని ఏర్పాటు చేయడానికి శాంక్షన్లు ఇచ్చారు. సాంకేతికంగా ఇది పెద్ద పొరపాటు. దానిని మరో చోట ఏర్పటు చేస్తున్నాం. శుద్ధి చేసిన జలాలను పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అని శ్రీధర్ బాబు తెలిపారు. ఏపితో సమానంగా నిధులు ఇప్పించాలి...అమృత్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులు విడుదల అవడం సంతోషకరం. అదే స్థాయిలో నిధులను తీసుకురావాలని బిజెపి ఎంపిలను కోరుతున్నాం. ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణాకు చిన్న చూపు ఎదురవుతోందని శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తం చేసారు. చిన్న రాష్ట్రమయినా ఐదు శాతం జిడిపికి తోడ్పతున్న విషయాన్ని విస్మరించరాదని అన్నారు.

## కారుణ్య మరణంతో లోకం వీడిన హారీష్‌రాణా

### దేశంలోనే తొట్టతొలి కారుణ్యమరణంగా రికార్డు

**న్యూఢిల్లీ, మార్చి 24:** పదమూడేళ్లుగా కోమాలో ఉంటూ జీవచ్ఛవంలా బతికిన హారీశ్ రానాకు విముక్తి లభించింది. సుప్రీం కోర్టు ఆదేశాలతో అతడు కారుణ్య మరణంతో ఈ లోకాన్ని విడిచి వెళ్లాడు. కారుణ్య మరణం నియమావళిని అనుసరించి ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎయిమ్స్‌లో మంగళవారం రానాకు లైఫ్ సపోర్టును వైద్యులు నిలిపివేశారు.



దీనితో ఏళ్లుగా తనను, కన్నవాళ్లను ఎంతో క్షోభకు గురిచేస్తున్న బాధకు ఇంకా తనను వేధించే అవకాశమివ్వకుండా తుది శ్వాస విడిచాడు. తద్వారా కోర్టు ఆదేశాలతో కారుణ్య మరణం పొందిన తొలి భారతీయుడిగా హరీశ్ రానా పేరు చరిత్రలో నిలిచిపోనుంది. అశోక్ రానా, నిర్మాలా రానా దంపతుల సంతానమైన హరీశ్ రానా పంజాబ్ యూనివర్సిటీలో 2013లో బీటెక్ చదువుతున్నాడు. ఓరోజు అతడు ప్రమాదవశాత్తూ నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి కింద పడ్డాడు. ఆ ప్రమాదంలో రానా తలకు బలమైన గాయాలయ్యాయి. ఆ గాయాల తీవ్రత కారణంగా అప్పటినుంచి అతడు అచేతన స్థితిలోనే ఉండిపోయాడు. తమ బిడ్డను ఎలాగైనా బతికించుకునేందుకు కన్నవాళ్లు చేయని ప్రయత్నమంటూ లేదు. కుమారుడి వైద్య ఖర్చులు, మందుల కోసం తండ్రి అశోక్ స్కూటర్ మీద శాండ్ విచ్‌లు కూడా అమ్మాడు. కానీ వారి ప్రయత్నమూ నెరవేరలేదు. ఏ వైద్యమూ హారీశ్ను మునపటి మనిషిని చేయలేదు. పదేళ్లకు పైగా కృత్రిమ ఆహారం, ఆక్సిజన్ సపోర్ట్‌తో బతికిన రానాకు కారుణ్య మరణాన్ని ప్రసాదించాలని అతడి తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. మార్చి 11వ తేదీన హరీశ్ రానా కేసును విచారించిన అత్యున్నత ధర్మాసనం అతడి కారుణ్య మరణానికి అనుమతిచ్చింది. కారుణ్య మరణం కోసం ఘజియాబాద్ నుంచి మార్చి 14న హరీశ్‌ను ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడ అనస్తీషియా, పల్లియేటివ్ మెడిసిన్ విభాగం హెడ్ డాక్టర్ సీమా మిశ్రా పర్యవేక్షణలో వైద్యుల బృందం హారీశ్‌కు లైఫ్ సపోర్టింగ్‌ను తీసేశారు. న్యూరో సర్జరీ, ఆంకో అనస్తీషియా, పల్లియేటివ్ మెడిసన్, సైకియాట్రీ వైద్యులు ఈ ప్రక్రియ సున్నితంగా, సాఫీగా జరిగేలా చూసుకున్నారు. భారత్‌లో కోర్టు ఆదేశాలతో కారుణ్య మరణం పొందిన తొలి వ్యక్తిగా హరీశ్ రానా భారత రికార్డుల్లో నిలిచిపోయాడు.

## డీలిమిటేషన్ అనేది జనగణన తర్వాత జరిగే రాజ్యాంగ ప్రక్రియ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** డీలిమిటేషన్ అనేది జనగణన తర్వాత జరిగే రాజ్యాంగం ప్రక్రియ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. జనగణన పూర్తైన తర్వాత డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, కొత్తగా నియోజకవర్గాల పునర్విభజన చేస్తారని, డీలిమిటేషన్ పూర్తిగా జనాభా ఆధారంగా మాత్రమే జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం తప్పుదారి పట్టించేదిగా ఉందని, ఒకవేళ కేవలం జనాభా ఆధారంగా చేస్తే దక్షి ణ రాష్ట్రాల్లో చాలా తక్కువ సీట్లు రావాల్సి ఉంటుందన్నారు. అక్కడ ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ సీట్ల సంఖ్య మాత్రం ఎక్కువగా ఉందని, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో కూడా జనాభా తక్కువగా ఉన్నప్పటికీ అసెంబ్లీ సీట్లు అధికంగా ఉన్నాయని, కాబట్టి కేవలం జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరుగుతుందనడం పూర్తిగా తప్పు.ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లను ఆధారంగా తీసుకుని ప్రపోర్షనేట్‌గా సీట్ల పెంపు జరుగుతుందన్నారు. ఒక లోక్‌సభ నియోజకవర్గంలో ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్ల సంఖ్య ఆధారంగా భవిష్యత్తులో సీట్ల పునర్విభజన జరుగుతుందన్నారు. ఇది జనాభా ఆధారంగా కాకుండా సమతుల్య విధానంలో జరుగుతుందన్నారు.

దక్షిణ రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని, ఉత్తర రాష్ట్రాలకు లాభం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మరియు ఇండీ అలయెన్స్ పార్టీలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధం అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణ రాష్ట్రాల సీట్లు తగ్గే పరిస్థితి లేదు. న్యాయంగా, సమానంగా అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు.

రాబోయే 2026 జనగణన అనంతరం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం ఉన్న సీట్ల ప్రాతిపదికన ప్రపోర్షనేట్‌గా పునర్విభజన జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మకూడదదని, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే రాజకీయాలను మానుకోవాలని సూచించారు.

## మళ్లీ చెప్తున్నా.. ఫార్ములా- ఇ కార్ రేస్ ఒక లొట్టపీసు కేసు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 24:** ఫార్ములా ఈకార్ రేస్ కేసు లొట్టపీసు కేసు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో కెటిఆర్ చిట్ చాట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్ములా ఈ రేస్ కేసు ముమ్మాటికీ ఒక లొట్టపీసు కేసు మాత్రమే అన్నారు. ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదు, లేని కేసును ఉన్నట్టుగా చూపి మసి పూసి మారేడు కాయ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆరు గ్యారెంటీలపై ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టాలని స్పీకర్‌ను అవకాశం ఇవ్వాలని కోరాం. ప్రైవేట్ మెంబర్ బిల్లు నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎవరికీ లబ్ధి జరిగిందో ఆ కంపెనీ పేరును కనీసం చార్జ్‌షీట్‌లో కూడా చేర్చలేదు. నా వల్ల ఒక్క పైసా ఎవరికైనా వెళ్లిందా అన్న అంశాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు ప్రస్తావించ లేదు. ఇప్పటికీ డబ్బులు అక్కడే ఉన్నాయి. తప్పుడు చార్జ్‌షీట్ తీసుకొచ్చి అక్రమ కేసు పెడుతున్నారు. బ్యాంక్ టు బ్యాంక్ డబ్బు ట్రాన్స్‌ఫర్ జరిగినట్టు ఉంది...అయితే రికవరీ ఎందుకు చేయడం లేదు ప్రభుత్వం? అని ప్రశ్నించారు.

### మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో

## నేడు సీన్ రీకన్‌స్ట్రక్షన్

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో బుధవారం నాడు పోలీసులు ఫాం హౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్నారు. ఈ కేసులో అరెస్టయి జైల్లో వున్న ఫాం హౌస్ యజమాని మాజీ ఎంఎల్‌ఎ రోహిత్ రెడ్డి, ఆ యన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలను మొయినాబాద్ పోలీసులు మంగళవారం కోర్టు ఆదేశాల మేరకు కస్టడీలోకి తీసుకున్నా రు. వీరిని శంషాబాద్‌లోని రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్నారు. వీరిని బుధవారం ఉదయం ఫాం హౌస్‌కు తీసుకువచ్చి ఈ నెల 14వ తేదీన ఏం జరిగిందనే దానిపై మరోదఫా సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఇదే సమయంలో ఫాం హౌస్‌లో వీరిని విచారించనున్నారు. డ్రగ్స్ స్మగ్లర్లతో వున్న లింకులను కూడా ఛేదించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇదే కేసులో పోలీసుల అదుపులో వున్నాడని వార్త లు వస్తున్న అభిషేక్ సింగ్ గురించి కూడా బుధవారం నాడు స్పష్టత వచ్చే వీలుంది. తన కుమారుడి ఆచూకీ కోసం అభిషేక్ సింగ్ తండ్రి రాజేంద్ర నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని గురించి పోలీసులు ఒక ప్రకటన వెలువరించే వీలుంది.

# మావోయిస్టు అగ్రనేత పాపారావు లొంగుబాటు

### లొంగిపోయిన వారిలో డివిసిఎం కమిటీ సభ్యుడు ప్రకాష్‌తోపాటు మరో 17 మంది సభ్యులు.. వీరిలో ఏడుగురు మహిళలు

**చర్ల, మార్చి 24, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ గడువుకు వారం రోజులు ఉండగా చత్తీస్‌గఢ్ లోని దండకారణ్యంలో విశృత సెర్చ్ ఆపరేషన్ కొన సాగుతుంది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోగా మిగిలిన మావోయిస్టు అగ్రనేతల కోసం వెతుకులాటను మరింత ఉధృతం చేసారు.గడువులోగా లొంగిపోతే క్షమాబిక్ష లేదంటే ఎన్ కౌంటర్ అన్న నినాదంతో అడవులను జల్లెడ పడుతున్న క్రమంలో మారో మావోయిస్టు అగ్రనేత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి సభ్యుడు పాపారావు ఆలియాస్ ( సున్నం చంద్రయ్య ) మంగు దాద చత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పాపారావు లొంగుబాటు కోసం చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇంటిలిజెన్సీ వర్గాలు మధ్యవర్తుల ద్వారా విశేష కృషిచేసారు.ఈ క్రమంలో పాపారావు లొంగుబాటుకు తీసుకున్న చర్యలు సఫలీకృతం అయ్యాయి.ఆయనతోపాటు మరో మరో 17 మంది లొంగిపోయారు.వీరిలో డివిసిఎం ప్రకాష్ (మడివి అనీల్) ఉన్నారు. లొంగిపోయిన వారిలో 7గురు మహిళలు ఉన్నారు. పాపారావు స్వస్థలం సుకుమా జిల్లా కిష్టారం పాడు పొలీస్ స్టేషన్ పరిధిలోని పుట్టపాడు గ్రామంగా తెలిసింది.పుట్టపాడు గ్రామం



ఒకప్పుడు మా వోయిస్టుకు కంచుకోట. మావోయిస్టుల లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్య మంత్రి విష్ణుదేవ్ సాయి ఒక కీలక ప్రకటన చేశారు. ప్రధానమంత్రి, హోం మంత్రిల దృఢ సంకల్పం వల్ల దేశంలో నక్సలిజంపై పోరాటం తీవ్రమైందని దాని ప్రభావాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు.

నక్సలిజం నిర్మూలనకు గడువు ఇప్పుడు చాలా దగ్గర పడిందని సీఎం సాయి పేర్కొన్నారు అందువల్ల పాపారావు వంటి ప్రముఖ నక్సలైట్ కమాండర్లు లొంగి పోవడం ఒక సానుకూల సంకేతమని ఇది నక్సల్స్ వ్యతిరేక కార్యక్రమం విజయాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. భద్రత బలగాలు తమ చివరి యుద్ధంలో 'పాపారావు' కోసం ప్రత్యేక కూంబింగ్ ఆపరేషన్ చేపడుతూనే లొంగుబాటు ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. కాగా పాపారావుపై రూ.25 లక్షల రూపాయల రివార్డు ఉంది. 'పాపారావు' బృందం ఏకే-47లు ఎస్ ఎల్ ఆర్ లు భారీ సంఖ్యలోని ఆయుధాలతో జగదల్పూర్ చేరుకోనున్నారు. ఆయన లొంగుబాటులో పోలీసులను ఉన్నతాధికారులు అధికారికంగా నేడో రేపో చూపనున్నారు.

# కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు

### పూర్తి స్థాయిలో ప్రాయోజిత పథకాల అమలు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలంగాణ సర్కార్ యోచిస్తోంది. తద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ నిధులను రాబట్టాలనే ప్లాన్‌లో రాష్ట్ర సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాష్ట్రానికి అందేలా ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటి వరకూ కేంద్ర ప్రాయోజిత పథకాను రాష్ట్రంలో సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, వాటికి రాష్ట్ర వాటాగా కేటాయించాల్సిన నిధులు జత చేయకపోవడంతో పలు సందర్భాలో కేంద్ర నిధులు మంజూరు కావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక నుండి అటువంటి నిర్లక్ష్యం జరగకుండా సకాలంలో కేంద్ర నిధులకు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్లు కలిపి ప్రాయోజిత పథకాల నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోనుంది.

ఇందుకు కేంద్రం సింగిల్ నోడల ఏజెన్సీ ద్వారా సిస్టమ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్విక్ ట్రాన్స్ఫర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖలు, రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన ఈ కుబేర్ వ్యవస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఆయా ప్రాయోజిత పథకలను అమలు చేసే కేంద్ర శాఖలతో పాటు, రాష్ట్ర శాఖలు ప్రత్యేక ఖతాలను తెరచి వాటి ద్వారా లావాదేవీలు నిర్వహిస్తాయి. ఈ విధానం అమలు కోసం రాష్ట్రంలో ఖజానా శాఖలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల పర్యవేక్షణ కోసం అకౌంట్ రెండరింగ్ యూనిట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

# రెడ్డి సంఘాల ఐక్యతతోనే కులం అభ్యున్నతి

## బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి




**ఎల్.బి.నగర్, మార్చి 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని రెడ్డి కుల సంఘాలు ఐక్యంగా ఏకతాటిపైకి వచ్చాయని ఇకనుంచి రెడ్డి కులం అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధిస్తుందని రెడ్డి రాష్ట్ర హడ్‌హాక్ కమిటీ నూతన చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, పలు రెడ్డి కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఒక్కటే రెడ్డి సంఘంగా ఏర్పడిన వారికే సహకరిద్దాం.. లేదంటే నిలదీద్దాం అనే నినాదంతో నాగోల్ పీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని రెడ్డి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి రెడ్డి సంఘాల పెద్దలు, నాయకులు అధిక సంఖ్యలో సభకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కుల సంఘాలు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉండడం వల్ల కొందరు రెడ్డి కులంపై అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డి సంఘాలన్ని కలిసికట్టుగా ఐక్యంగా ఒకేతాటిపైకి వచ్చి హక్కుల కోసం పోరాటం చేయాలని కోరారు. ఇందుకు అన్ని రెడ్డి సంఘాలు ఒకే సంఘంగా రెడ్డి రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు కావడం అభినందనీయమని, ఇకపై తమ సంఘాలన్నీ ఈ కమిటీలోనే విలీనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని సంఘాల కలయికతో ఏర్పడిన ఈ రెడ్డి రాష్ట్ర అడ్‌హాక్ కమిటీలో ప్రతీ జిల్లాలోని రెడ్డిలకు సభ్యులుగా స్థానముంటుందని, ఈ కమిటీ ఏ ఒక్కరిదో కాదని కమిటీ నూతన చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. ఈ కమిటీకి రానున్న రోజుల్లో ప్రతీ రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి రెడ్డీల సంక్షేమానికి పనిచేసే ఒకేఒక్క కమిటీగా తీర్చిదిద్దనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని రెడ్డి సంఘాల పెద్దలు, నాయకులు వేలాదిగా తరలివచ్చారు.

**రెడ్డి రాష్ట్రష అడాక్ కమిటీ ఏకగ్రీవం.**

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రెడ్డి సంఘాలు కలిపి ఏర్పడిన రెడ్డి రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ నూతన కమిటీని అన్ని జిల్లాల రెడ్డి నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, కన్వీనర్‌గా బుడ్డెంగారి మాధవరెడ్డి, కోకన్వీనర్లుగా కరుణాకర్‌రెడ్డి, కొట్టం మధుసూదన్‌రెడ్డి, సభ్యులుగా బొబ్బిలి దామోదర్‌రెడ్డి, నావోల్గా సత్యనారాయణరెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, నూకల పద్మారెడ్డి, నందికొండ గీతారెడ్డి, డీకే.వసంతరెడ్డి, శ్రీలతారెడ్డి ఇతరులు ఎన్నికయ్యారు. కాగా ప్రతీ జిల్లా నుంచి సభ్యులు ఉండేలా మరికొందరిని కమిటీలోకి తీసుకుని పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేయనున్నామని వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# డిగ్రీ విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ప్రైవేటు కాలేజీలకు అమలు చేయాలి

## ప్రభుత్వానికి కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 24:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఇకపై ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరును అమలు చేయాలని అధికారులు భావించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కళాశాల విద్య శాఖ ప్రభుత్వ కాలేజీలకు మెయిల్స్ ద్వారా సమాచారాన్ని చేరవేసింది. ఇప్పటి వరకు ప్రభుత్వ స్కూల్స్ లోని విద్యార్థులు, ఉపాధ్యాయులకి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ స్కూల్స్ లో ఎఫ్ఆర్ఎస్ అమలును గమనించి.. ఇంటర్ విద్యలోనూ ప్రారంభించారు. ఇపుడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ అమలు చేయాలని కళాశాల విద్య శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు కొరకు రూపొందించిన ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టం) ఆప్‌ని అమలు పరచడంలో ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకి కూడా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె సురేందర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు కాలేజీల్లోనూ అమలు చేస్తూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల సమన్యాయం పాటించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడం ద్వారా విద్యలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరచడానికి చేస్తున్న కృషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. కళాశాల విద్యా కమిషనర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు నమోదు కొరకు ప్రత్యేకమైన ఆప్‌ని రూపొందించి అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచడానికి చేస్తున్న ప్రయత్నాలు అభినందించ తగినవేనని అయితే ఇది కేవలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివే పేద విద్యార్థుల హాజరు విషయంలో మాత్రమే నిబంధనలు రూపొందించి, ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థుల పట్ల ఉదారంగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో సరైన మౌలిక వసతులు లేనప్పటికీ అనేకమంది విద్యార్థులను చేర్చుకుంటూ సరియైన అర్హతలు కలిగిన అధ్యాపకులను నియమించకుండా, తరగతులు నిర్వహించకుండానే స్కాలర్‌షిప్‌లను పొందుతూ.. విద్యను వ్యాపారం లాగా మార్చుతున్న యాజమాన్యాల పట్ల కఠిన వైఖరి అవలంబించాల్సింది పోయి, ఉదాసీనంగా వ్యవహరించడాన్ని ప్రభుత్వం పునర్ ఆలోచించాలని జేఏసీ చైర్మన్ సురేందర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు 90 శాతం మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని.. వారి హాజరు శాతం మెరుగుపరచడానికి సరైన హాస్టల్ వసతులు కూడా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఏపిలో 150 ఆయుష్ కేంద్రాలు

## వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ.మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన భారతీయ ప్రాచీన వైద్య సేవల్ని ప్రజలకు చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అందులో భాగంగానే 150 ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను ప్రారంభించామని వివరించారు. రూ.44 కోట్లతో చేపట్టే ఈ భవనాల నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండు నెలల్లోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, హోమి యోపతి) చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ ఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. నేషనల్ ఆయుష్ మిషన్ (వితిలీ) 202526 వార్షిక ప్రణాళికలో భాగంగా మొత్తం 150 ఆయుష్ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు మరియు ఆధునీకీకరణ పనులకు ఆయుష్ శాఖ నిధులు మంజూరు చేసింది. కొన్ని ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు శిధిలావస్థకు చేరుకోగా, మరి కొన్ని అరకొర సౌకర్యాలతో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. ప్రాచీన వైద్య విధానాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిరక్ష్యం చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఆయుష్ వైద్యశాలల రూపురేఖలు మారనున్నాయి. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణాలు, ఆధునీకీకరణ పనులు జరుగుతున్నాయి. 90 ఆయుష్ కేంద్రాలకు ఆధునీకీకరణ పనులు చేపట్టగా,

60 ప్రభుత్వాసు పత్రుల్లో నూతనంగా ఆయుష్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పిహెచ్‌సిలు) 26, సామాజిక ఆరోగ్య కేంద్రాలో ్లసిహెచ్‌సిలు) 26, జిల్లా ఆసు పత్రుల్లో 8 ఆయుష్ ఆరోగ్యకేంద్రాల్ని నూతనం గా నిర్మిస్తున్నారు.

# ప్రముఖులను హతమారుస్తామంటూ బాంబు బెదరింపులు

న్యూఢిల్లీ, మార్చి 24: దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

# బిసి డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

## - బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 24,ప్రభాతవార్త:** బిసి డిమాండ్లు పరిష్కరించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రతిపక్ష పార్టీలు కూడా పూర్తిగా విఫలం అయ్యాయని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈఅమేరకు మంగళవారం ఢిల్లీలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారం నోచుకుని బిసి సమస్యలను పార్లమెంట్ ను వేదికగా చేసుకుని చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్న కనీసం ప్రయత్నం కూడా అధికారంలో ఉన్న ఎన్‌డిఏ, ప్రతిపక్షంలో ఉన్న ఇండియా కూటమి లో చొరవ తీసుకోకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. బిసి కులగణన, రిజర్వేషన్ల పెంపు, రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితి ఎత్తివేత, మహిళా బిల్లు లో బిసి మహిళలకు సబ్ కోట, తదితర డిమాండ్ల పై పార్లమెంట్ లో కొట్లాడాల్సిన రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నాడని,

డిమాండ్లను పరిష్కరించే బాధ్యత ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యతలను విస్మరి స్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. బిసిల విషయంలో కాంగ్రెస్ బిజెపి రెండు ఒకే తాను ముక్కలని, రెండు కూడా బిసి వ్యతిరేక పార్టీలేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గిరిజన జనాభాలో కొత్తగూడెం అగ్రస్థానం

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజనుల జనాభాలో అత్యధికంగా కొత్తగూడెం జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో 4 లక్షల మంది గిరిజన జనాభా ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. అలాగే 3 లక్షల మందితో మహబూబాబాద్ రెండో స్థానంలోను, 2.25 లక్షలతో ఆదిలాబాద్ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో 2.10 లక్షల మంది గిరిజనులు, ఖమ్మంలో 2 లక్షల మందితో అధిక జనాభాను కలిగి ఉన్న జిల్లాగా నమోదైంది. అదేవిధంగా రాష్ట్రంలో లక్ష నుంచి లక్షన్నర మధ్య రంగారెడ్డి, సూర్యాపేట, కొమరం భీమ్, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలు, 50 నుండి లక్ష జనాభా మధ్యన కలిగిన షెడ్యూల్ ట్రైబ్స్ జిల్లాలు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మంచిర్యాల, నిర్మల్, ములుగు ఉన్నాయి. వీటితో పాటు, హైదరాబాద్‌లో 50, వేలు, భువనగిరిలో 44 వేలు, వనపర్తిలో 46 వేలు ఎస్టీల జనాభా ఉంది. 20 నుండి 40 వేల మధ్యన గిరిజన జనాభా గలిగిన జిల్లాలు జనగాం, హనుమకొండ, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, నారాయణపేట, జోగులంబ గద్వాల్, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల తక్కువ జనాభాతో కలిగి ఉన్న జిల్లాలుగా ఉన్నాయి.

# ఎన్టీపిసిలో తగ్గిన విద్యుత్ ఉత్పత్తి

## - 1,900 మెగావాట్లు తగ్గించిన యూనిట్లు - రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్‌పై ప్రభావం - సాంకేతిక, నిర్వహణ, బొగ్గు సమస్యలే కారణం

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త :** రామగుండం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (ఎన్‌టీపీసీ)లోని యూనిట్ల లోడ్ తగ్గుముఖం పట్టింది. అధికారవర్గాల తాజా నివేదిక ప్రకారం సాంకేతిక, నిర్వహణ కారణాల వల్ల విద్యుత్ ఉత్పత్తిలో మార్పులు జరుగుతున్నాయి. ప్రధానంగా బొగ్గు నాణ్యత సమస్యలు, తరచుగా బాయిలర్ ట్యూబ్ లీకేజీలు, ఫ్లేమ్ ఫెయిల్యూర్స్ వల్ల 55 శాతం కనీస సాంకేతిక లోడ్ (ఎమ్‌టిఎల్) కంటే తక్కువ స్థాయిలో పనిచేయడం కష్టంగా మారుతోందని నివేదిక వెల్లడిస్తోంది. ఇందువల్లే ఎన్టీపీసీలో ప్రస్తుతం తక్కువ లోడ్ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎన్టీపీసీలో పలు యూనిట్ల నుంచి 1,900 మెగావాట్లను తగ్గించడంతో విద్యుత్ డిమాండ్ తగ్గుదల కనిపిస్తుంది. థర్మల్ యూనిట్ల నుంచి ఉత్పత్తి తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం. 2,600 మెగావాట్ల సామర్థం కలిగిన ఎన్టీపీసీలోని 200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లు, 500 మెగావాట్ల ఐదో యూనిట్‌లో ఆదివారం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. అంతకు ముందే 800 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లోని ఒక్కటో యూనిట్‌ను ఈ నెల 21వ తేదీ నుంచి ఆఫ్‌లో ఉంచారు. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4, 6 యూనిట్లలో పరిమితి లోడ్ తో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. అలాగే తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్ల రెండో యూనిట్‌లో మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. వేసవి ప్రారంభంలోనే రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిలో కోత పడటం వల్ల దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి నెలకొనడం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు పగటిపూట సౌర, జల, వాయు విద్యుత్ ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలపై డిమాండ్ తగ్గుతున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనకు రామగుండం ఎన్టీపీసీ సాధ్యం కాకపోవచ్చనే అధికారవర్గాలు భావిస్తున్నాయి.

# ఆర్డీటి రెన్యువల్ ఘనత మంత్రి లోకేష్‌దే

## మంత్రి సవిత హర్షం

**సచివాలయం,మార్చి 24,ప్రభాతవార్త :** అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటి) సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఏ)ను కేంద్ర ప్రభుత్వం పునరు ద్దరించడంపై రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. ఈ ఘనత ముమ్మాటికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దే నని కొనియాడారు. వారికి రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్డీటీ భూములు కొట్టేయాలని చూస్తే, ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న తాము ఆ సంస్థకు అండగా నిలిచామన్నారు. ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఏను కేంద్రం నిలిపివేసిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.

ఇచ్చిన హామీకి కట్టుబడుతూ కేం ద్రాన్ని ఒప్పించి కూటమి ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఏను పున రుద్ధరించిందన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యా లయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమా వేశంలో మంత్రి సవిత మాట్లాడారు.

# ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి24:** ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడవద్దని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విజ్ఞప్తి చేశారు. బడ్జెట్‌లో తాము ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడం పట్ల కూడా ప్రతిపక్షం ఓర్వలేకపోతోందని విమర్శించారు. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని ప్రశ్నించారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆర్థిక సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో బీమా సౌకర్యం కల్పించామని వెల్లడించారు. సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంటే బీఆర్ఎస్ వారికి వినడానికి కూడా సమయం లేనట్లుగా ఉందని విమర్శించారు. తాను డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశపెడుతుంటే ప్రతులు చించి సభ నుంచి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మేం చెప్పింది వినాలి లేదంటే వెళ్లిపోతామన్నట్లుగా బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందని మండిపడ్డారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. నాడు రైతు బంధు పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల పథకంగా మార్చుకుందని ఆరోపించారు. 2018లో ప్రజలు ఓట్లు వేయడానికి వరుసలో నిలబడిన సమయంలో రైతు బంధు నిధులు జమ చేశారని ఆరోపించారు. కానీ తాము రైతు భరోసా నిధులు విడుదల చేసింది ఎన్నికల కోసం కాదని పేర్కొన్నారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు. తమ ప్రభుత్వం రాగానే ఒకేసారి రైతు రుణమాఫీ చేశామని

# కుప్పకూలిన ఎయిర్‌ఫోర్స్ మిలిటరీ విమానం - 90 మంది మృతి

**బొగోటా, మార్చి 24:** కొలంబియాలో ఘోర విమాన దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ దేశానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ మిలిటరీ విమానం కుప్పకూలింది. టేకాఫ్ అవుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో 90 మంది మృతి చెందారు. ప్రమాద సమయంలో విమానంలో 110 మంది సైనికులు ఉన్నారు. పెరూ సరిహద్దుకు సమీపంలో ప్యూర్టో లెగుయిజామో పట్టణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన హెర్క్యులస్ సీ130 ఎయిర్‌క్రాఫ్ట్ టేకాఫ్ అవుతుండగా కుప్పకూలిందని రక్షణ మంత్రి పెడ్రో శాంచెజ్ వెల్లడించారు. ఈ దుర్ఘటనలో ఎంతమంది మరణించారు, ఎంతమంది గాయపడ్డారు అన్న వివరాలు ఇప్పుడే చెప్పలేమన్నారు. సహాయ బృందాలను ఘటనా స్థలికి పంపామని, పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు చెప్పారు. ప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదు. విమాన దుర్ఘటనపై కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది ఘోర ప్రమాదమని, ఎలాంటి ప్రాణనష్టం సంభవించకూడదని ఆశిస్తున్నానన్నారు. ఇలాంటి ఘటన జరిగి ఉండకూడదని, జవాన్ల భద్రతే తమకు ప్రాధాన్యమని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా చూసేందుకు మిలిటరీ సామర్థ్యాలను పెంచుతామని, మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచంలో మిలిటరీ రవాణా ఎయిర్‌క్రాఫ్ట్‌లలో సీ130 పేరెన్నికగన్నది. జవాన్లు, ఆయుధాల రవాణాకు దీనిని ఉపయోగిస్తుంటారు. ఒకేసారి 19 వేల కిలోల బరువును ఇది జార విడచగలదు. మెడికల్ ఎమర్జెన్సీ, విపత్తు వాటికీ దీనిని వినియోగిస్తారు.



సమ్మేళనంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, మధుసూదనచారి, వెంకటేష్, రాములు, చంద్రశేఖర్‌గౌడ్, సతీష్ తదితరులుధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న పాలడుగు భాస్కర్

## ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేస్తే

# ప్రభుత్వాన్ని కూల్చేస్తాం

## 3న తరగతుల బహిష్కరణ కలెక్టర్ కార్యాలయాలు, ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ముట్టడి: ఆర్. కృష్ణయ్య హెచ్చరిక

**సైఫాబాద్, మార్చి 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే ఫీజుల బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 3వ తేదీన తరగతులు బహిష్కరించి జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలను ముట్టడించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విద్యార్థిలోకానికి పిలుపునిచ్చారు. ఈ లోగా వేలాది మంది విద్యార్థులు 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని చేపడతారని ఆయన హెచ్చరించారు. 10 బిసి సంఘాలు, 18 కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనానికి బిసి విద్యార్థి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీపడి అవినీతికి పాల్పడుతూ వందల కోట్లు సంపాదించుకుంటున్నారని, ఎకరాల భూములను కబ్జా చేస్తున్నారని, వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లిస్తూ, చదువుకునే పేద విద్యార్థులకు మాత్రం ఫీజుల రీయంబర్స మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ ఫీజుల రీయంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని, ఈ పథకాన్ని ఎత్తివేస్తే ప్రభుత్వం కుప్పకూలిపోతుందని, రాష్ట్రంలో మంత్రులు తిరగబోరని ఖబడ్దార్ అని ఆయన హెచ్చరించారు. ఫీజులు బకాయిలకు 8 వేల కోట్లు విడుదల చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి విదేశీ స్టైఫండ్ మంజూరు చేయాలని, కళాశాలలు, హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, 119 బిసి గురుకులాలు, 100 కాలేజీ హాస్టల్స్ మంజూరి చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమ్మేళనంలో బిసి నేతలు నీల వెంకటేశ్, పగిళ్ల సతీష్, జిల్లపల్లి అంజీ, మేకల రాములు యాదవ్, దేవయ్య, మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, నిఖిల్, మోదీరాందేవ్ తదితరులు పాల్గొన్నారు.




ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న పాలడుగు భాస్కర్

# మున్సిపల్ కార్మికులందరినీ పెర్మనెంట్ చేయాలి

## సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

**ధర్నాచౌక్, మార్చి 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 4 గ్రేటర్ మున్సిపల్ కార్పోరేషన్‌లు మరియు మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని సీఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిదిగా హాజరై పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు 8గంటల పని విధానం అమలుచేయాలని, రెండవ పీఆర్‌సలో కనీస వేతనం 26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న వారి అర్హతలను బట్టి ప్రమోషన్లు కల్పించాలని, రాత్రి డ్యూటీ చేసే వారికి ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలని, రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని, చనిపోయిన కార్మికులు లేదా వయస్సు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలడుగు సుధాకర్, టి.ఉప్పలయ్య, ప్రకాష్, మహేష్, గుర్రం అశోక్, రాజనర్సు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




దీక్షనుద్దేసించి ప్రసంగిస్తున్న సీఐటియూ ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

# పోర్టర్ డ్రైవర్, పార్ట్నర్స్ సమస్యలు పరిష్కరించాలి

## సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. వీరయ్య

**ధర్నాచౌక్, మార్చి 24, ప్రభాతవార్త:** పోర్టర్‌న ఆన్లైన్ బిజినెస్ యాప్‌కి డ్రైవర్ పార్టనర్స్ పేరుతో అటాచ్ అయిన డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ (సిఐటియూ) పోర్టర్ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షను ప్రారంభించిన వీరయ్య మాట్లాడుతూ గతంలో వలె డ్రైవర్స్ కోసం అడ్డల వద్దకి వెళ్లే పరిస్థితి లేకుండా యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే అవకాశం రావటంతో, యాప్ మేనేజ్మెంట్స్ ప్రస్తుత ధరలకు అనుగుణంగా రేట్లు ఇవ్వకుండా, గతం కంటే కమీషన్ మాత్రం పెంచుకుని, డ్రైవర్స్‌ను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం గిగ్ అండ్ ప్లాట్‌ఫారం వర్కర్స్ సంక్షేమానికి చట్టం చేసి, దానికి రూల్స్ రూపొందించకుండా, నిర్లక్ష్యం వహిస్తోందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి, ఆ చట్టానికి రూల్స్ రూపొందించి, అసెంబ్లీలో ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు కూర్చున్న పోర్టర్ కమిటీ ప్రతినిధులతో చర్చలు జరపాలని, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. శ్రీకాంత్ మాట్లాడుతూ తక్షణమే పోర్టర్ మేనేజ్మెంట్ స్పందించి, చర్యలు తీసుకోవాలని లేనిపక్షం ఏప్రిల్ 6న పోర్టర్ డ్రైవర్స్ చేసే సమ్మెకు సీఐటియూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. మోటార్ వాహన అగ్రిగేటర్ల మార్గదర్శకాల చట్టం 2025 ప్రకారం పోర్టర్ సంస్థలు తమ డ్రైవర్లకు ఐదు లక్షల నరపమాద భీమా మరియు జీవిత భీమా కల్పించాలని, ఆర్డర్‌లు రద్దు చేసే హక్కు డ్రైవర్లకు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో ప్రెసిడెంట్ కే.అజయ్‌బాబు, కమిటీ ఉపాధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మునీర్, కే.సతీష్, శ్రీకాంత్ రెడ్డి, ఏడుకొండలు, పి.దేవా, లక్ష్మీకాంత్‌రెడ్డి, హరిదాస్, రామాంజనేయులు, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమెది గురి తప్పని లక్ష్యం



పిల్లలకు విలువిద్యలో శిక్షణ ఇప్పిస్తామనుకున్నారామె. ఈ కారణంగా తాను కూడా ప్రేమలో పడ్డారు. ఉద్యోగం చేస్తూనే సాధన చేస్తున్నారు. పాతకాలనీ కొల్లగొడుతున్నారు. దొంత రాజేశ్వరి.

జగిత్యాల వెల్గటూరు తాజాగా జిల్లా శాఖలో పరిశీలకురాలు (ఆస్ఐ)గా చేస్తున్నారు రాజేశ్వరి. 2016లో అప్పటి పోలీస్ కమిషనర్ కరీంనగర్‌లో ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని కలిగి ఉంది. ఆమె భర్త కిషన్కి ఆర్చరీలో ప్రావీణ్యం ఉంది. దీనితో పిల్లలకీ దానిలో శిక్షణ ఇప్పించాలనుకున్నారామె. రోజూ వాళ్లను సాధనకు తీసుకెళ్లే ఆమె కూడా దానిపై ఆసక్తిని పెంచుకున్నారు. భర్త ప్రోత్సహించడంతో నేర్చుకోవడమే కాదు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొంటున్నారు. నేర్చుకోవడం ప్రారంభించిన అదే ఏడాదిలో తెలంగాణ మాస్టర్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల ఇండియన్ బో, కాంపౌండ్ బో విభాగంలో స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. భర్తతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ పోటీపడి కాంస్యం అందుకున్నాడు. తరవాత గోవా, కేరళ, హైదరాబాద్ సహా మరెన్నో చోట్ల జరిగిన జాతీయస్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించారు రాజేశ్వరి. అంతర్జాతీయ స్థాయిలో దక్షి ణ కొరియాలో జరిగిన ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్ లో పోటీ పడ్డారు.

తరవాత అమెరికా, తైపీల్లో జరిగిన పోటీలకు అర్హత సాధించలేకపోయారు. తాజాగా అబుదాబిలో జరిగిన ఓపెన్ మాస్టర్ గేమ్స్ 2028 లో 50 ఏళ్ల వయస్సు పోటీపడ్డారామె కాంపౌండ్ బో 50 మీటర్ల ఆర్చరీ కేటగిరీలో 148 దేశాలు క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలో కాంస్య గెలుచుకున్నారు. ప్రతిరోజూ ఉదయం రెండు గంటలు తప్పక సాధన చేస్తా. పాప ఇంటర్, బాబు పదోతరగతి చదువుతున్నారు. వాళ్ల చదువులు, ఇంటి బాధ్యత, ఉద్యోగం సమన్వయం చేసుకుంటూనే ఆర్చరీలోనూ రాణిసునతన్నా. ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే క్రీడల్లోనే కాదు జీవితం లోనూ లక్ష్యాలు సాధించవచ్చు. అంటారు రాజేశ్వరి. ◻

# పేద మహిళల కోసం..

వింటీ సహాయానికి శిక్షణ ఇవ్వండి నెలసరి, ఆ సమయంలో వాడే ఉత్పత్తులు, శుభ్రత వంటివాటిపై ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో అవగాహన లేదు. ఇలాంటి వాళ్లకి సాయపడు తోంది పింక్ బ్రిగేడ్. డాక్టర్ సరితా సుబ్రహ్మణ్యం పాతికేళ్ల వైద్య రంగంలో సేవలు అందించాక సామాజిక సేవలోకి అడుగుపెట్టాలన్నారు. అలా 2017లో స్థాపించిన సంస్థ ఎర్త్ బ్రిగేడ్ ఫౌండేషన్, ఈమెది ముంబయి. ఈ సంస్థ ద్వారా వన్య ప్రాణులు, సంరక్షణ సంరక్షణ, అక్కడి ప్రజలకు నైపుణ్య శిక్షణ వంటివెన్నో చేసేవారు. ఈ కోరనే గిరిజనులు, మారుమూల పల్లెల్లోని అమ్మాయిల కష్టాలను గమనించాక 'పింక్ బ్రిగేడ్' విభాగాన్ని గుర్తించారు. దీనిద్వారా నెలసరి, ఆ సమయంలో శుభ్రతపై అవగాహన కల్పించడంతోపాటు త్వరగా భూమిలో కలిసిపోయే నెలసరి ఉత్పత్తులు, లోదుస్తులనీ ఉచితంగా అందిస్తారు. గిరిజనులకే కాదు... ప్రకృతి విపత్తులు



సంభవించిన ప్రాంతాలకూ వీరి సేవలు అందుతున్నాయి. ఈ శాఖ సాయంతో నిత్యా వసర వస్తువులు అందించారు. బాలికలు, మహిళలకు ప్రాథమిక విద్యతో పాటు తమ హక్కులూ ఉన్నాయి. ఇంకా ఎన్నో ప్రోగ్రాములను చేశారు. అవసరమైన ఫండి అందించారు. వాటిలో 'వీవింగ్ డ్రీమ్స్' ఒకటి. దీనిద్వారా నేతపై జీవనం సాగించే మహిళలకు అండగా నిలుస్తున్నారు. మగ్గాలు, డిజైనింగ్‌లో సాయం అందించడమే కాదు. వారి ఉత్పత్తులను మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. అందువల్ల వారి కళ అంతరించి పోకుండా చూడటమే కాదు ఆర్థికంగా నిలదొక్కుకు నేలానూ చేస్తున్నారు. ◻



ఎండలు మండిపోతున్నాయ్ ! ఈ తరుణంలో వేడిని తరిమికొట్టి, శరీరానికి చలువనిచ్చే ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోవడం మామూలే. మరి, డ్రింక్స్ విషయానికొస్తే.. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకురసం.. వంటివి తీసుకుంటుంటాం.

# ఈ డ్రింక్‌తో వేడిని తరిమేయండి !

అయితే వీటితో పాటు ఇంట్లోనే సులభంగా తయారుచేసుకోగలిగే, తక్షణమే శరీరానికి చల్లదనాన్ని అందించే పుదీనా జల్ జీరా డ్రింక్‌ని మీరెప్పుడైనా ట్రై చేశారా? మరింకెందుకాలస్యం..

**దాన్నెలా తయారుచేయాలో తెలుసుకుందాం..**

కావాల్సినవి : పుదీనా ఆకులు-అర కప్పు, నిమ్మరసం-6 టేబుల్ స్పూన్లు, నల్ల ఉప్పు-2 టీ స్పూన్లు, నీళ్లు-8 కప్పులు, జీలకర్ర-2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర - అర కప్పు, అల్లం తురుము- 2 టేబుల్ స్పూన్లు, చక్కెర-4 టేబుల్ స్పూన్లు, చింత పండు గుజ్జు - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- టీ స్పూన్, ఐసు ముక్కలు - సర్వింగ్స్‌కి సరిపడా

**తయారీ :** ముందుగా పుదీనా, కొత్తిమీర శుభ్రంగా కడిగి, సన్నగా తరుక్కోవాలి. వీటన్నింటినీ ఒక బౌల్‌లోకి తీసుకొని, అందులో చింతపండు గుజ్జు, వేయించిన జీలకర్ర, అల్లం తురుము వేసి బాగా కలుపుకోవాలి. వీటిని మిక్సీ జార్‌లోకి తీసుకొని, అందులో ఉప్పు, నల్ల ఉప్పు, చక్కెర, నిమ్మరసం, నాలుగు కప్పుల నీళ్లు పోసి పదార్థాలన్నీ బాగా బ్లెండ్ అయ్యేలా.. జ్యూస్ లాగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమానినన ఒక బౌల్‌లో వడకట్టుకొని మిగిలిన పిప్పిని పడేయాలి. ఈ రసంలో మిగతా నాలుగు కప్పుల నీళ్లు కూడా పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసుల్లో పోసుకొని.. ఐస్ క్యూబ్స్ వేసి, నిమ్మచెక్కలు-పుదీనాతో గార్నిష్ చేసుకొని, సర్వ్ చేస్తే ఎంతో రుచిగా, చల్లచల్లగా ఉండే పుదీనా జల్ జీరా డ్రింక్ సిద్ధం. ◻

# సనాతన ధర్మ సంరక్షకుడు



దేవుడిపై విశ్వాసం లోపించి, సనాతన ధర్మానికి హాని కలుగుతున్న సమయంలో ఆదిశంకరులు అవతరించి వైదిక సంప్రదాయాన్ని పునరుజ్జీవింపజేశారు. ఆయన అద్వైత సిద్ధాంతాన్ని బోధించారు. జీవుడికి, దేవుడికి భేదం లేదని ప్రతిపాదించారు. ఏకసంధాగ్రాహి అయిన శంకరులు బాల్యంలోనే సమస్త విద్యలూ అభ్యసించారు. తండ్రి చిన్ననాడే దూరమైనా తనను కంటికి రెప్పలా కాపాడుకున్న తల్లిని ప్రాణప్రదంగా చూసుకున్నారు. సన్యాసి అయినా మాతృమూర్తి కడపటి క్షణాల్లో చెంతనే ఉన్నారు. అంతిమ సంస్కారాలు చేసి ఆమె రుణం తీర్చుకున్నారు. శంకరాచార్యులు గోవింద భగవత్పాదులకు శిష్యరికం చేశారు. వారి ఆదేశం మేరకు బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానం రాసేందుకు కాశీకి వెళ్లారు. తర్వాత బదరీనాథ్కు ప్రయాణమయ్యారు. అక్కడ పన్నెండు సంవత్సరాలు ఉండి ఉపనిషత్తులు, భగవద్గీతకు వ్యాఖ్యానం రచించారు. శాఖోపశాఖలుగా చీలిపోయిన భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను క్రోడీకరించి, ఆదిశంకరులు ఆరుగురు ఆరాధన మార్గాలను ఏర్పరిచారు. షణ్మత స్థాపనాచార్యుడిగా జగత్ ప్రసిద్ధులయ్యారు. ప్రస్తుతం ఉన్న షోడశోపచార పూజావిధానం, క్షుద్ర తాంత్రిక విధానాల్లో ఉపయోగించే శ్రీచక్రాన్ని ప్రసాదించినవారు ఆదిశంకరులే! అలాగే సకల దేవతామూర్తులకు సంబంధించిన స్తోత్రాలను మానవాళికి అందించిన ఘనత కూడా ఆ జగద్గురువుదే! ఆసేతు హిమాచలం పాదచారులై ఉండి వైదికమత ప్రాశస్త్యాన్ని చాటారు. దేశం నలు దిక్కులా నాలుగు మఠాలను స్థాపించారు. అందుకే 'శ్రీశంకరాచార్యుల రచనలు అధునాతన ప్రపంచంలో అద్భుతసృష్టికి నిదర్శనాలు, మనదేశ పవిత్రను, పూర్వవైభవాన్ని పునరుద్ధరించిన మహానుభావుడు ఆదిశంకరులు' అని కొనియాడారు స్వామి వివేకానంద. ◻

# అమ్మాయిలు సన్నబడాలంటే ..

బరువు పెరుగుతున్నామనుకుని తిండిమానే యడం, అసలు ఆరోగ్యాన్ని



పట్టించు కోకుండా కనిపించిందల్లా తినడం రెండూ పొరపాటే. అమ్మాయిలు సాధారణంగా పని ఒత్తిడిలో చేసే పనులే ఇవి. నిజానికి సన్నబడాలంటే సమతులాహారం తీసుకోవాలి. సన్నబడాలనుకున్నప్పుడు అసలు కొవ్వుల అవసరమే ఉండదనుకోవడం, అవి లేని పదార్థాలను మాత్రమే తీసుకోవడం పొరబాటు. శరీర వ్యవస్థలు, హార్మోన్ల పనితీరు సరిగ్గా సాగిపోవాలంటే డైటరీ ఫ్యాట్‌ల అవసరం ఎక్కువే. లేదంటే నెలసరి ఇబ్బందులు తప్పక పోవచ్చు. పైగా ఆకలి అదుపు చేసుకోవలేక పోవచ్చు. మేలైన కొవ్వులు అందేలా గుడ్లు, పప్పు ధాన్యాలు, అవి సెగింజలు, చేపలు వంటివి తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. మనం తీసుకునే ఆహారం ద్వారా అందే పిండి పదార్థాలు గ్లూకోజ్‌గా మార తాయి. ఇవి చక్కెరల్లా పని చేయడం వల్ల బరువూ పెరుగుతారు. ఆ పరిస్థితి ఎదురు కాకుండా ఉండా లంటే సంక్లిష్ట పిండి పదార్థాలున్న ఆహారాన్ని ఎంచుకోవాలి. బదులుగా సాధారణ బియ్యాన్ని తగ్గిస్తూనే, బ్రౌన్‌రైస్‌ని ఎంచుకోవాలి. రాగులు, కొర్రలు, జొన్నలు వంటి చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాటివల్ల తగినంత పీచూ అంది జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆకు కూరలు, కాయగూరలను సమ ప్రాధాన్యంతో ఎప్పుడో ఒకసారి కాకుండా తీసుకునే ప్రతి భోజనంలో భాగం చేసుకోవాలి. కాయగూరల్లో ఉండే విటమిన్లు శరీరానికి మేలు చేయడమే కాదు. పీచునూ అందిస్తాయి. పొట్ట నిండేలా చేసి, ఆకలినీ తగ్గిస్తాయి. అందుకే కీరదోస, క్యారెట్, టొమాటో, ఉల్లిపాయ, బీట్‌రూట్, క్యాబేజీలతో పాటు ఆకుపచ్చని ఆకుకూరలు పాలకూర, మెంతి కూర, తోటకూర, కరివేపాకు వంటి వాటికి తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలి. ◻

# సేమ్యా ఫ్రూట్ కస్టర్డ్!



**కావలసిన పదార్థాలు:** సేమ్యా: కప్పు
నెయ్యి: ఒక స్పూను పాలు: నాలుగు కప్పులు
చక్కెర: ఒకటిన్నర కప్పు కస్టర్డ్ పౌడర్: రెండు టేబుల్ స్పూన్లుకాజు, బాదం: అరకప్పు పండ్లముక్కలు: యాపిల్, అరటి పండు, దానిమ్మ గింజలు రెండు కప్పులు

**తయారీ విధానం:** ముందుగా బాణలి వేడిచేసి.. కొద్దిగా నెయ్యి వేసి సేమ్యా వేయించుకోవాలి. గిన్నెలో మూడు కప్పుల పాలు పోసి సేమ్యాను ఉడికించాలి. కాస్త ఉడికాక చక్కెరను కూడా కలుపుకోవాలి. మరో కప్పు పాలు విడిగా తీసుకుని కస్టర్డ్ పౌడర్‌ను అందులో వేసి ఉండలు లేకుండా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని సేమ్యాలో పోయాలి. ఒక అయిదు నిమిషాలు ఉంచి కాస్త చిక్కబడ్డాక పొయ్యి మీద నుంచి దింపేయాలి. కాజు, బాదంపప్పులను ముక్కలుగా చేసి పెట్టు కోవాలి. అలాగే దానిమ్మ గింజలు ఒలిచి, మిగతా పండ్లను సన్నని ముక్కలుగా చేసిపెట్టుకోవాలి. ఈ తరిగిన పండ్లు, డ్రైఫ్రూట్స్‌ను చల్లారిన సేమ్యాలో వేసి కలపాలి. దీన్ని ఒక గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టుకుంటే తియ్యతియ్యగా, చల్లచల్లగా ఉండే సేమ్యా కస్టర్డ్‌ను ఆరగించేయొచ్చు! ◻

# కళ్లు మూస్తే మర్చిపోం..



మనలో చాలామంది ఏదో ధ్యాసలో పడి కొన్ని విషయాలను మర్చిపోతుంటాం. తిరిగి ఎంత ప్రయత్నించినా గుర్తు రాదు. అయితే 15 నిమిసాలు కల్లు మూసుకోండి. అదే గుర్తొస్తుంది. ఎల అంటారా.. లీగల్ అండక్రిమినాలజీ సైకాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం కొన్ని నేరాలు జరిగినప్పుడు దానికి సంబంధించిన ప్రత్యేక్ష సాక్షులు ఏదైనా విషయం మర్చిపోతే దానిని గుర్తు చేసుకోవ డానికి ఒక సారి కళ్లు మూసుకుంటారట. అప్పుడు మరింత సమాచారాన్ని గుర్తు తెచ్చు కుంటారని పరిశోధనల్లో తేలింది. కాబట్టి, ఇకపై ఏదైనామర్చి పోయినప్పుడు ప్రశాంతంగా కళ్లు మూసుకొని ఆలోచించండిచాలు. ఠక్కున గుర్తొచ్చేస్తాయి. ◻

తెర

# 'దీవాన' నుంచి 'ఇది ప్రేమ' సాంగ్ రిలీజ్



'దీవాన' నుంచి ఇది ప్రేమ సాంగ్ రిలీజ్.. సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో అతిథులుగా పాల్గొన్న ప్రముఖ దర్శకులు వెంకీ అట్లూరి, రవికిరణ్ కోలా, నందినీరెడ్డి..శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. స్నేహ మణిమేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. 'దీవాన' సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈరోజు ఈ చిత్రం నుంచి ఇది ప్రేమ సాంగ్ ను స్టార్ హీరోయిన్ సమంత చేతుల మీదుగా సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. కొరియోగ్రాఫర్ కృష్ణ మాట్లాడుతూ నేను చాలా రియాల్టీ షోస్ లో కొరియోగ్రాఫర్ గా పనిచేశాను. ఈ చిత్రంలో కొరియోగ్రఫీ చేసే అవకాశం మా డైరెక్టర్ శ్రీకాంత్ కల్పించారు. మ్యూజిక్ డైరెక్టర్ ఈశ్వర్ చంద్ మాట్లాడుతూ నేను రెహమాన్ గారి మ్యూజిక్ స్కూల్‌లో చదివాను. ఇది నా ఫస్ట్ మూవీ. అన్నారు.ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూ నందినీరెడ్డి నేను ప్రొడ్యూసర్ కావాలని బాగా ఎంకరేజ్ చేశారు. అలాగే అల్లు అరవింద్ గారు, విద్య అక్కకు థ్యాంక్స్ చెబుతున్నా. వాళ్లు నాకు ఎంతో సపోర్ట్ అందించారు.

# 'రాకాస' థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్‌చిత్రం: మానస శర్మ



జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా అందరినీ ఆకట్టుకుంది.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?..**
మానస శర్మ : మాది శ్రీకాకుళం. నేను మొదటగా యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' చేశాను. ఆ తరువాత 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి క్రియేటర్, రైటర్‌గా పని చేశాను. ఆ తరువాత 'బెంచ్ లైఫ్' సిరీస్‌ని చేశాను.

**'రాకాస'లో ప్రధాన అంశం ఏంటి?..**
మానస శర్మ : 'రాకాస'ని ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్లో తీశాం. ఇప్పటికే అందరూ మా టీజర్‌ని చూసి ఉంటారు. త్వరలోనే ట్రైలర్ రానుంది.

**సంగీత్ శోభన్ ఈ కథలోకి ఎలా వచ్చారు?..**
మానస శర్మ : 'రాకాస' కథని ముందుగా నెట్ ఫ్లిక్స్‌లో సిరీస్ కోసం చెప్పాను. ఆ టైంలోనే ఈ కథను సంగీత్ విన్నారు. ఆయనకి కూడా కథ చాలా నచ్చింది.

**'రాకాస' చిత్రీకరణలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?..**
మానస శర్మ : వెబ్ సిరీస్‌కి, సినిమాకి ఒకే రకమైన ఛాలెంజ్ ఉంటుంది. మేకింగ్ ఒకేలా ఉంటుంది.. రైటింగ్‌లోనే తేడా ఉంటుంది. షూటింగ్ పరంగా, చిత్రీకరణ సమయంలో ఎలాంటి తేడాలుండవు. ఈ సినిమా అవుట్ పుట్ నిహారిక గారికి నచ్చాలని నేను మరింత బాధ్యతగా పని చేశాను.

# 'ధురందర్' ఆల్ టైం గ్లోబల్ రికార్డ్



ప్రపంచవ్యాప్తంగా ..761 కోట్లు దాటిన 'ధురందర్ ది రివెంజ్' ఆల్ టైం బిగ్గెస్ట్ ఇండియన్ బ్లాక్‌బస్టర్, ఇండియా, విదేశాలలో కొత్త బెంచ్ మార్క్‌లను నెలకొల్పిన ధురందర్ ది రివెంజ్ జియో స్టూడియోస్ బి62 స్టూడియోస్ నిర్మాణంలో ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ధురంధర్ రివెంజ్, బాక్స్ ఆఫీస్ చరిత్రను తిరగరాసింది. ఇది ఆల్ టైం గ్లోబల్ ఇండియన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, అపూర్వ మైన ఓపెనింగ్ వీకెండ్‌ను అందించి, ప్రపంచ వ్యాప్తంగా కొత్త రికార్డులను నెలకొల్పింది. అసాధారణమైన అడ్వాన్స్ బుకింగ్‌లు, అన్ని సర్క్యూట్‌లలో హౌస్‌ఫుల్ అయిన షోలు, ఈ ఫ్రాంచైజీ తదుపరి భాగం కోసం ఉన్న అసాధారణమైన అంచనాల కారణంగా, ఈ చిత్రం దేశీయంగా, విదేశాలలో ఆల్ టైం అత్యధిక వసూళ్లను సాధించింది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఒక భారతీయ చిత్రానికి ఇదే అతిపెద్ద ఓపెనింగ్ వీకెండ్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా బిగ్గెస్ట్ హిందీ బ్లాక్‌బస్టర్ అయిన 'ధురందర్' సాధించిన అద్భుతమైన విజయ పరంపరను కొనసాగిస్తూ, ఈ సీక్వెల్ ఫ్రాంచైజీని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లింది. అత్యధిక పెయిడ్ ప్రివ్యూలు, అతిపెద్ద ఓపెనింగ్ డే, అతిపెద్ద శనివారం, అతిపెద్ద ఆదివారం,ప్రపంచవ్యాప్తంగా ఏ భారతీయ చిత్రానికైనా అత్యధిక ఓపెనింగ్ వీకెండ్ వసూళ్లతో ఇది చరిత్ర సృష్టించింది. కేవలం ఓపెనింగ్ వీకెండ్‌లోనే ప్రపంచవ్యాప్తంగా ..761 కోట్ల భారీ వసూళ్లతో, ధురందర్ రివెంజ్ ప్రపంచ వేదికపై భారతీయ సినిమాకు ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది.

# మైత్రీ మూవీ మేకర్స్, # సూరి 07, # మైత్రీ తమిళ్ 03 అనౌన్స్‌మెంట్



భారతదేశంలో విభిన్న భాషల్లో లార్జర్ దెన్ లైఫ్ చిత్రాలని రూపొందించడంలో పేరుగాంచిన మోస్ట్ డైనమిక్ నిర్మాణ సంస్థలలో ఒకటైన మైత్రి మూవీ మేకర్స్ తమ మూడవ తమిళ చిత్రం మైత్రి తమిళ్03ను అనౌన్స్ చేసింది. ఈ చిత్రంలో కోలీవుడ్ టాలెంటెడ్ సూరి హీరోగా నటిస్తుండగా, దర్శకుడు ఆర్ రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇన్‌టెన్స్‌గా, విజువల్‌గా ఆకట్టుకుంది. పోస్టర్‌లో హీరో వెనుక నుంచి కనిపిస్తూ, మురికిగా ఉన్న వరద నీటిలో నడుము వరకు నిలబడి ఉంటాడు. అతని ప్రతిబింబం నీటిలో కనిపిస్తూ ఒక స్యూరియల్ ఫీల్ ఇస్తోంది. కుడిచేతిలో ఆయుధం పట్టుకుని ఉండటం ప్రమాదం, నీటిలో కనిపించే ప్రతిబింబం పైన BLOOD FOLLOWED THE FLOOD## అనే వాక్యం ఉండటం కథలో హింస, భావోద్వేగాలను సూచిస్తోంది. పోస్టర్ మిస్టీరియస్‌గా, టెన్షన్‌తో నిండి ఉండటంతో సినిమా పై ఆసక్తి పెంచుతోంది.

# బైకర్ ట్రైలర్ పై ప్రశంసలు కురిపించిన రెబల్ స్టార్ ప్రభాస్



రెబల్ స్టార్ ప్రభాస్, చార్మింగ్ స్టార్ శర్వా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ బైకర్ ట్రైలర్‌పై ప్రశంసలు కురిపించడం సినిమాపై మరింత బజ్ పెం చింది. తాజాగా విడుదలైన ఈ థియేట్రికల్ ట్రైలర్ థియేటర్లలో ప్రీమియర్ అవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. విజువల్ ప్రెజెంటేషన్, ఎమోషనల్ డెప్త్, టెక్నికల్ క్వాలిటీ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ట్రైలర్ చూసిన ప్రబాస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ట్రైలర్ వైబ్ చాలా నచ్చింది.. చాలా ఎంగేజింగ్‌గా ఉంది. శర్వా, గీజు Creations, మొత్తం టీమ్‌కు ఆల్ ది బెస్ట్. ఏప్రిల్ 3న భారీ సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను". ప్రభాస్ నుంచి అభినందనలు రావడంతో సినిమాపై ఉన్న హైప్ మరింత పెరిగింది. ఈ ట్రైలర్‌లో స్పోర్ట్స్ డ్రామా ఎనర్జీ, ఎమోషనల్ ఎలిమెంట్స్, రగ్డ్ విజువల్ టోన్.. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. దర్శకుడు అభిలాష్ రెడ్డి కథని అద్భుతంగా ప్రెజెంట్ చేసిన తీరు ప్రత్యేకంగా ప్రశంసలు అందుకుంటోంది. బైకర్‌లో శర్వా మోటార్‌సైకిల్ రేసర్‌గా ఒక ఎనర్జిటిక్, ఇంటెన్స్ పాత్రలో కనిపించబోతు న్నారు. సీనియర్ నటుడు రాజశేఖర్ కథలో భావోద్వేగాన్ని నడిపించే కీలక పాత్రలో నటిస్తున్నారు. హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తోంది. బైకర్ చిత్రం ఏప్రిల్ 3న థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంది.

# 'డెకాయిట్' సెకండ్ సింగిల్ 28న రిలీజ్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ 'రుబారు'. అన్నీ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. డెకాయిట్ సెకండ్ సింగిల్ చిచ్చుబుడ్డి మార్చి 28న రిలీజ్ కానుంది. ఇది అదిరిపోయే డాన్సింగ్ నెంబరు. ఈ పాట కోసం చార్ట్ బస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్లో అడివి శేష్ డాన్సింగ్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్ గా ఉండబోతున్నాయి. ఈ మూవీని ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న 'డెకాయిట్'కి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ దనుష్ భాస్కర్ రగ్డ్ విజువల్స్‌ను అంది స్తుండగా, భీమ్స్ సిసిరోలియో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది. ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతున్న 'డెకాయిట్' లవ్, హార్ట్‌బ్రేక్, అద్భుతమైన యాక్షన్‌తో ఆడియన్స్‌కి సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.




## సన్ రైజర్స్ జట్టులోకి కొత్త ముఖం

**హైదరాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ దగ్గరి కొచ్చింది. ఈ నెల 28న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరుగనుంది. ఈ ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌కు బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా నిలవనుంది. 10 జట్లు తమ సన్నాహకాల్లో నిమగ్నం అయ్యాయి. ప్లేయర్లందరూ తమ జట్లతో కలుస్తున్నారు. ముమ్మరంగా ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక మార్పు చేసింది. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయం కారణంగా ఈ సీజన్‌కు దూరం కావడంతో.. అతని స్థానంలో ఇంగ్లాండ్ బౌలర్ డేవిడ్ పేయిన్‌ను జట్టులోకి తీసుకుంది. ఎడ్వర్డ్స్‌ను వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు కోట్ల రూపాయలకు దక్కించుకోగా.. 35 సంవత్సరాల డేవిడ్ పేయిన్‌ను అందులో సగం మొత్తానికి అంటే కోటిన్నరకు కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది.

ఇంగ్లండ్ లెఫ్టార్మ్ పేసర్ డేవిడ్ పేయిన్...ఇంగ్లాండ్ తరపున ఒక వన్డే మాత్రమే ఆడాడు. టీ20 మ్యాచ్ లపై అతనికి పట్టు ఉంది. 233 టీ20 మ్యాచ్‌లలో 21.16 సగటుతో 304 వికెట్లు పడగొట్టాడు. గ్లౌసెస్టర్‌షైర్‌కు టీ20 క్రికెట్‌లో టాప్ వికెట్ టేకర్ అయిన పేయిన్ 2024 టీ20 బ్లాస్ట్ టోర్నమెంట్‌లో 17 ఇన్నింగ్స్‌లలో 33 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. బిగ్ బాష్ లీగ్, ది హాండ్రడ్, ఇంటర్నేషనల్ టీ20 లీగ్, సౌతాఫ్రికా టీ20 వంటి ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్స్‌లో ఆడిన అనుభవం అతడికి ఉంది. ఈ క్రమంలోనే అతడిని ఆరెంజ్ ఆర్మీ జట్టులోకి తీసుకుంది. డేవిడ్ పెయిన్‌కు ఇది తొలి ఐపీఎల్. భారత్‌కు తొలిసారి వస్తున్నాడు. అతడి రాకతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం పటిష్టం కానుంది. ఎషాన్ మలింగ, జయదేవ్ ఉనద్కట్‌తో పేయిన్ బంతిని పంచుకోనున్నాడు. కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ కూడా ఫిట్‌నెస్ సాధిస్తే ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్‌కు ఇక తిరుగులేనట్లే.

## భారత్ టెన్నిస్ జట్టుకు సహజ, రష్మిక ఎంపిక

**హైదరాబాద్:** బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో పోటీపడే భారత మహిళల టెన్నిస్ జట్టును ప్రకటించారు. తెలంగాణకు చెందిన భారత నంబర్‌వన్ సహజ యామలపల్లి, భారత ఐదో ర్యాంకర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన ఐటీఎఫ్-100 టోర్నీలో ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచిన మహారాష్ట్ర ప్లేయర్ వైష్ణవి అడ్కర్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. 391వ ర్యాంక్‌తో సహజ భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతుండగా... వైష్ణవి 397వ ర్యాంక్‌తో రెండో ర్యాంకర్‌గా నిలిచింది. వీరితో పాటు రుతుజా భోస్లే, అంకిత రైనా కూడా భారత జట్టులో ఉన్నారు. వైదేహి చౌధరీని రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. కెప్టెన్‌గా విశాల్ ఉప్పల్, కోచ్‌గా రాధిక కనిట్కర్ ఏప్రిల్ 7 నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో ఈ టోర్నీ జరుగుతుంది.

## రాజస్థాన్ రాయల్స్‌కు భారీ డీల్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ చరిత్రలో భారీ డీల్ కుదిరింది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని అమెరికా వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం రూ.15 వేల కోట్లతో దక్కించుకున్నారు. ఇప్పటికే ఇరువర్గాల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయని, 2026 ఐపీఎల్ సీజన్ తర్వాత కొత్త యజమానులకు ఈ ఫ్రాంచైజీ అప్పగించనున్నారని తెలుస్తోంది. చివరిదాకా పోటీపడిన టైమ్స్ గ్రూపుకంటే ఎక్కువ ధరతో సోమానీ... రాజస్థాన్ రాయల్స్‌ను దక్కించుకున్నాడు. ఫ్రాంచైజీకి చెందిన వంద శాతం షేర్లు కొన్న సమానీ 19వ సీజన్ నుంచి రాజస్థాన్ యజమాని హోదాలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నాడు. ఈ సోమానీ.. ఇంట్రా ఎడ్జ్, ట్రుయో, ట్రుయో ఏఐ, అకాడెమియన్ సంస్థల వ్యవస్థాపకుడు. ఇక కన్సార్టియంలో అమెరికా వ్యాపారవేత్త రాబ్ వాల్టన్ కూడా ఉన్నారు. ప్రముఖ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్‌కు ఆయన ఛైర్మన్‌గా వ్యవహరించారు. అగ్రరాజ్యానికే చెందిన మరో వ్యాపార కుటుంబం హాంప్ ఫ్యామిలీ కూడా ఈ గ్రూప్‌లో భాగం. కాగా.. ఫ్రాంచైజీలను అమ్మాలని రాయల్స్, ఆర్సీబీ కొంతకాలం క్రితం నిర్ణయించాయి.




# కోహ్లి దండయాత్రకు పరీక్ష

### టాప్ క్లాస్ బ్యాటింగ్ ○ బౌలింగ్ యావరేజ్ ○ఆర్సీబీ కప్ నిలబెట్టుకునేనా?

ఇండియన్ కాసుల క్రికెట్-ఐపీఎల్ అనగానే ముందుగా గుర్తొచ్చేది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. టాప్ త్రీ మేటి జట్లలో ఒకటి. ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లి స్టార్ డమ్.. ఆర్సీబీకి పెద్ద ప్లస్. ఐపీఎల్ ఆరంభం నుంచి స్టార్ ప్లేయర్లతో కూడిన ఆర్సీబీ భారీ అంచనాలతో బరిలోకి దిగినా స్థిరమైన ఆటతీరు లేకపోవడంతో ఐపీఎల్ కప్ కొట్టేందుకు 2025కు ఆగాల్సి వచ్చింది. ఈ సారి డిపెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్న ఆర్సీబీపై భారీ అంచనాలు ఉన్నాయి. రజత్ పాటిదార్ నేతృత్వంలోని ఆర్సీబీ కోర్ ప్లేయర్లతో బరిలోకి దిగుతోంది. విరాట్ కోహ్లి, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్, దేవ్‌దత్ పడిక్కల్ రూపంలో బలమైన బ్యాటింగ్... భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ వంటి అనుభవజ్ఞులైన పేసర్లు ప్రధాన బలాలు. ఛాంపియన్ హోదా వల్ల వచ్చే ఒత్తిడికి తోడు కొంతమంది కీలక ఆటగాళ్ల ఫిట్ నెస్ సమస్యలు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్‌కు సవాళ్లుగా మారాయి.

(వార్త క్రీడా విభాగం)

ఆర్సీబీ.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు స్టార్ హంగులు ఉన్నాయి. ప్రతి సీజన్‌లో హాట్ ఫెవరేట్ అయిన ఆర్సీబీ గత ఏడాదే కప్ అందుకుంది. 2009, 2011, 2016లో ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు కప్ కొరత తీర్చుకున్న ఆర్సీబీ..డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతున్నది. ఈసారి కూడా టైటిల్ నిలుపుకోవాలని పట్టుదలతో ఉంది. అయితే, ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే కీలక ఆటగాళ్లు గాయాల పాలవడం ఆర్సీబీని కలవరపెడుతోంది.

**విధ్వంసక బ్యాటర్లు**

2025 విజేత జట్టులోని 17 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడం వల్ల జట్టులో ఆత్మ విశ్వాసం, అవగాహన ఎక్కువ. కింగ్ కాంగ్ విరాట్ కోహ్లితో పాటు ఫిల్ సాల్ట్, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్ వంటి విధ్వంసకర బ్యాటర్లు ఉన్నారు. ఓపెనర్లుగా విరాట్ కోహ్లి, ఫిల్ సాల్ట్ విధ్వంసం సృష్టించడానికి సిద్ధంగా ఉన్నారు. మిడిల్ ఆర్డర్‌లో రజత్ పాటీదార్, దేవదత్ పడిక్కల్, వెంకటేష్ అయ్యర్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటం జట్టుకు కొండంత అండ. వికెట్ కీపర్ కమ్ మ్యాచ్ ఫినిషర్ జితేష్ శర్మ అందుబాటులో ఉండగా.. టీమ్ డేవిడ్, రోమారియో షెఫర్డ్ వంటి పవర్ హిట్టర్లు లోయర్ ఆర్డర్‌లో మెరుపులు మెరిపించగలరు.

బౌలింగ్‌లో ఫిట్‌నెస్ కష్టాలుబ్యాటింగ్ పరంగా ఆర్సీబీ పటిష్టంగా ఉన్నా... బౌలింగ్ విభాగం కలవరపరుస్తోంది. భువనేశ్వర్ కుమార్, జోష్ హాజిల్‌వుడ్ రూపంలో మంచి పేస్ అటాక్ ఉన్నా... గాయంతో హాజిల్‌వుడ్ కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. డెత్ ఓవర్ స్పెషలిస్ట్ నువాన్ తుషారా, యష్ దయాల్ వ్యక్తిగత కారణాల వల్ల జట్టుకు దూరం కావడం పెద్ద లోటు. దీంతో పేస్ విభాగం మొత్తం భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ చుట్టూ తిరుగుతోంది.

**టాప్ స్పిన్నర్ లేని లోటు**

కృనాల్ పాండ్యా, టిమ్ డేవిడ్, జాకబ్ బెతెల్, రొమారియో షెఫర్డ్ రూపంలో బెస్ట్ ఆల్‌రౌండర్లు ఆర్సీబీ సొంతం. వీరు కొంతవరకు బౌలింగ్ డిపార్ట్‌మెంట్ లోటును భర్తీ చేయగలరు. స్పెషలిస్ట్ స్పిన్నర్లు లేకపోవమే ఆర్సీబీకి లోటుగా మారింది. మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయగల వరల్డ్‌క్లాస్ స్పెషలిస్ట్ స్పిన్నర్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. కృణాల్‌పాండ్యా, సుయాష్ శర్మ ఉన్నప్పటికీ, వారు ఎంతవరకు ప్రభావం చూపుతా రనేది ప్రశ్నార్థకం. దేశవాళీ సంచలనం మంగేష్ యాదవ్ పై భారీ ఆశలు ఉన్నా, ఐపీఎల్ ఒత్తిడిని అతను ఎలా తట్టుకుంటాడనేది వేచి చూడాలి. దేశీయ యువ ఆటగాళ్లకు తమ ప్రతిభ నిరూపించుకునే గొప్ప అవకాశం ఉంది. గత సీజన్ ఫామ్‌ను కొనసాగించడం, గాయాల నుంచి బయట పడి వేగంగా కోలుకోవడంపైనే విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఒత్తిడిని అధిగమించడం కీలకం. మార్చి 28న ఆరంభ మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాద్‌తో తలపడనుంది. మొత్తానికి ఆర్సీబీ బ్యాటింగ్ విభాగంలో టాప్ క్లాస్‌గా ఉన్నా, బౌలింగ్ పరంగా యావరేజ్‌గా కనిపిస్తోంది. ఈ బలహీనతలను అధిగమించి రజత్ భాటియా సేన మరోసారి మ్యాజిక్ చేస్తుందో లేదో చూడాలి.

## యశ్ దయాళ్‌ను ఈ సీజన్‌లో ఆడించబోం: ఆర్సీబీ

**బెంగళూరు:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు కీలక ప్రకటన చేసింది. ఐపీఎల్2026లో తమ పేసర్ యశ్ దయాళ్ పాల్గొనడం లేదని తెలిపింది. వ్యక్తిగత కారణాల వల్ల అతడిని పక్కన పెట్టామని.. అయితే, కాంట్రాక్టు మాత్రం కొనసాగిస్తామని వెల్లడించింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ నెగ్గఇంది. ఆ సీజన్‌లో 13 వికెట్లు తీసి ఆర్సీబీకి కప్ అందించడంలో యశ్ దయాళ్ తన వంతు పాత్ర పోషించాడు. అనూహ్య రీతిలో యశ్ దయాళ్‌పై లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఘజియాబాద్ ఎఫ్ఐఆర్ నమోదు కాగా, పోక్సో చట్టం కింద జైపూర్‌లో మరో కేసు నమోదైంది. ఐపీఎల్ 2025 సందర్భంగానూ హోటల్ గదిలో దయాళ్ తనపై అత్యాచారానికి ఒడిగట్టాడని సదరు టీనేజర్ ఆరోపించింది. కాగా యశ్ దయాళ్‌ను కొనసాగించడంపై ఆర్సీబీపై విమర్శలు రాగా.. ఆర్సీబీ క్రికెట్ డైరెక్టర్ మొ బొబాట్ తాజాగా స్పందించాడు. యశ్ ఈసారి జట్టుతో చేరడం లేదు. వ్యక్తిగతంగా అతడు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. ఇప్పటి వరకు మేము అతడికి మద్దతుగానే నిలబడ్డామన్నాడు.



## మొదటి మ్యాచ్‌లో 11 నంబర్ జర్సీలతో ఆర్సీబీ

**బెంగళూర్:** చిన్నస్వామి స్టేడియం వేదికగా మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మొదటి మ్యాచ్‌లో ఆర్సీబీ ఆటగాళ్లు 11వ నంబర్ జెర్సీలు ధరించనున్నారు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ సీఈఓ రాజేశ్ మేనన్ వెల్లడించాడు. గత సంవత్సరం ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారికి నివాళిగా ఆర్సీబీ ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే స్టేడియంలో 11 సీట్లను వారికి గుర్తుగా రిజర్వ్ చేసి పెట్టారు. అంతర్జాతీయ మ్యాచ్‌లతో సహా, ఈ వేదికపై జరిగే అన్ని కార్యక్రమాల సమయంలో ఆ సీట్లు ఇకపై ఖాళీగా ఉంటాయని తెలుస్తోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు స్టేడియం లోపల ప్రవేశ ద్వారం దగ్గర ఒక స్మారక ఫలకాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ సీజన్‌లో ఆర్సీబీ గ్రూప్ స్టేజిలో బెంగళూరులో 5, రాయ్‌పుర్‌లో 2 మ్యాచ్‌లు ఆడనుంది. గత ఏడాది ఐపీఎల్‌లో విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టుకు విజయోత్సవ సభ నిర్వహించారు. స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతిచెందారు.

# నష్టాల నుంచి స్టాక్ మార్కెట్ల రికవరీ

**ముంబయి, మార్చి 24:** స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనుంచి మంగళవారం రికవరీ అయ్యాయి. గ్లోబల్‌సెంటిమెంట్ సానుకూలంగా మారడం, ట్రంప్ ఇరాన్‌వార్‌పై తాత్కాలిక బ్రేక్ ప్రకటించడం వంటిపరిణామాలు సూచీలను ర్యాలీ తీయించాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న విశ్వాసం ఇన్వెస్టర్లలోపెరిగింది ముడిచమురు దరలు కూడా కొంతమేర నెమ్మదించాయి. రూపాయి కూడా రికార్డు కనిష్టం నుంచి కోలుకుంది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1372.06పాయింట్లు పెరిగి 74,068 పాయింట్లకు చేరింది.

నిఫ్టీ 50 సూచీ కూడా 399.75 పాయింట్లు పెరిగి 22,912.40పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. ఒక్కరోజు మార్కెట్ల ర్యాలీలోనే సూచీలు ఆరు లక్షల కోట్ల రూపాయల మేర మార్కెట్ టర్నోవర్ పెరిగినట్లు అంచనా.




ఎల్అండ్‌టి 5.19శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.88శాతం, ఐసిఐసిబ్యాంకు2.38శాతంచొప్పున పెరిగాయి. బిఎస్‌ఇ150 మిడ్‌క్యాప్‌సూచీ 2.48 శాతం, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్‌సూచీ 2.24 శాతం చొప్పున లాభపడ్డాయి. మార్కెట్ల పరంగా బిఎస్‌ఇలో 2968 కంపెనీలషేర్లుపెరిగితే 1295 షేర్లు క్షీణించగా 180 కంపెనీల షేర్లు మాత్రం యధాతథంగా కొనసాగాయి. ఇక స్టాక్స్‌పరంగా విప్రో 0.67శాతంపెరిగింది. టిబిఒ టెక్ 3.87 శాతం, గోదావరి పవర్ అండ్ ఇస్పాత్ 4.71, కల్పతరు ప్రాజెక్టు ఇంటర్నేషనల్ 3.15 శాతం, డిసిఎక్స్‌సిస్టమ్స్ 2.14శాతం, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ 3.91శాతం పెరిగాయి. కోల్ ఇడియా 2.96శాతం క్షీణిస్తే సుజ్లాన్ ఎనర్జీ 2.73శాతం, ఎస్ఇసిపి 9.89శాతం, పెరిగాయి.

ఇక యూరోప్, ఆసియా మార్కెట్లుకూడా ముందుకు సాగడం కనిపించింది. జపాన్‌నిక్కీ 225 టాపిక్స్ సూచీలు లాభాల్లో కొనసాగాయి. అమెరికా స్టాక్స్ రాత్రికిరాత్రే ర్యాలీ తీసాయి. డౌజోన్‌నస పార్శ్యిఅమిక సగటు 631 పాయింట్లు పెరిగింది. ఎస్అండ్‌పి 500 1.15శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 1.38శాతం పెరిగాయి.

## భీమ్ యుపిఐ కొత్త ఫీచర్




**న్యూఢిల్లీ, మార్చి 24:** యూపీఐ చెల్లింపులను మరింత సులభతరం, వేగవంతం చేసే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ముందడుగు వేసింది. ఎన్‌పీసీఐకు చెందిన ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ మంగళవారం భీమ్ పేమెంట్స్ యాప్‌లో సరికొత్త బయోమెట్రిక్ అథెంటికేషన్ ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త అప్‌డేట్ ద్వారా వినియోగదారులు రూ. 5,000 వరకు జరిపే లావాదేవీలకు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర (ఫింగర్‌ప్రింట్) లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి సులభంగా ఆమోదం తెలపవచ్చు. ఈ ఫీచర్‌తో ప్రతి చిన్న లావాదేవీకి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం ఉండదు. చాలా సందర్భాల్లో పిన్ మర్చిపోవడం లేదా తప్పుగా నమోదు చేయడం వల్ల చెల్లింపులు విఫలమవుతుంటాయి. ఈ కొత్త విధానం ద్వారా అలాంటి ఇబ్బందులకు తెరపడుతుందని, చెల్లింపుల ప్రక్రియ మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఎన్‌బీఎస్ఎల్ విశ్వాసం వ్యక్తం చేసింది. స్నేహితులు, కుటుంబ సభ్యులకు డబ్బు పంపడం, షాపుల్లో క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి రోజువారీ లావాదేవీలన్నింటికీ ఈ బయోమెట్రిక్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవచ్చు. ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈవో లలితా నటరాజ్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులను సులభంగా, సురక్షితంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. వినియోగదారులు వేలిముద్ర లేదా ఫేస్ అన్‌లాక్ ద్వారా లావాదేవీలను నిర్ధారించడం వల్ల పిన్‌పై ఆధారపడటంతగ్గుతుంది. చెల్లింపులు యూజర్ బయోమెట్రిక్‌తో ముడిపడి ఉండటం వల్ల బలమైన భద్రత కూడా పెరుగుతుందని ఆమె వివరించారు. బయోమెట్రిక్ డేటా వినియోగదారుడి ఫోన్‌లోనే సురక్షితంగా నిల్వ ఉండటం వల్ల పిన్ షేరింగ్ వంటి ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. భద్రత దృష్ట్యా రూ.5,000కంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు మాత్రం వినియోగదారులు తప్పనిసరిగా యూపీఐ పిన్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇది పెద్ద మొత్తంలో జరిగే చెల్లింపులకు అదనపు రక్షణ కల్పిస్తుంది. ఫేషియల్ రికగ్నిషన్ సపోర్ట్ చేసే ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లలో అందుబాటులోకి వచ్చింది.

## రూ.8 వేల కోట్లకు మణిపాల్ ఐపిఒ సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలు

**ముంబయి, మార్చి 24:** మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఐపిఒ జారీ కోసం ఎబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఐపిఒద్వారా రూ.8 వేలకోట్లు నిధులు సమీకరించే లక్ష్యంతో ఉంది. ఇంపెరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్, మెడికల్‌గ్రూప్ ఇండియాలు ప్రమోటర్లుగా ఉన్నారు. వీరే ఆఫర్‌ఫర్‌సేల్ పద్ధతిలో షేర్లను విక్రయించనున్నారు. మొత్తం 4.32 కోట్ల వాటాలను విక్రయించనున్నట్లు తేలింది. ఈక్విటీ షేర్లను ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లోకూడా లిస్టింగచేస్తాయి. ప్రీ ఐపిఒ ప్లేస్‌మెంట్ కిందరూ.1600 కోట్లు సమీకరించాలన్న నిర్ణయం ఉంది. కోటక్ మహీంద్రకేపిటల్; యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌మాన్‌శాక్స్ సెక్యూయరిటీస్, జెఫరీస్ ఇండియా, జెపిమోర్గాన్ ఇండియా, యుబిఎస్ సెక్యూరిటీస్ ఇండియా, డిబిఎస్‌బ్యాంక్ ఇండియాలు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు. కెఫిన్‌టెక్నాలజీస్ ఇష్యూ రిజిస్ట్రార్‌గా ఉంది. తాజా ఇష్యూ ద్వారా వచ్చే 5378 కోట్లు రుణాల చెల్లింపులకు వడ్డీ చెల్లింపులకు వినియోగిస్తారు. మణిపాల్ హాస్పిటల్స్ ఇతర అనుబంధ సంస్థల బకాయిలు చెల్లించాలని నిర్ణయించారు. 574 కోట్ల రూపాయలు షహ్యాద్రి ఆసుపత్రిలో వాటా కొనుగోలుకు వినియోగిస్తారు. ఇతర మొత్తాన్ని సాధారణ పాలనాపరమైన ఖర్చులకు వినియోగిస్తారు. మణిపాల్ ఆసుపత్రి 38 ఆసుపత్రులను నిర్వహిస్తోంది. 10,761 పడకలు 14రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తరించింది. కార్యకలాపాలద్వారా 2025 ఆర్థిక సంవత్సరంలో రాబడులు 8242.2 కోట్లుగా ఉన్నాయి. గడచిన ఆరు నెలల్లో అంటే సెప్టెంబరుతో ముగిసిన ఆరునెలలకు గాను 4713.05 కోట్లుగా ఉంది. గత ఏడాది లాభాలు కూడా 1081.67 కోట్లుగా ఉంది.




Atal Pension Yojana
pfrda

అరవై దాటిన తర్వాత
వృద్ధాప్యానికి ఆదాయ-భద్రత & ఆత్మగౌరవం

8.85 కోట్లు
అటల్ పెన్షన్ యోజనలో
చందాదారులుగా చేరారు



"మన ప్రభుత్వం భారతీయ పౌరులందరికీ ఆత్మగౌరవం మరియు సుఖశాంతులతో జీవించేటట్లుగా ఆర్థిక భద్రత సమకూర్చే లక్ష్యంతో పని చేస్తోంది"
గౌ॥ శ్రీ నరేంద్ర మోదీ
భారత ప్రధాని



ఈ రోజే మీరు కూడా చేరి, గ్యారంటీగా జీవితం అంతా పెన్షన్, ఇతర రెండు ప్రయోజనాలు కూడా పొందండి :-

1 రూ.1000/- లేదా రూ.2000/- లేదా రూ.3000/- లేదా రూ.4000/- లేదా రూ.5000/- యొక్క జీవితాంతం పెన్షన్ గ్యారంటీ
2 చందాదారుని మరణం తర్వాత భార్య లేదా భర్తకు జీవితాంతం సమానంగా పెన్షన్
3 భర్త/భార్య మరణానంతరం 60 సంవత్సరాల వరకు పదిలంగావున్న కార్పస్, నామినీకి తిరిగి చెల్లించడం

మీ వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉంటే అటల్ పెన్షన్ యోజనలో మీరు చేరవచ్చు

| ఈరోజే చేరండి తక్కువ చెల్లించండి | వయస్సు | పెన్షన్ స్లాబ్ (రూ) | చెల్లించవలసిన మొత్తం (రూ) | పెన్షన్ స్లాబ్ (రూ) | చెల్లించవలసిన మొత్తం (రూ) |
|---|---|---|---|---|---|
| | 18 | 1000 | నెల ఒక్కంటికి 42 | 5000 | నెల ఒక్కంటికి 210 |
| | 40 | 1000 | నెల ఒక్కంటికి 291 | 5000 | నెల ఒక్కంటికి 1454 |

మరింత సమాచారానికి APY పై QR కోడ్ స్కాన్ చేయండి

మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్/బ్యాంక్ సంప్రదించండి లేదా 1800 110 069కు పిలుపు ఇవ్వండి లేదా www.pfrda.org.in వీక్షించండి

CBC 15113/13/0004/2526

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.